
'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 135

శనివారం 5-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆంధ్రాబ్యాంకు లాభం జూమ్

క్యూ–1లో 29% పెరుగుదల.. 6.21 నుంచి 8.09 శాతానికి చేరిన ఎన్‌పీఏలు –బిజినెస్‌లో



భారత్ 622/9 డిక్లేర్డ్

అశ్విన్, సాహా, జడేజా హాఫ్ సెంచరీలు.. శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 50/2 –స్పోర్ట్స్‌లో

ఓటమి గుర్తుగా తెల్లజెండా ఎత్తాల్సిన స్థితిలో

ఒక ఎల్లో నాటకం

వైఎస్సార్‌సీపీ సవాళ్లకు సమాధానం చెప్పలేక ఒక కొసరు అంశంతో 'దేశం' శివాలు

సవాల్ 1 పన్నెండు రోజుల కిందట ముఖ్యమంత్రి నంద్యాల వస్తే గ్రౌండ్ సగం కూడా నిండలేదు. జగన్ మోహన్‌రెడ్డి సభకు గ్రౌండ్ నిండడమే కాకుండా మరో రెండు గ్రౌండ్ల జనం బైట నిలబడ్డారు. జనం అశేషంగా హాజరవడమే కాదు ఆయన ప్రసంగానికి అడుగడుగునా హర్షధ్వానాలు పలికారు.. నాయకుల ప్రసంగాలకు మద్దతు తెలిపారు. ఈ తిరుగులేని ప్రజావెల్లువ అధికార పార్టీకి కునుకు పట్టని సవాల్ విసిరింది.


సవాల్ 2 నైతిక విలువలకు పట్టం కడుతూ వైఎస్సార్‌సీపీలో చేరుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి చేత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించడం, ఆయన రాజీనామా లేఖను చూపించి మరీ పార్టీలో చేరడం ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఇదే తరహాలో 21మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించగలరా అని ఆ వేదికపై నుంచి వచ్చిన సవాలుకు జవాబు లేదు.

సవాల్ 3 చంద్రబాబు పాలనా వైఫల్యాలను తూర్పారబడుతూ ఆయన మోసాలను సోదాహరణంగా వివరిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి అనేక ప్రశ్నలు సంధించారు. వాటికి జవాబు లేదు.

ఎల్లో గ్యాంగ్ చేసిందేమిటంటే..

ఈ సవాళ్లు జనంలోకి బలంగా పోతే సమాధానం చెప్పుకోలేని స్థితి ఏర్పడుతుంది అని ఎల్లో గ్యాంగ్ భయప డింది. 21 మంది ఎమ్మెల్యేల రాజీనామాలు ఏవి అని అడిగితే ఏమీ చెప్పుకోలేని స్థితి ఏర్పడుతుందని ఆందోళన పడింది. బహిరంగ సభ బ్రహ్మాండంగా జరిగిందని, వేలాది మంది తరలివచ్చారనే సందేశం జనంలోకి వెళ్లకుండా అడ్డుకోవాలని పథకం రచించారు. చంద్రబాబు వైఫల్యా లను ఎండగడుతూ ఇన్ని రకాల మోసాలకు పాల్పడిన వ్యక్తిని ఏం చేయాలి.. ఎటువంటి శిక్ష వేయాలి అంటూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీకాత్మకంగా చేసిన ఓ చిన్న వ్యాఖ్యను పట్టుకుని కింది నుంచి పై వరకు ఆదేశాలు జారీ అయ్యాయి. తెల్లారేసరికి ప్రెస్‌మీట్లు పెట్టి టీవీల ముందు మాట్లాడాలని నాయకులకు, దిష్టిబొమ్మలు దహనం చేయాలని కార్యక ర్తలకు సందేశాలందాయి. ఎల్లో గ్యాంగ్‌కు అనుకూలంగా ఉన్న మీడియా దీనిని అందిపుచ్చుకుని రోజంతా నిరంతరాయ ప్రసారాలు చేసింది. ప్రజలకు సమాధానం చెప్పుకోలేక ఆత్మరక్షణలో పడిపోయి తెల్లజెండా ఎత్తాల్సిన స్థితిలో ఈ నాటకాన్ని రక్తికట్టించారు.

- వివరాలు 2లో



విశాఖ పెట్రో వర్సిటీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



సాక్షి, న్యూఢిల్లీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) బిల్లు– 2017ను లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన హామీ మేర కు ఇప్పటికే విశాఖలోని తాత్కాలిక క్యాంపస్‌లో ప్రారంభమైన ఐఐపీఈకి జాతీయ ప్రాధాన్య, స్వతంత్ర సంస్థగా గుర్తింపునిస్తూ వర్సిటీని ఇన్‌కార్పొరేట్ చేసేందుకుగానూ కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ శుక్రవారం సభలో బిల్లు ప్రవేశపెట్టారు. రూ.600 కోట్ల

మిగతా 2వ పేజీలో ▶

నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

- ఉప రాష్ట్రపతిని ఎన్నుకునేందుకు పార్లమెంట్ సభ్యులు నేడు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సాయంత్రానికి ఫలితం తేలనుంది. ఎన్‌డీఏ నుంచి వెంకయ్యనాయుడు బరిలో ఉండగా.. విపక్షాలు గోపాలకృష్ణ గాంధీని పోటీ నిలబెట్టిన విషయం తెలిసిందే.

మరణ ధ్రువీకరణకూ ఆధార్


అక్టోబర్ 1 నుంచి తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం

రాహుల్ కారుపై రాళ్ల దాడి

పగిలిన కారు అద్దాలు.. రాహుల్ క్షేమం

గుజరాత్ వరద ప్రాంతాల్లో పర్యటిస్తుండగా ఘటన

- వివరాలు 6లో



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఒంగోలు జాతి గిత్తలు

కేరళ కబేళాలకు ఒంగోలు జాతి పశువులు

కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వాటి మాంసం ఎగుమతి

చిత్తూరు పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ పశువులు


సాక్షి, తిరుపతి: రాష్ట్ర కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన ఒంగోలు జాతి పశువులను అక్రమార్కులు కేరళ కబేళాలకు తరలిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో ఈ జాతి పశు మాంసానికి ఉన్న డిమాండ్ దృష్ట్యా అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో నిర్వహించే

మిగతా 5వ పేజీలో ▶

కర్ణాటక గుప్పిట్లో కృష్ణమ్మ!

- కర్ణాటక బరితెగింపుతో శ్రీశైలంకు చేరని వరద నీరు
- దిగువకు విడుదల చేస్తున్నట్లు చూపుతూ వరదను మళ్లిస్తోన్న వైనం
- ఆల్మట్టి జలాశయంలో పది రోజుల కిందటే గరిష్ట స్థాయికి నీరు
- జూరాల జలాశయానికి కృష్ణ వరద జలాలు చేరని దుస్థితి
- కర్ణాటక జల చౌర్యంపై కేంద్రానికి ఫిర్యాదు చేయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

- వివరాలు 5లో



గ్రూప్-3 మెయిన్స్‌కు సర్వం సిద్ధం

- రేపు, ఎల్లుండి పరీక్షలు
- ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్

2లో

నేటి నుంచి ఎంసెట్ తుది విడత కౌన్సెలింగ్

8న సీట్ల కేటాయింపు

చేనేత రంగాన్ని జీఎస్టీ నుంచి మినహాయించండి

ప్రధానిని కోరిన ఎంపీ బుట్టా రేణుక



ప్రధాని మోదీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ బుట్టా రేణుక

సాక్షి, న్యూఢిల్లీ: చేనేత, చేనేత అనుబంధ రంగాలను వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి మినహాయించాలని కర్నూలు ఎంపీ బుట్టా రేణుక ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పార్లమెంటులో ప్రధానిని కలిసిన రేణుక, పన్ను విధించడం వల్ల చేనేత రంగంపై పడుతున్న భారాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాటన్ ఫైబర్, యార్న్, ఫ్యాబ్రిక్‌పై ఐదు శాతం పన్ను, సింథటిక్ ఫైబర్‌పై 18 శాతం పన్ను, మ్యాన్‌మేడ్ యార్న్‌పై 18 శాతం పన్ను విధించడం వల్ల చేనేత రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందని వివరించారు. ఈ రంగం సంక్షోభంలో కూరుకుపోకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు.

పన్ను ఎగవేతదారులు తెలుగు రాష్ట్రాల నుంచే అధికం

సాక్షి, న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ప్రచురించిన 96 మంది పన్ను ఎగవేతదారుల్లో 30 మంది తెలుగు రాష్ట్రాల నుంచే ఉన్నారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి శుక్రవారం రాతపూర్వక సమాధానమిచ్చారు. దీనికి సంబంధిత వివరాలను ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని తెలిపారు.

గోదావరితో మహానదిని అనుసంధానించాలి

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ



ఆకివీడు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అనంతరం మహానదితో గోదావరిని అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నదులను అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టిసీమను పెన్నాకు అనుసంధానం చేయడం ద్వారా రాయలసీమతో పాటు చెన్నై వరకు నీరు సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. పోలవరం నిర్మాణ పనుల్ని మూడేళ్ల కిందటే ప్రారంభించి ఉంటే నిర్మాణ పనులు పూర్తయ్యేవని చెప్పారు.

నేటినుంచి ఎంసెట్ తుది విడత కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ ఎంసెట్-2017 తుది విడత కౌన్సెలింగ్ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఇదివరకు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాలేకపోయిన వారు, ఆప్షన్లు ఇచ్చుకోని వారు కూడా ఈసారి కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం శని, ఆదివారాల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఈనెల 8న తుది విడత సీట్ల కేటాయింపు చేయనున్నామని అడ్మిషన్ల కమిటీ కన్వీనర్ జీఎస్ పండాదాస్ తెలిపారు. రెండు విడతల కౌన్సెలింగ్‌లోనూ సీట్లు మిగిలిపోవడంతో ఈ తుది విడత కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఖాళీల సమాచారాన్ని కాలేజీల వారీగా ఎంసెట్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్లో (హెచ్‌టీటీపీఎస్://ఏపీఈఏఎంసీఈటీ.ఎన్‌ఐసీ.ఐఎన్) పొందుపరిచారు.

నేటి నుంచి రెండో విడత మెడికల్ వెబ్ కౌన్సెలింగ్

విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): రాష్ట్రంలో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల్లోని కాంపిటెంట్ అథారిటీ (ప్రభుత్వ, ప్రైవేటు ఏ-కేటగిరీ) సీట్లకు 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు రెండో విడత వెబ్ ఆప్షన్లకు అనుమతిస్తున్నట్లు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆప్షన్లు పెట్టుకున్న అభ్యర్థులకు 7న లేదా 8న సీట్లు కేటాయిస్తారని రిజిస్ట్రార్ వెల్లడించారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అనుబంధ ప్రభుత్వ, ప్రైవేట్ మైనార్టీ, నాన్‌మైనార్టీ కళాశాలలతో పాటు తిరుపతి పద్మావతి మహిళా మెడికల్ కళాశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు కూడా రెండో విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు పెట్టుకోవచ్చన్నారు.

ఒక ఎల్లో నాటకం

- జగన్ ప్రసంగాన్ని పక్కదోవ పట్టించే యత్నం
- సమాధానం చెప్పుకోలేక గోబెల్స్ ప్రచారం
- నంద్యాల సభకు భారీగా జనం హాజరుకావడంతో బెంబేలు
- జగన్ హామీలు ప్రచారం కాకుండా ఎత్తుగడలు
- పక్కదోవ పట్టించేందుకే ఈసీకి ఫిర్యాదు, ఫ్లెక్సీల దహనం
- అన్ని వర్గాలను ఆకట్టుకున్న జగన్ ప్రసంగం
- పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఇనుమడించిన ఉత్సాహం

సీన్ 1

సరిగ్గా 12 రోజుల క్రితం. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో నంద్యాలలోని ఎస్‌పీజీ గ్రౌండులో సమావేశం నిర్వహించారు. అధికారుల తోడ్పాటుతో, బెదిరింపులతో గ్రౌండును నింపే ప్రయత్నం చేసినా పట్టుమని పదివేల మంది రాలేదు. సీఎం ప్రసంగం మధ్యలోనే సగం మందికి పైగా మహిళలు సభ నుంచి వెళ్లిపోయారు. కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.



నంద్యాలలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ బహిరంగ సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలోని ఓ భాగం (ఫైల్)

సీన్ 2

అదే గ్రౌండ్. 12 రోజుల తర్వాత ప్రతిపక్ష నేత సభ. ఈ సభకు జనాన్ని వెళ్లనీయకుండా చేసేందుకు అధికారపార్టీ ఎన్నో ప్రయత్నాలు చేసింది. అధికారులను, పోలీసులను ప్రయోగించింది. ఉదయం నుంచే మహిళలతో వార్డుల వారీగా సమావేశాలు పెట్టారు. కుట్టుమిషన్లు ఇస్తామని పిలిచారు. జగన్ సభకు వెళ్లకపోతే ఒక్కొక్కరికి రూ.200 ఇస్తామని ఆశచూపారు. చీరలు ఇస్తామంటూ ప్రలోభపెట్టారు. ఐనా జనం ఆగలేదు. గ్రౌండు మొత్తం నిండిపోయింది. ఇసుక వేస్తే రాలనంత జనం. స్థలం లేక రోడ్లపైనే నిలబడ్డారు. జగన్ ప్రసంగం ఆసాంతం ఆసక్తిగా విన్నారు.

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాలలో జగన్ సభ తెలుగుదేశం నాయకులకు కకావికలం చేసింది. బహిరంగ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన అశేషజనాన్ని చూసి వారికి మతులుపోయాయి. బహిరంగ సభ కిక్కిరిసిపోవడం, ప్రసంగానికి మంచి స్పందన రావడం వారు జీర్ణించుకోలేకపోయారు. రాజీనామా చేసిన తర్వాతే పార్టీలోకి రావాలని శిల్పా చక్రపాణి రెడ్డిని ప్రతిపక్షనేత జగన్‌మోహన్ రెడ్డి పట్టుబట్టడం, నైతిక విలువలకు పట్టం కడుతూ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి పార్టీలోకి తీసుకోవడం చూసి నంద్యాలే కాదు యావత్‌రాష్ట్రం ఆశ్చర్యపోయింది. ఎందుకంటే 21 మంది ప్రతిపక్షపార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి కోట్లు కుమ్మరించి పదవులు ఎరవేసి పార్టీ కండువాలు కప్పిన చంద్రబాబునే అంతకుముందు అందరూ చూశారు. జగన్ వారికి కొత్తగా కనిపించారు. విలువలు లేని రాజకీయాలకు, విలువలతో కూడిన రాజకీయాలకు మధ్య తేడా స్పష్టంగా కనిపించిందని జనం వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు వైఫల్యాలను జగన్ సోదాహరణంగా వివరించి ఎండగట్టడం, హామీలను అమలు చేయడంలో చంద్రబాబు ఏ విధంగా విఫలమయ్యారో ఒకదాని తర్వాత ఒకటి విపులంగా వివరించడం నంద్యాల సభకు హాజరైన అశేష జనాన్ని విశేషంగా ఆకట్టుకుంది. వీటికి సమాధానం చెప్పుకోలేక ఆత్మరక్షణలో పడిపోయిన అధికార పార్టీ నాయకులకు ఏం చేయాలో దిక్కుతోచలేదు. జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో అన్ని విషయాలనూ వివరిస్తూ ఇంత దుర్మార్గమైన పరిపాలనను అందిస్తున్న చంద్రబాబును ఏం చేయాలో చెప్పాలని ప్రజలను అడుగుతూ సింబాలిక్‌గా అన్న ఒక్క మాటను పట్టుకుని దానిపై అందరూ మూకుమ్మడిగా దాడి చేయడం చూసి జనం విస్తుపోతున్నారు. జగన్ ప్రసంగంలో ముఖ్యమైన అంశాలన్నిటినీ వదిలేసి చంద్రబాబుపై చేసిన ఆ ఒక్క వ్యాఖ్యను పట్టుకోవడం చూస్తుంటే.. 'ఓటమి ఏటిలో కొట్టుకుపోతున్న వాడు గడ్డిపోచ పట్టుకుని సంబరపడిన చందం'గా ఉందని వైఎస్సార్‌సీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

పక్కదోవ పట్టించే ఎత్తుగడలు..

మూడున్నరేళ్లుగా అధికారంలో ఉంటూ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయని వ్యక్తిని, అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఏం చేసినా తప్పు లేదన్న తరహాలో చేసిన వ్యాఖ్యను అధికారపార్టీ నేతలు చిలువలు పలవలు చేయడం మొదలుపెట్టారు. అంతేకాదు ఆయన దగ్గర తుపాకులు ఉన్నాయేమో అని... ఆయన వల్ల చంద్రబాబుకు హాని ఉందనే స్థాయికి ప్రచారాన్ని తీసుకెళ్లారు. నంద్యాలను జిల్లా చేస్తామని, ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, ముస్లింలకు 2018లో పార్టీకి వచ్చే ఒక్కగానొక్క ఎమ్మెల్సీ స్థానాన్ని ఇస్తామని జగన్ ప్రకటించడంతో ఇన్నాళ్లగా తాము ప్రచారం చేసుకుంటున్న అభివృద్ధి మంత్రం కాస్తా తేలిపోయిందని అధికారపార్టీ నేతలకు అర్థమయ్యింది. దీంతో జగన్ ప్రసంగాన్ని, ఆయన ఇచ్చిన హామీలను పక్కదారి పట్టించి జనాల మెదళ్లను డైవర్ట్ చేసేందుకు మాటల దాడులకు దిగారు. డిప్యూటీ సీఎం స్థాయి వ్యక్తి నంద్యాలలో ఏకంగా రెండుసార్లు ఇదే అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు ఇతర ప్రాంతాల్లో కూడా మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు, అధికార ప్రతినిధులు, నేతలు మాటల దాడులకు దిగుతున్నారు. జగన్ సభ ద్వారా వచ్చిన పాజిటివ్ ఇమేజీని డ్యామేజ్ చేసేందుకు ఆ పార్టీ నేతలు సిద్ధమయ్యారు. అయితే, ఈ ఒక్క అంశంతోనే మొత్తం జగన్ సభ సక్సెస్‌ను పక్కదారి పట్టించడం సాధ్యమయ్యే పనికాదని రాజకీయ నిపుణులు అంటున్నారు.

జనంలో హర్షాతిరేకాలు

నంద్యాలను జిల్లా చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఆ కలను సాకారం చేస్తానని జగన్ హామీ ఇవ్వడంతో జనంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అభివృద్ధి కాంక్షిస్తున్న ప్రజలు చాలా సంతోషపడ్డారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆ సామాజికవర్గానికి చెందిన ప్రతినిధులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా చంద్రబాబు పట్టించుకోలేదు. రోడ్ల విస్తరణ పనుల వల్ల కూడా నష్టపోయినవారిలో ఈ వర్గానికి చెందినవారు అధికంగా ఉన్నారు. ఆర్యవైశ్యులు, ముస్లింలు, కాపు సామాజికవర్గానికి చెందినవారు ఎక్కువమంది నష్టపోయారు. ఎంతో ముందుచూపుతో జగన్ తమ గురించి ఆలోచించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే తమకు తగిన నష్టపరిహారం ఇస్తానన్నారని వారు సంతోషంతో ఉన్నారు. ఖురాన్‌లోని అంశాలను జగన్ ఎక్కడా తొట్రుపడకుండా పూర్తిసాధికారికంగా వివరించడంతో ముస్లిం సోదరులలో సానుకూల వాతావరణం ఏర్పడింది. కొంత కాలం కిందటి వరకూ తమదే గెలుపు అన్న ధీమాతో ఉన్న టీడీపీ నాయకత్వం ఒక్కసారిగా పరిస్థితి మారిపోయేటప్పటికి తట్టుకోలేకపోయింది. జగన్ ప్రసంగంలో ఎలాంటి తప్పులూ పట్టుకోలేక, సమాధానం చెప్పుకోలేక కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లుగా టీడీపీ నాయకులు విమర్శలకు పూనుకున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆశ్చర్యపోయేలా చేసిన రాజీనామా..

ప్రతిపక్ష పార్టీకి చెందిన 21 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చంద్రబాబు వారి చేత రాజీనామా చేయించలేదు. తిరిగి ప్రజా తీర్పు కోరాలన్న డిమాండ్లు వచ్చినా పట్టించుకోలేదు. అధికారపార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వస్తున్న ఎమ్మెల్సీ చేత జగన్ రాజీనామా చేయించి ఆ తర్వాతే పార్టీలో చేర్చుకోవడం చూసి రాష్ట్రమంతా ఆశ్చర్యపోయింది. అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష పార్టీలోకి రావడమే ఒక విశేషమనుకుంటే పదవికి రాజీనామా చేసి మరీ రావడం విలువలతో కూడిన రాజకీయాలకు నిదర్శనమని జనం చర్చించుకుంటున్నారు. ఇది నంద్యాల ఉప ఎన్నికల్లో ఎక్కువగా ఉన్న అర్బన్ ఓటర్లల్లో కచ్చితంగా ప్రభావం చూపుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ వచ్చిన తర్వాత నంద్యాలలో పరిస్థితి తారుమారైపోయిందని టీడీపీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ముస్లింలలో మస్తుజోష్

మొదటి నుంచీ అధికారపార్టీ నేతలు శిల్పా మోహన్ రెడ్డి వ్యక్తిత్వంపై అసత్య ప్రచారం చేస్తూ వచ్చారు. తద్వారా ముస్లింలను దూరం చేయగలిగామని భావిస్తూ వచ్చారు. అయితే జగన్ పర్యటన తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2018లో తమ పార్టీకి వచ్చే ఏకైక ఎమ్మెల్సీ స్థానాన్ని నంద్యాల ముస్లింలకు ఇస్తామని వైఎస్ జగన్ ప్రకటించారు. దీంతో ఈ వర్గం ఓట్లు కూడా తమకు దక్కకుండా పోతాయనే ఆందోళన అధికారపార్టీకి మొదలైంది.

కొనసాగుతున్న బెదిరింపులు

సగం కేబినెట్ నంద్యాలలోనే మకాం వేసినప్పటికీ, ఎన్ని ప్రలోభాలకు దిగినప్పటికీ జగన్ సభకు అశేష జనవాహిని తరలిరావడం.... రోడ్ల మీద నిలబడి మరీ ప్రసంగం వినడం అధికారపార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. అందుకే ఒకవైపు జగన్ ప్రసంగంపై దుష్ప్రచారాలకు దిగడంతో పాటు ప్రతిపక్ష పార్టీలో ఉన్న నేతలు, కార్యకర్తలపై పోలీసులతో దాడులు జరిపిస్తున్నారు. ఇప్పటికే కౌన్సిలర్లు సుబ్బరాయుడు, అనిల్ అమృత్‌రాజ్ ఇళ్లపై దాడులు జరిగాయి. తాజాగా మిట్నాలలో తిరుమల్ రెడ్డి ఇంట్లో కూడా సోదాలు నిర్వహించారు. ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మకాం వేసిన లాడ్జిలనే ఎంచుకుని మరీ సోదాలు నిర్వహిస్తున్నారు.

బర్డ్ ఆస్పత్రికి శివనాడార్ రూ. కోటి విరాళం

తిరుపతి(అలిపిరి): తిరుపతి బర్డ్ ఆస్పత్రికి హెచ్‌సీఎల్ అధినేత శివనాడార్ రూ.కోటి విరాళంగా అందజేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో జేఈవో శ్రీనివాసరాజుకు శుక్రవారం చెక్కు అందజేశారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. శివనాడార్ శ్రీవారి దర్శనానికి వచ్చిన ప్రతిసారీ స్వామివారికి విరాళం ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గతంలో టీటీడీ భద్రతా వ్యవస్థ పటిష్టం కోసం రూ. 5 కోట్లు విరాళంగా అందజేశారని గుర్తు చేశారు.

విశాఖ పెట్రో వర్సిటీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

▶ మొదటి పేజీ తరువాయి

అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఈ వర్సిటీ కోసం ఏపీ ప్రభుత్వం 200 ఎకరాల స్థలమిచ్చిందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అనంతరం బీజేపీ ఎంపీ హరిబాబు మాట్లాడుతూ.. మానవ వనరుల శాఖకు చెందిన ఏడు సంస్థల్లో ఇప్పటివరకూ ఐదు సంస్థలు ఏపీలో ప్రారంభమయ్యాయని చెప్పారు. ఐఐపీఈని సాధ్యమైనంత త్వరగా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 2023లోగా వర్సిటీని పూర్తిస్థాయిలో నిర్మించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పెట్రోలియం వర్సిటీని ఏర్పాటు చేసి కేంద్రం తన హామీ నిలబెట్టుకుందన్నారు. కేవలం పెట్రో ఉత్పత్తులపైనే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై కూడా ఈ సంస్థ పరిశోధనలు జరిపేలా చూడాలని కోరారు. వర్సిటీలో త్వరితగతిన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, కేవలం నలుగురు ఫ్యాకల్టీ సభ్యులతో సంస్థ నడవదన్నారు. కాగా, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా పేద మహిళలకు ఎల్‌పీజీ కనెక్షన్లు ఇస్తున్నందుకు గానూ కేంద్రానికి వైవీ సుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తు ఉండదు

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాకలపాటి సన్యాసిరాజు స్పష్టీకరణ

శృంగవరపుకోట రూరల్: రాబోయే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉండదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాకలపాటి సన్యాసిరాజు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం బొడ్డవరలో పార్టీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ.. ఇప్పటినుంచే గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడలో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో వేలాదిమంది కార్యకర్తలు 'లీవ్ టీడీపీ..సేవ్ బీజేపీ' ప్లకార్డులు ప్రదర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి కార్యకర్త మనసులో కూడా టీడీపీకి బీజేపీ దాసోహమవ్వటమనే భావన ఇష్టం లేదన్నారు. విజయనగరం జిల్లాలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను నిలిపే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు.

గ్రూప్-3 మెయిన్స్‌కు సర్వం సిద్ధం

రేపు, ఎల్లుండి పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 1,055 పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీ కోసం ఈ నెల 6, 7 తేదీల్లో (ఆది, సోమవారాల్లో) గ్రూప్-3 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయభాస్కర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం వరకు, ఆ తర్వాత మూడు గంటల నుంచి 5.30 వరకు ఈ పరీక్ష రెండు పేపర్లలో కంప్యూటరాధారితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేపర్-1లో జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ, పేపర్-2లో 'రూరల్ డెవలప్‌మెంట్, ప్రోబ్లమ్స్ ఇన్ రూరల్ ఏరియా విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ఆంధ్రప్రదేశ్'లో ఈ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆరో తేదీన తొమ్మిది జిల్లాల్లో, 135 సెంటర్లలో 35,150 మంది ఈ పరీక్ష రాయనున్నారని, ఏడో తేదీన నాలుగు జిల్లాల్లో 68 సెంటర్లలో 17,600 మంది అభ్యర్థులకు ఈ పరీక్ష జరుగుతుందని వివరించారు.

ఐడీ కార్డులుంటేనే అనుమతి

అభ్యర్థులు హాల్ టికెట్లతో పాటు ఒరిజినల్ అధికారిత ఫొటో ఐడీ కార్డులు తెచ్చుకోవాలని, వాటిని పరిశీలించాకే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 8.45 వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.15 వరకు లోపలకు అనుమతి ఉంటుందని, ఆలస్యమైన వారి కోసం మరో 15 నిముషాలు గ్రేస్ పీరియడ్‌ను కేటాయించినట్లు చెప్పారు. పెన్ను, రఫ్ షీట్లు పరీక్ష కేంద్రాల్లోనే సమకూర్చనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ఫొటోలను తీసుకోవడంతో పాటు వారి ఎడమచేతి బొటనవేలి ముద్రలు కూడా తీసుకుంటారని, అభ్యర్థులు మెహందీ, ఇంకు వంటివి ఆ వేళ్లకు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

క్వాలిఫయింగ్ మార్కులు రావాల్సిందే

గ్రూప్-1పై ఏపీపీఎస్సీ ప్రకటన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 78 గ్రూప్-1 పోస్టుల భర్తీకోసం నిర్వహించే మెయిన్స్ పరీక్షల్లో అభ్యర్థుల క్వాలిఫయింగ్ మార్కులపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం ప్రకటన విడుదలచేసింది. జనరల్ ఇంగ్లీషుతో పాటు ఇతర పేపర్లలోనూ క్వాలిఫయింగ్ మార్కులను నిర్దేశించింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి ప్రకటన విడుదలచేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను ఆగస్టు 17వ తేదీ నుంచి 28 వరకూ నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

- జనరల్ ఇంగ్లీషు మినహా ఇతర పేపర్లను ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో దేన్నయినా అభ్యర్థులు ఎంచుకోవచ్చు. అలా ఎంపిక చేసుకున్న మాధ్యమంలోనే అ పేపర్లన్నిటినీ రాయాలి.
- ఓ పేపర్‌ను ఒక మాధ్యమంలో, మరో పేపర్‌ను మరో మాధ్యమంలోనూ రాసేందుకూ వీల్లేదు.
- జనరల్ ఇంగ్లీషు పేపర్ క్వాలిఫయింగ్ పేపర్ మాత్రమే. ఈ మార్కులను ర్యాంకింగ్‌కు పరిగణనలోకి తీసుకోరు. జనరల్ ఇంగ్లీషులో ఓసీలకు 40%, బీసీలకు 35%, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 30% మార్కులు రావాలి. ఇతర పేపర్లలో కూడా ఇదే రకంగా క్వాలిఫయింగ్ మార్కులు సాధించాలి. ఇతర పేపర్లన్నింటిలో వచ్చిన అన్ని మార్కులను కలుపుకొని ఈ క్వాలిఫయింగ్ శాతం మార్కులు వచ్చాయో లేదో చూస్తారు.
- క్వాలిఫయింగ్ మార్కుల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు మినహాయింపులిచ్చారు. జనరల్ ఇంగ్లీషులో నిర్ణీత శాతంలో క్వాలిఫై మార్కులు వారు సాధించాల్సి ఉంటుంది. ఇతర పేపర్లలో నిర్ణీత క్వాలిఫై మార్కులు సాధించిన వారు లేకపోతే ఆ తర్వాతి స్థానాల్లో ఉన్న వారిని మెరిట్ ప్రాతిపదికన తీసుకుంటారు.

హామీ ఇచ్చి తప్పించుకుంటారా?

- కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో జాప్యంపై హైకోర్టు ఆగ్రహం
- అధికారులను పిలిపిస్తే తప్ప ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయరా?
- కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని మూసివేసే ప్రసక్తే లేదన్న ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: తూర్పు గోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలన్న ఉత్తర్వుల విషయంలో తప్పును తమపై తోసేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకవేళ తాము తప్పుగా ఉత్తర్వులు ఇచ్చి ఉంటే... ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చి, తప్పును సరిదిద్దే ప్రయత్నం ఎందుకు చేయలేదని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కరికాళ వలవన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌ను నిలదీసింది. 2016 నవంబర్ నాటికి ఎన్నికలు పూర్తి చేస్తామంటూ హామీ ఇచ్చి, ఇప్పుడేమో జాప్యానికి బాధ్యులం మేం కాదంటూ తప్పించుకోవడం సరికాదని హితవు పలికింది. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశామని ఎన్నికల కమిషనర్ తరపు న్యాయవాది డి.వి.సీతారామ్మూర్తి కోర్టుకు నివేదించారు. దీనికి ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ... ఇరువురు అధికారులను కోర్టుకు పిలిపిస్తే తప్ప నోటిఫికేషన్ జారీ చేయరా? అని వ్యాఖ్యానించింది. ఈ కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని మూసివేసే ప్రసక్తే లేదని, తమ ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘించారా? లేదా? అన్న విషయాన్ని తేలుస్తామని ధర్మాసనం తేల్చి చెప్పింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 1కి వాయిదా వేసింది. ఎన్నిక నిర్వహణ నిమిత్తం గురువారం జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడానికి ధర్మాసనం అంగీకరించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి పి.నవీన్‌రావులతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

కౌంటర్ దాఖలు చేస్తాం.. సమయం ఇవ్వండి

పాలక మండలి గడువు ముగిసినా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాల్ చేస్తూ సీహెచ్ నారాయణమూర్తి 2015లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. 2016 నవంబర్ కల్లా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని పురపాలకశాఖ, ఎన్నికల కమిషనర్ హామీ ఇచ్చారు. అయితే, ఈ హామీ మేర ఎన్నికలను నిర్వహించకపోవడంతో నారాయణమూర్తి కోర్టు ధిక్కార వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. హామీ ప్రకారం ఎన్నికల నిర్వహణలో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ అంగీకరించారు. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, అందుకు సమయం ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది.

ఆ రెండు వార్డులను మినహాయించండి

కాకినాడ ఎన్నికలపై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 42, 48 వార్డులుగా ఉన్న టీచర్స్‌కాలనీ, స్వామినగర్, ఎస్.అచ్యుతాపురం గ్రామాన్ని మినహాయించి కార్పొరేషన్ ఎన్నికలను యథావిధిగా కొనసాగించుకోవచ్చునని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఆ మూడు గ్రామాల్ని కార్పొరేషన్‌లో చేర్చడంపై 2015లో హైకోర్టు ఇచ్చిన స్టే ఇప్పటికీ అమలులో ఉన్నందున వాటికి కూడా కలిపి ఎన్నికలు నిర్వహించడం సరికాదన్న పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. టీచర్స్ కాలనీ, స్వామినగర్, ఎస్.అచ్యుతాపురం గ్రామాల్ని కలిపి.. 50 వార్డులుగా పునర్విభజన చేస్తూ మార్చి 4న పురపాలకశాఖ జారీ చేసిన జీవో 83ని సవాలు చేస్తూ గుమ్మడి శ్రీనుబాబు, మరో ఇద్దరు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఈ 50 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఈనెల 1న జారీచేసిన జీవో 298నూ వారు సవాలు చేశారు. దీనిపై జస్టిస్ ఎ.వి.శేషసాయి శుక్రవారం విచారణ జరిపారు. 42, 48 వార్డుల్ని మినహాయించి మిగతా వార్డులకు యథాతథంగా ఎన్నికలు నిర్వహించుకోవచ్చన్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై సర్కార్ వివక్ష




- నిధులివ్వకుండా ప్రజాస్వామ్యం ఖూనీ
- పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ టౌన్: ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం వివక్ష చూపుతోందని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం కర్నూలు జిల్లా డోన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు నిధులివ్వకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. డోన్ నియోజకవర్గానికి 40 ఏళ్లు ప్రాతినిధ్యం వహించానని గొప్పలు చెప్పుకుంటున్న డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి తన అనుచరులు సాగిస్తున్న దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు, ఇసుక దందా గురించి నోరు మెదపకపోవడం దారుణమన్నారు. నిరుపేదలకు చెందిన స్థలాలు ఆక్రమిస్తుంటే కేఈ నిద్రావస్థలో ఉన్నారా? అని ప్రశ్నించారు. డోన్ పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.60 కోట్లు విడుదల చేసి మంచినీటి పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. జీడీపీ(గాజులదిన్నె ప్రాజెక్టు) నుంచి 0.2 టీఎంసీల నీటిని కేటాయిస్తే అవి ఏమయ్యాయో డిప్యూటీ సీఎం కేఈ చెప్పాలన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించకుండా ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న పాలకవర్గంతోపాటు పెత్తనం చెలాయిస్తున్న టీడీపీ నాయకులు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. డోన్‌లో టీడీపీ మాఫియా రాజ్యమేలుతోందని బుగ్గన ఆరోపించారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులను బెదిరించి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

విశాఖ స్టీలుప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

- రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రత్యేక ప్రస్తావన
- ప్రధాన మంత్రి జోక్యం చేసుకోవాలని వినతి

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: విశాఖ స్టీలు ప్లాంట్ ఇతర గనులపై ఆధారపడకుండా సొంత ఇనుప ఖనిజం గనుల్ని కేటాయించాలని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ప్రత్యేక ప్రస్తావనల సందర్భంగా రాజ్యసభలో ఆయనీ అంశాన్ని లేవనెత్తారు. ''సొంత ఇనుప ఖనిజం గనులకోసం విశాఖ స్టీల్‌ప్లాంట్ చేస్తున్న ప్రయత్నాలు దశాబ్దాలు గడుస్తున్నా నెరవేరని దుస్థితి. దేశంలో విశాఖ స్టీల్‌ప్లాంటుకు తప్ప ప్రభుత్వరంగ స్టీలు ప్లాంట్లన్నింటికీ సొంత గనులున్నాయి. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ అనుసరిస్తున్న ఉదాసీన వైఖరివల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించిన 15 ఏళ్లలో తొలిసారిగా 2015-16లో రూ.1,421 కోట్ల మేరకు నష్టాలు చవిచూసింది. సొంత గనులు కలిగిన ఇతర స్టీల్‌ప్లాంట్లకు టన్ను ఖనిజానికి రూ.500 వ్యయమవుతుంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.4,500 ఖర్చవుతోంది. ఈ ప్లాంట్ తన ఉత్పత్తుల్ని ఇతర



ప్లాంట్లతో పోటీపడి మార్కెట్ రేట్లకు విక్రయించాల్సి రావడంతో ఇది నష్టాల్లో కూరుకుపోతోంది. అందువల్ల ఆలస్యం చేయకుండా ఈ ప్లాంటుకు సొంతంగా ఇనుప ఖనిజం గనులుండేలా చూడాలి. లేదంటే సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది.. ప్రధాని నరేంద్రమోదీ తక్షణం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి'' అని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతులకోసం ప్రత్యేక విత్తన బ్యాంకులు: కేంద్రమంత్రి

సంప్రదాయక విత్తన రకాల్ని కాపాడేందుకోసం ప్రత్యేకంగా విత్తన బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ రాజ్యసభలో వెల్లడించారు. ఇందులో ఒకటి ఢిల్లీలో ఉందని తెలిపారు. సంప్రదాయక విత్తన రకాలు తగ్గిపో తున్నాయని, అంతరించిపోయే దుస్థితి నెలకొందంటూ విజయ సాయిరెడ్డి లేవనెత్తిన ఓ ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. వీటిని పరిరక్షించేందుకు, వినియోగం పెంచేందుకు పలు చర్యలు చేపట్టినట్టు, ఇందులో భాగంగా వాటిని విత్తన బ్యాంకుల ద్వారా రైతులకు సరఫరా చేయనున్నట్టు వెల్లడించారు.

ఆహార భద్రత పథకానికి రూ.1700 కోట్లు

జాతీయ ఆహార భద్రత పథకానికి ఈ ఏడాది రూ.1,700 కోట్లు కేటాయించినట్టు కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి పర్‌షోత్తం రూపాలా వెల్లడించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడానికి గల కారణాలు, వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ పటిష్టానికి తీసుకుంటున్న చర్యలపై విజయసాయిరెడ్డి ప్రశ్నించగా.. మంత్రి బదులిచ్చారు. ఈ పథకం కింద ఇచ్చిన నిధుల్లో 20% అధిక దిగుబడులిచ్చే హైబ్రీడ్ విత్తనాల పంపిణీకి కేటాయించినట్టు తెలిపారు.

రైల్వే టికెట్ రద్దు ఆదాయం రూ.103 కోట్లు

ప్రయాణికులు రిజర్వు చేసుకున్న టికెట్లను రద్దు చేసుకోవడం వల్ల 2016-17లో దక్షిణమధ్య రైల్వేకు రూ.103.27 కోట్ల ఆదాయం వచ్చినట్టు రైల్వేశాఖ సహాయమంత్రి రాజన్ గోహైన్ తెలిపారు. విజయసాయిరెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ టికెట్ల రద్దు ద్వారా వచ్చే ఆదా యం ఈ ఏడాది 25% పెరిగిందన్నారు. 2016 -17లో అన్ని జోన్లలో రూ.1,400 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.

అంగరంగ వైభవంగా వరలక్ష్మీ వ్రతం



తిరుచానూరు/శ్రీశైలం: చిత్తూరు జిల్లా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీవ్రతం చేయడం ఆచారం. ఇందులో భాగంగా అమ్మ వారిని వేకువ జాము 1.30 గంటలకు సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహిం చారు. 3.30 గంటలకు అమ్మవారి మూలవర్లు, ఉత్సవర్లకు అర్చకులు అభిషేకం చేశారు. ఉదయం 8 గంటలకు పద్మావతి అమ్మ వారిని సన్నిధి నుంచి వేంచేపుగా వ్రతమండపంలో కొలువు దీర్చారు. 10 గంటలకు ఆలయ అర్చకులు కలశంలోకి వరలక్ష్మిని ఆవాహనం చేసి, షోడశో పచార పూజలు చేశారు. అలాగే వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో దంపతులు ఆలయానికి విచ్చేశారు. తర్వాత సాయంత్రం 6 గంటలకు తిరువీధుల్లో స్వర్ణరథంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులను దర్శన మిచ్చారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుపతి జేఈవో పోల భాస్కర్, సీవీఎస్‌వో ఆకే.రవికృష్ణ పాల్గొన్నారు. అలాగే కర్నూలు జిల్లా శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీవ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.

ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం సెప్టెంబర్‌లోగా పూర్తి

సాక్షి, అమరావతి: విశాఖ తీరంలోని రామకృష్ణ బీచ్‌లో ఏర్పాటు చేస్తున్న ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియంను సెప్టెంబర్ నుంచి సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తామని పర్యాటకశాఖ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. రూ.5 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న మ్యూజియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నౌకాదళ విజయాలలో తనదైన భూమిక పోషించిన టీయూ 142 ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలను రామకృష్ణ బీచ్ కురుసుర సబ్ మెరైన్ సమీపంలో తిరిగి బిగించే పనులు సాగుతున్నాయన్నారు. అలాగే విలేజ్ టూరిజం ప్రాజెక్టులు ఈ నెల 20వ తేదీకి ప్రారంభించాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో పెట్టుబడిదారుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రంలో దీనికి సంబంధించిన పూర్తి సమాచారం సిద్ధంగా ఉంచాలన్నారు.


సాక్షి
శనివారం, ఆగస్టు, 5

చట్టసభలు-జీతభత్యాలు

'మనదో చిత్రమైన ప్రజాస్వామ్యం. ఇక్కడ న్యాయమూర్తులే న్యాయమూర్తులను నియమించుకుంటారు. ఎంపీలు వాళ్ల జీతాల్ని వాళ్లే పెంచుకుంటారు'- పన్నెండేళ్ల క్రితం అప్పటి లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ చేసిన వ్యాఖ్య ఇది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఎంపీల జీతభత్యాలపై విమర్శనాత్మక వ్యాఖ్య పార్లమెంటులో వినబడింది. బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ జీరో అవర్‌లో దీన్ని లేవనెత్తుతూ కనీసం ఈ లోక్‌సభ కాలపరిమితి వరకూ మనం దాని జోలికి పోవద్దని కోరారు. అయితే ఆయనకు ఎవరినుంచీ పెద్దగా మద్దతు లభించలేదు. రాజ్యాంగంలోని 106, 195 అధికరణాలు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ జీతభత్యాలను తామే పెంచుకునే అధికారాన్నిస్తున్నాయి. న్యాయమూర్తుల నియామకాల కోసం ఉన్న కొలీజియం వ్యవస్థకు బదులు న్యాయ నియామకాల కమిషన్ ఏర్పాటుకు పార్లమెంటు ఒక చట్టం చేయడం, దాన్ని సుప్రీంకోర్టు కొట్టేయడం చరిత్ర. చట్టసభల సభ్యుల జీతభత్యాలకు సంబంధించి అలాంటి ప్రయత్నమేదీ జరగలేదు. అయితే సోమనాథ్ ఛటర్జీ కేవలం వ్యాఖ్యానించి ఊరుకోలేదు. ఈ అంశంపై ఒక అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో దాదాపు అన్ని పార్టీల నేతలూ ఈ విధానం సరైంది కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జీతభత్యాలను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అది అక్కడే ఆగిపోయింది. ఈ విషయంలో రాజ్యాంగ సవరణ బిల్లుగానీ, జీతభత్యాల కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లుగానీ రూపొందించే ప్రయత్నమే జరగలేదు. ఈలోగా మూడు, నాలుగు దఫాలు ఎంపీల జీతభత్యాలు మాత్రం పెరిగాయి. ఎంపీల జీతభత్యాలపై ఉభయ సభల సభ్యులతో ఒక కమిటీ ఉంటుంది. ప్రస్తుత యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని కమిటీ నిరుడు ఎంపీల జీతభత్యాలు సవరిస్తూ సిఫార్సు చేసింది.

అంతా పారదర్శకంగా, హేతుబద్ధంగా సాగుతుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. దాన్ని ప్రశ్నించేవారు కూడా ఉండరు. అలా లేనప్పుడే సమస్య అవుతుంది. ఏ ప్రమాణాల ఆధారంగా జీతభత్యాల పెంపు చేస్తున్నారో ఎవరికీ తెలియదు. వరుణ్‌గాంధీ బ్రిటన్ ఎంపీలతో తెచ్చిన పోలిక ఆలోచించదగ్గది. అక్కడి ఎంపీల జీతభత్యాలు గత పదేళ్లలో 13 శాతం పెరిగితే, మన ఎంపీలకు 400 శాతం పెరిగాయని ఆయన వివరించారు. బ్రిటన్ ఎంపీల జీతాల అంశాన్ని పరిశీలించేందుకు ఒక స్వతంత్ర సంస్థ ఉంది. ఆస్ట్రేలియాలో సైతం ఇలాంటి ఏర్పాటే చేసుకున్నారు. ఈ కారణం వల్లనే కావొచ్చు... ఆ దేశాల ఎంపీల జీతభత్యాల పెరుగుదల మరీ అతిగా లేదు. మన దేశంలో చిత్రమైన పరిస్థితి. సాగు ఖర్చు అపరిమితంగా పెరిగి, పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఏం చేయాలో దిక్కుతోచక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఇంతవరకూ దేశవ్యాప్తంగా 1,600మంది రైతులకు పైగా బలవన్మరణాల పాలయ్యారు. కేంద్రంలో పాలకులెవరున్నా రైతుల వ్యథ తీరడం లేదు. కానీ చట్టసభల సభ్యులకు మాత్రమే కాదు... కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ఉద్యోగుల జీతభత్యాలు కూడా ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. 1970లో గోధుమ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 76గా ఉంటే ఇప్పుడది రూ. 1,625 అయింది. అంటే ఈ 47 ఏళ్లలోనూ 21 రెట్లు పెరిగింది. మిగిలిన పంటల మద్దతు ధరలు కూడా అంతంతమాత్రమే. ఇదే కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సిబ్బంది జీతాలు దాదాపు 150 శాతం పెరిగాయి. ఇలాంటి వ్యత్యాసాలు బాహాటంగా కనిపిస్తున్నప్పుడు కనీసం తమవరకైనా సంయమనం పాటించాలన్న స్పృహ చట్టసభల సభ్యులకు ఉండాలి. 2001లో రూ. 12,000గా ఉన్న ఎంపీ జీతం నిరుడు పెంచిన తర్వాత రూ. 1,00,000 అయింది. తమ పంటలకు గిట్టుబాటు ధరలు కావాలని, రుణమాఫీ వర్తింపజేయాలని తమిళనాడు రైతులు గత కొన్ని నెలల నుంచి సాగిస్తున్న ఆందోళన ఇంకా విరమించలేదు. వారి సమస్య మాటేమోగానీ తమిళనాడు అసెంబ్లీ గత వారం ఎమ్మెల్యేల జీతాలను రూ. 55,000 నుంచి ఒక్కసారిగా రూ. 1,05,000కు పెంచుతూ తీర్మానించింది. రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా చోటుచేసుకునే మహారాష్ట్రలో నిరుడు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాలు రూ. 75,000 నుంచి ఒకేసారి రూ. 1,70,000కు పెరిగాయి. చిత్రమేమంటే ఇలా పెంచినప్పుడు చట్టసభల్లో కనీసం ఒక్క నిరసన స్వరమైనా వినబడటం లేదు. ఆమధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి కొన్ని మినహా చాలా దేశాల్లో ఎంపీల జీతభత్యాల పెంపును అక్కడి చట్టసభల్లోనే నిర్ణయిస్తారు. అమెరికాలో వివిధ రాష్ట్రాలు వివిధ రకాల విధానాలను అనుసరిస్తున్నాయి. దాదాపు 19 రాష్ట్రాలు ఎంపీల జీతభత్యాలపై కమిషన్‌లు ఏర్పాటు చేయగా కొన్నిచోట్ల చట్టసభలే ఆ నిర్ణయం తీసుకుంటాయి. మరికొన్ని రాష్ట్రాలు కమిషన్ నిర్ణయాలను సభలో చర్చించి వాటిని సవరించుకునే స్వేచ్ఛను దఖలు పరచుకున్నాయి. మన రాజ్యాంగ నిర్మాతలు అప్పట్లో వివిధ దేశాల రాజ్యాంగాలనూ, అక్కడి పాలనా సంప్రదాయాలనూ అధ్యయనం చేశారు. ఆ సమయంలో చాలాచోట్ల చట్టసభల నిర్ణయమే అంతిమంగా ఉండేది కనుక ఆ ఒరవడినే బహుశా ఇక్కడా కొనసాగించి ఉండొచ్చు. అయితే వరుణ్‌గాంధీ చెప్పినట్టు ఎంపీల జీతభత్యాలు దశాబ్దకాలంలో 400 శాతం పెరగడం ఆరోగ్యకర ధోరణిని ప్రతిబింబించదు. కనీసం ఇలా పెంచినప్పుడు చర్చ జరగడం, ఆ నిర్ణయంపై అన్ని పార్టీల సభ్యులు మాట్లాడటమనే సంప్రదాయం ఉంటే అందులోని మంచిచెడ్డలు ప్రజలందరికీ అర్థమవుతాయి. అలాకాక అన్ని పార్టీలూ మౌనంగా ఉండిపోవడం ద్వారా ఆమోదముద్ర వేస్తుంటే ప్రజలకు ఎలాంటి సంకేతాలు వెళ్తాయి? ప్రతి అంశంపైనా చట్టసభల్లో చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకర లక్షణం. అది ఎటూ లేదు. కనీసం తమ జీతాల విషయంలోనైనా దాన్ని పాటించడం అత్యవసరమని ప్రజాప్రతినిధులు గుర్తించాలి.



స్వప్రయోజనాలు, ప్రజల పట్ల బాధ్యత అనేవి ఎదురెదురుగా నిలిచినప్పుడు దేనికి ప్రాధాన్యత ఇవ్వాలనేదే నేతల గొప్పతనానికి గీటురాయి.

– విన్‌స్టన్ చర్చిల్
బ్రిటన్ పూర్వ ప్రధాని

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.త్రయోదశి రా.8.15 వరకు, తదుపరి చతుర్దశి నక్షత్రం పూర్వాషాఢ రా.12.06 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం ఉ.8.14 నుంచి 10.01 వరకు, దుర్ముహూర్తం ఉ.5.43 నుంచి 7.25 వరకు, అమృతఘడియలు సా.6.49 నుంచి 7.44 వరకు.

సూర్యోదయం	: 5.42	10.30 వరకు
సూర్యాస్తమయం	: 6.30	యమగండం:
రాహుకాలం:		ప.1.30 నుంచి
ఉ.9.00 నుంచి		3.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	: 4.39		మగ్రీబ్	: 6.47
జొహర్	: 12.22		ఇషా	: 8.05
అసర్	: 4.50			

యుద్ధోన్మాదుల శాంతి జపం



శేఖర్ గుప్తా

చైనా మనతో నిజమైన యుద్ధాన్ని కోరుకోవడం లేదు. ఇది 1962 కాదు కాబట్టి అది దానికి చాలా ఇబ్బందికరం అవుతుంది. అది నిజానికి మనతో బలవంతపు దౌత్యాన్ని సాగిస్తోంది. దాడికి, రెచ్చగొట్టడానికి అది తన సొంత మీడియానే సాధనంగా వాడుతోంది. ఆగ్రహావేశపూరితమైన మన చానళ్లు చైనాపై స్టూడియో యుద్ధాన్ని ప్రారంభించాలని నా వాదన కాదు. వాస్తవానికి వారలా చేయకపోవడం వల్ల అంతా మంచే జరుగుతోంది. కాబట్టే పాకిస్తాన్ విషయంలో వలే ప్రజాభిప్రాయం ఇంకా అదుపు తప్పిపోలేదు.

డోక్లామ్ వివాదంపై భారత మీడియా ఆచితూచి స్పందిస్తుండటం వల్ల అంతా మంచే జరుగుతుంది. కాకపోతే అది అలవాటులో పొరపాటు కాకుండా ఉండాలి.

ముందుగా కాస్త దారితప్పి ఓ విషయాన్ని చెప్పనివ్వండి, ఎందుకైనా మంచిది దానితో పాటే క్షమాభిక్ష లేదా ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోనివ్వండి. నాకూ, నా కుటుంబానికి బతికున్న మరే జీవులకంటే పిల్లులు, కుక్కలంటేనే ఎక్కువ ప్రేమ. కాబట్టి అద్భుతమైన ఆ కుటుంబ సభ్యుల నుంచి మేం ఎన్నో జీవిత పాఠాలను నేర్చుకున్నాం. క్రికెట్ క్రీడ లాగే అవి కూడా నా రాజకీయ రచనలలోకి తొంగి చూస్తుంటాయి. డోక్లాం వివాదం మోదీ ప్రభుత్వం ఎదుర్కొంటున్న మొట్టమొదటి నిజమైన వ్యూహాత్మక సంక్షోభం. ఇంత సుదీర్ఘమైన ఉపోద్ఘాతమంతా, సిక్కిం సరిహద్దుల్లోని ఆ పరిస్థితి పట్ల నా సొంత వృత్తియైన వార్తా మీడియా వైఖరిని మా మొదటి మూడు కుక్కల తీరుతో పోల్చి చూపి... ఒక ముఖ్య విషయాన్ని చెప్పడానికే.

ఎనభైల మొదట్లో, మేం షిల్లాంగ్‌లో ఉండగా మా మూడు లాసా కుక్కలు మూడూ మిగతా ప్రపంచంతో సంబంధం లేనట్టుగా మా చిన్న తోటలో దర్పం ఒలకబోస్తూ బద్ధకంగా తిరుగుతుండేవి. ఎవరైనా మనిషి లేదా జంతువు ఆ దారంట పోతుంటే మహోగ్రంగా దాడికి దిగుతున్నట్టు నటిస్తూ మొరుగుతుండేవి. ఒక రోజున మా పొరుగున ఉండే ఆదివాసీ కుటుంబం వారి కోళ్లను ఆరు బయటకు వదిలింది. ఉండీ లేనట్టుండే మా గొలుసు కంచె దగ్గరకు సహజమైన రంగురంగుల దుస్తులను ధరించిన రెండు కోడిపుంజులు వచ్చాయి. విడ్డూరాల్లోకెల్లా విడ్డూరమనిపించేలా మా కుక్కలు అలవాటుగా ఆగ్రహంతో మొరగడానికి బదులు... ఆ పుంజుల పట్ల పూర్తి ఉదాసీనతను చూపాయి. వేరే వైపుకు చూడ్డం మొదలెట్టి, దారిన పొయ్యేవారిని చూసి మొరగడం ప్రారంభించాయి. అవి అంతకు ముందెన్నడూ అలాంటి ''ముప్పు'' ఎదుర్కోలేదు మరి. ఎందుకైనా మంచిదని జంకాయి. అది చూసిన మేం వాటిని ఎంతగా బుజ్జగించినా, రెచ్చగొట్టినా అవి మాత్రం ఆ కోడి పుంజులు లేనే లేవన్నట్టుగా వాటిని పట్టించుకోలేదు. చెడిపోయిన ఆ ఇంటి కుక్కలు చిన్నవే అయినా, వాటికి మనుగడను కాపాడుకోవాలనే స్పృహ మాత్రం బాగా ఉంది.

చైనా అంటే భయమా?

ఆ పాత కథ ఇప్పుడు ఎందుకో ముందే చెప్పాను. అయినా తెలియదనేట్టయితే లేదా తెలియనట్టు నటించేట్టయితే... మీరు భయం గొలిపే మన అతి దేశభక్తియుత కమాండో చానళ్లను గుర్తుకు తెచ్చుకోండి. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటలపాటూ అవి మన దేశానికి నిజమైన లేదా ఊహాత్మకమైన విదేశీ లేదా దేశీయ శత్రువులనందరినీ చీల్చి చెండాడటాన్నీ, ఆగ్రహంతో రంకెలువేస్తూ, ఊహకు అందే ప్రతి కాల్పనికమైన ముప్పు మీదకూ మళ్లడాన్ని గుర్తుచేసుకోండి. డోక్లామ్‌లో చైనా చొరబాటు, కంచెకు అవతలి ఆ కోడిపుంజుల లాంటిదేనని అనుకుని ఆలోచించండి. మన యోధులు వారిని పట్టించుకోలేదనేది స్పష్టమే. కాకపోతే, తెలియని శత్రువు పట్ల భయంతో అవి అలా చేయలేదనేదే ఉన్న తేడా. దురాక్రమణ చేయగల శత్రువు ముంగిట ఉంటే అవి బెంబేలెత్తి పోయాయని అనడం పూర్తి అమర్యాదకరం. వాటికి అలా సూచించారు కాబట్టే అవి అలా ప్రవర్తిస్తున్నాయి.

దీనిని ముఖ్య వ్యూహాత్మక వాదనగా పరిగణించాలని కోరుతున్నా. చైనా వాళ్లు ఈ విడ్డూరాన్ని గమనిస్తున్నారు, దీని నుంచి వారు తమ సొంత నిర్ధారణలను చేస్తున్నారు. చూడబోతే ఈ నిర్ధారణ తార్కికమైనదిగా తోస్తోంది: ప్రతి

జాతిహితం



ప్రతీకాత్మక చిత్రం

సాయంత్రం పాకిస్తాన్‌పై యుద్ధాన్ని ప్రకటించే భారత మీడియాలోని అతి యుద్ధోన్మాద విభాగాలు చైనా నుంచి సవాలు అసలు లేనే లేదన్నట్టుగా నటిస్తున్నాయి. అంటే వారి ప్రభుత్వం వాటికి అలా చేయమని సలహా (ఆదేశం?) ఇచ్చి ఉండాలనేది స్పష్టం.

మన మీడియాకు చెడ్డపేరు

అదే జరిగితే, భారత ప్రభుత్వం చైనా అంటే భయపడుతోందనే అర్థానికి చేరుతాం. చిన్న శత్రువు పాకిస్తాన్‌ను నిరంతరం దునుమాడేయడం అంటే మహా మక్కువ చూపే అది, ఎక్కువ బలీయమైన శత్రువు దగ్గరికి వచ్చేసరికి దాక్కుంటుంది. తన నోటి దురుసుతనాన్ని అదుపులో ఉంచుకోవడమే కాదు, తదనుగుణంగా మీడియా కూడా నడుచుకోవడానికి హామీని కల్పిస్తుంది. చివరగా, మన మీడియాకే కాదు భారత జాతీయ ప్రయోజనానికి సైతం అత్యంత ప్రమాదకరంగా... తమలాగే భారత ప్రభుత్వం కూడా మీడియాను నియంత్రిస్తుందని చైనా భావిస్తుంది. అందువల్ల మన ప్రభుత్వం కూడా తన అంతరంగాన్ని బయటకు వెల్లడించాలన్నా లేక వెల్లడించరాదన్నా చైనా లాగే ''తన'' మీడియా ద్వారానే చేస్తుందని నిర్ధారిస్తుంది. అలాగే భారత ప్రభుత్వం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, పాకిస్తాన్ సహా ఏ ఇతర శత్రువుతోనైనా ఘర్షణలను నిలిపి వేయమని మీడియాను ఆదేశించగలదని కూడా నిర్ధారిస్తుంది.

మన మీడియా పట్ల చైనాకు చిన్న చూపు ఏర్పడటం దీని చిన్న పర్యవసానమే. కానీ ఈ కొత్త సవాలును చేపట్టే విషయంలో అతి జాగ్రత్తగా వ్యవహరించేంతగా లేదా ప్రజాభిప్రాయం మరింత ఆగ్రహావేశపూరితం కాకుండటం కోసం తమ వేట కుక్కలను తూర్పునకు చూడొద్దని చెప్పేంతగా భారత్, చైనా అంటే భయపడుతోందని భావించవచ్చు. ఇది మనకు మరింత నష్టం కలిగించే నిర్ధారణ. ఈలోగా మన మీడియా యోధులు పాకిస్తాన్‌ను, మన సొంత కశ్మీరీలను, ముస్లింలను, చనిపోయినవారిని, భోఫోర్స్ కుంభకోణంతో సంబంధం ఉందని ఆరోపించినవారిని మాటలతో దునుమాడేయడం కొనసాగుతూనే ఉంటుంది. ఈ చానళ్లలో ఒకటి డోక్లామ్ ప్రతిష్టంభనపై ఆగ్రహావేశాన్ని వ్యక్తం చేసేంత వరకు వచ్చింది. అయితే ప్రత్యేకించి దాన్ని లక్ష్యించడంతో అది సైతం దిగ్భ్రాంతికరంగా మౌనంగా మారిపోయింది. అది చైనాను ఉల్లాసరపచడమే కాదు, మరిన్ని కుహకాలకు దిగడానికి ప్రేరేపించేది కూడా.

చైనీయులు దీన్ని ఎలా చూసినాగానీ, ఇది వారు తప్పుడు అంచనాలకు రావడానికి, భారత్ పిరికిదనే ముందస్తు భావనకు రావడానికి దారి తీసే అవకాశం ఉంది. భారత మీడియాలో ఆధిపత్యపూరితమైన, విజయవంతమైన విభాగాలు ఈ ముప్పును కూడా మిగతా వాటితో, ప్రత్యేకించి పాకిస్తాన్ ముప్పుతో సమానంగా లెక్కగడితే చైనా ఇలాంటి తప్పుడు అంచనాలకు రావడం జరగదు. కానీ అవి అలా చేయకపోవడం వల్ల, పాకిస్తాన్-కశ్మీర్-ముస్లింలను దునుమాడే కార్యక్రమాలకు అధికార పార్టీ అధికారిక ప్రతినిధులు టీవీ స్టూడియోలకు తరచుగా వస్తుండటంవల్ల.. ప్రపంచ శక్తిగా పెంపొందుతున్న దేశానికి ఉండాల్సిన బుర్ర భారత్‌కు లేదని చైనా భావించవచ్చు.

మీరు చైనాను పైపైనే అయినా గమనిస్తుంటే, లేదా కాలేజీ రోజుల యవ్వనంలో మీరు మావో అంటే ఉత్తేజితులై ఉంటే మీకు 'పోరాటం పోరాటం, మాటలు మాటలు' అనే మావోయిస్టు సూత్రం తెలిసి ఉంటుంది. దశాబ్దాల తరబడి చైనీయులు విదేశీ వ్యవహారాలలో ఈ సూత్రాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. తమ మాటలు, పోరాటంలో చాలా భాగాన్ని వారు తమ మీడియాగా చెప్పేదాన్లోనే చేస్తుంటారు. చైనా ఆర్థిక సంస్కరణలను చేపట్టిన తర్వాత మూడు దశాబ్దాలకు కూడా వారి ప్రభుత్వం ఇంకా ఆ మూడు పత్రికల ద్వారానే మాట్లాడుతున్నదనడంలో ప్రపంచంలో ఎవరికీ సందేహం లేదు.

మన వైఖరి సమంజసం

ఇంకా పూర్తి ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్న వ్యవస్థలో అవే చైనా గురించి తెలుసుకోడానికి ఉన్న ఏకైక వనరుగా ఉంటున్నాయి. వెల్లడించడానికి ఉద్దేశించినది తప్ప మరే విషయమూ బయటివారికి ఎవరికీ అందే దారే లేదు. సరిగ్గా మన మీడియాలోని కొందరు పాకిస్తాన్‌పైన, మరింత దురదృష్టకరంగా తరచుగా మన సొంత ముస్లిం పౌరులపైన సైతం విరుచుకుపడే ధోరణిలోనే... చైనా మీడియా ఇప్పుడు భారత్‌పై దాడిని సాగిస్తోంది.

చైనా సూత్రంలోని పోరాటం-పోరాటం భాగాన్ని వారి అధికారిక మీడియా అమలు చేస్తోంది. మన మీడియాలో గణనీయమైన భాగం పూర్తి మౌనం వహిస్తుండగా, ప్రభుత్వం చైనా సూత్రంలోని మాటలు-మాటలు అనే భాగాన్ని ఆశావాదంతో పట్టుదలగా అమలు చేస్తోంది. పోరాడటమో లేదా ఉపసంహరించుకోవడమో తేల్చుకోమనేలా చైనీయులు మనకు సవాలు విసురుతున్నారు. మాటల్లోనైనా మనం దాన్ని తిప్పికొట్టకుండా, వాళ్ల మాట్లాడుతారని వేచి చూడటాన్ని కొనసాగిస్తున్నాం.

ఆగ్రహావేశపూరితమైన మన చానళ్లను చైనాపై స్టూడియో యుద్ధాన్ని ప్రారంభించమని భారత ప్రభుత్వం ఆదేశించాలని నా వాదన కాదు. వాస్తవానికి వారలా చేయకపోవడం మంచి విషయం. కాబట్టే పాకిస్తాన్ విషయంలో వలే గాక ప్రజాభిప్రాయం ఇంకా అదుపు తప్పిపోలేదు. ప్రభుత్వం దౌత్యపరమైన పరిష్కారం కోసం దారి వెతకడం మంచి విషయమే. దౌత్యపరమైన ప్రయత్నాలకు ఉండే అవకాశాలను ప్రజాగ్రహం కుదించి వేయకుండా చూసుకోవడమూ మంచిదే. మనకు వ్యతిరేకంగా తెరచుకున్న కొత్త యుద్ధరంగం విషయంపై ప్రశాంత చిత్తంతో కూడిన ఇలాంటి దృక్పథం... మరో యుద్ధరంగంలో కూడా అలాంటి విజ్ఞతనే కనబరిస్తే... మరింత విశ్వసనీయమైనదిగా కనిపిస్తుంది కూడా.

చైనీయులు నిజమైన యుద్ధాన్ని కోరుకోవడం లేదు. ఇది 1962 కాదు కాబట్టి క్షేత్ర స్థాయిలో అది వారికి చాలా ఇబ్బందికరం అవుతుంది. అది మొదటి తూటా పేల్చిన వెంటనే ఆస్ట్రేలియా నుంచి జపాన్ వరకు భారత్‌కు పశ్చిమానికి చూస్తాయి. ఉప అగ్రరాజ్యంగా ఉన్న చైనా కోరుకోని ఈ పరిణామాన్ని హఠాత్తుగా కొని తెచ్చుకుంటుంది. చైనా మనతో బలవంతపు దౌత్యాన్ని సాగిస్తోంది. దాడికి, రెచ్చగొట్టడానికి అది తన సొంత మీడియానే సాధనంగా వాడుతోంది. ఆగ్రహావేశపరులైన మన తెల్ల మీసాలను ఉసిగొలిపి భయపెట్టడం అందుకు సమాధానం కాదనేది నిస్సందేహం. కాకపోతే, వారి ముప్పు పట్ల ప్రభుత్వ నిర్దేశితమైన ఈ పట్టింపులేనితనం వల్ల మనకు, డోక్లామ్ సమస్యకు పరస్పరం గౌరవప్రదమైన శాంతియుత పరిష్కారమనే లక్ష్యానికి నష్టదాయకమైన కొన్ని నిర్ధారణలను చైనా చేస్తుంది.

Twitter@ShekarGupta

గోళ్లు, వెంట్రుకలు మరియు సిట్!

మహా సంగ్రామాలప్పుడు కొన్ని వ్యూహాలు శత్రు పక్షాన్ని దారి తప్పిస్తాయ్. ప్రస్తుతం డ్రగ్స్‌పై విచారణలో గొప్ప వ్యూహ రచన సాగిందని తెలుస్తూనే ఉంది. అసలైన గొప్ప గుర్రాల్ని జాగ్రత్తగా కప్పెట్టడానికే ఈ వ్యూహం పన్నారని జనం అనుకుంటున్నారు.



శ్రీరమణ

అక్షర తూణీరం



నాస్తికులు నమ్మరుగానీ దేవుడు భలే అసాధ్యుడు. సృష్టిలో బోలెడు మెలికలు పెడతాడు. గోళ్లు మిక్కిలి నిష్ప్రయోజనమైనవనుకుంటాం. శరీరాన్ని అంటిపెట్టుకు ఉన్నా రక్త సంబంధంలేని భాగాలు గోళ్లు, వెంట్రుకలు. వాటి దారిన అవి పెరుగుతూ ఉంటాయి. వాటి పోషణ ఇటీవలి కాలంలో పెనుభారం అయ్యింది. గోళ్ల వ్యవహారమూ తక్కువది కాదు. వీటిని చాలా తృణీకారంగా తీసేస్తుంటాం. అదే మన అజ్ఞానం. మన పెద్దవాళ్లు బిడ్డ పుట్టగానే బొడ్డుని భద్రపరచి, తాయత్తులో పదిలపరిస్తే మూఢ నమ్మకం అనుకున్నాం. కానీ మూల కణాల చరిత్రని క్షణాల్లో అది చెబుతుందని నిన్న మొన్నటిదాకా మనకు తెలిసిరాలేదు.

అకున్ సబర్వాల్ పుణ్యమా అని కొన్ని కీలక ఘట్టాలలో గోళ్లు, వెంట్రుకలు గుట్టు విప్పుతాయని జన సామాన్యానికి విశదమైంది. విచారణకు వచ్చిన వారిలో కొందరు వెంట్రుక ముక్కలు ఇవ్వడానికి ససేమిరా అన్నారు. గోళ్లు ఆత్మరక్షణకే అనుకున్నాం గానీ ఇలా గమ్మత్తు కథలు చెప్పగలవని ఎవరికీ తెలియదు. నెత్తుట్లో సైతం దొరకని కొన్ని మధుర స్మృతులు వీటిలో చూడవచ్చుట. మొత్తానికి నెల రోజులపాటు అటు ఆబ్కారీ శాఖ, ఇటు మీడియా కావల్సినంత సందడి చేశారు. కొన్ని చానెల్స్ స్వయంగా ఇంకొన్ని మసాలాలు జోడించి రేటింగులు సాధించుకున్నాయి. అందరూ పేరూ ప్రఖ్యాతి కలిగినవారు. ముఖ విలువ ఉన్నవారు. నాబోటి వాళ్లకి విషయాలు తెలుసుకోవాలని విపరీతమైన ఆసక్తి. ఈ మహా మత్తులో చిక్కుకున్న వారికి డబ్బు నిషా ఆనదు. విలాస జీవన శైలి ప్ఛ్... గ్లామర్ నిషా చాలదు. అప్పుడు అవసరపడతాయి అదనపు కిక్కులు. తొలి అడుగులోనే ఆనంద స్థితికి చేర్పిస్తాయి టాటూలు, బ్లాసమ్‌లు. ఒక్కసారి రుచి మరిగితే వీడటం కష్టం. గంజాయి, నల్లమందు, భంగు అతి ప్రాచీనమైన దేశవాళీ నిషాలు. తర్వాత అనేకానేక పై సంగతులు వచ్చి పడ్డాయి. ఇవీ కొత్తేమీ కాదు. ఎప్పుడూ ఓ మూల ఈ కోడ్ నడుస్తూనే ఉంది. ఇప్పుడెందుకో తీగె లాగారు. డొంకంతా కదల్లేదుగానీ కొద్దిగా హడావుడి చేశారు.

గంటలు గంటలు, రోజులు రోజులు ఇంటరాగేషన్ చేశారు. అందరూ సహకరించారు. అయినా అసలు సంగతి ఏమిటో ఎవరికీ తెలియదు. వారాల తరబడి టీవీ తెరలకు అతుక్కుపోయిన జనం పిచ్చివాళ్లుగా మిగిలారు. మహా సంగ్రామాలప్పుడు కొన్ని వ్యూహాలుంటాయ్. అవి శత్రు పక్షాన్ని దారి తప్పిస్తాయ్. ఇప్పుడు కూడా గొప్ప వ్యూహ రచన సాగిందని తెలుస్తూనే ఉంది. అసలైన గొప్ప గుర్రాల్ని జాగ్రత్తగా కప్పెట్టడానికే ఈ వ్యూహం పన్నారని జనం అనుకుంటున్నారు. తిమింగలాలు సముద్ర మధ్యంలో నిశ్చింతగా జోగుతున్నాయ్. ఒడ్డున చిన్న చేపతో అలజడిని సృష్టించి, ఆయా శాఖలు తమ నిజాయితీని చాటుకుంటున్నాయి. అకున్ సబర్వాల్ జీ! ఇంతకీ దీని ఫలశ్రుతి ఏమిటో చెప్పరా ప్లీజ్! గోళ్లు, వెంట్రుకలు మరియు రాజకీయం. వడ్ల గింజలో బియ్యపు గింజ!

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

భవతీ భిక్షాం దేహి!



బిచ్చం వేసే వారుండాలేగానీ భిక్షాటనంత సులభమైన ఉపాధి మరొకటి ఉండదు. అందుకే, అందరికీ అష్టైశ్వర్యాలు ఇవ్వగల హరహర మహాదేవుడు తన సొంత అవసరాలకు మాత్రం భిక్షా పాత్రను ఆశ్రయించి, అన్నపూర్ణేశ్వరి ప్రసాదం నుంచి హాలాహలం దాకా అన్నీ హరాయించుకొనే శక్తి సంపాదించుకొన్నాడు. తనకు భిక్ష వేసే వారింట్లో కావాలంటే కనకధారలు కురిపిస్తాడు. తను మాత్రం అనాదిగా వచ్చిన అలవాటు మానడు.

ఆయనకు మిత్రుడూ, బావమరిది వరసవాడూ అయిన లక్ష్మీ నారాయణుడు కొంత బెట్టుసరిగా ఉండే మాట నిజమే కానీ పెద్ద పెద్ద యజ్ఞాలలో భూరి దానాలూ, దక్షిణలూ లభిస్తాయంటే, ఆయన కూడా అణిగి మణిగిపోయి చేయిచాచే సందర్భాలు ఉన్నాయి. వదినా మరదళ్ల వరస అయిన వాళ్ల భార్యలు ఆడుకొనే సరసాలు కూడా దీన్ని ప్రతిఫలిస్తాయి. 'తొలి బిచ్చగాడుగా తోచు నీ పతియంచు' వదినగారు వేళాకోలం చేస్తే, 'బలి బిచ్చమెత్తె నీ పతి యటంచు' మరదలు మేలమాడుతుంది.

జ్యోతిర్మయం

బిచ్చమెత్తటంలో ఆత్మోద్ధరణకే కాకుండా, పరోపకారానికి కూడా బోలెడంత అవకాశం ఉంది. పూర్వం, పిల్లికి బిచ్చం వేయాలన్నా బోలెడు ప్రశ్నలు గుప్పించే పీనాసి రాజుగారొకడు ఉండేవాడట. తన దగ్గరికి దానం కోరుతూ వచ్చిన ఓ భిక్షకుడిని 'నేను నీకెందుకు బిచ్చం వేయాలో చెప్పు' అని నిలదీశాడట.

'నువ్వు బిచ్చం వేస్తే నాకెంత లాభమో గానీ, బిచ్చం వెయ్యకపోతే మాత్రం నీకు అందుకు నూరురెట్ల నష్టం' అన్నాడట. 'అన్నం బిచ్చం వేయక పోవటంవల్ల, నేను ఈ జన్మలో బిచ్చగాడినయ్యాను. ఈ దుర్దశ పై జన్మలో నీకు దాపరించగూడదని, నేను బిచ్చం అడుగుతున్నాను. ఈ సువర్ణావకాశం అంది పుచ్చుకొంటావో, జారవిడుచుకొంటావో అది నీ నిర్ణయం' అన్నాడు బిచ్చగాడు. మరోమాట కూడా చెప్పాడు. 'క్రితం జన్మలో ధనం ఉండీ దానం చేయక, నేను ఈ జన్మలో బిచ్చమెత్తుతున్నాను. ఈ జన్మలో దానం చేసేందుకు ధనం లేక, దానం చేయలేకపోతున్నాను. కనుక పై జన్మలలోనూ నా గతి ఇంతే. ఇలాంటి విష వలయం నుంచి నిన్ను తప్పించాలని నేను నిన్ను బిచ్చమడుగుతున్నాను అన్నాడు.

బిచ్చమంటే ఏమిటి? 'నీ చేయిపైనా, నా చేయి కిందా, ఇచ్చి పుచ్చుకొను రుణమే బాబూ' అన్నారు పింగళి నాగేంద్రరావుగారు. ఇవాళ తీసుకొంటాం, రేపో ఎల్లుండో పై జన్మలోనో తీర్చుకొంటాం. దీన్ని బిచ్చమనటం వాస్తవాన్ని వక్రీకరించటమేనట. 'ముష్టి ఏమిటిది? ముసలి బ్రహ్మ మన చిట్టాలో రాసిన జమలే బాబూ!' అని పింగళివారి భిక్ష సూత్రం.

– ఎం. మారుతిశాస్త్రి

నేను తెలుసుకున్న కామ్రేడ్ సుందరయ్య

దక్షిణ భారతదేశంలోని తొలి తరం కమ్యూనిస్టు నేతల్లో నిరుపమాన వ్యక్తిత్వం కలిగిన ఒక గొప్ప నాయకుడి జ్ఞాపకాల కలబోత 'నేను తెలుసుకున్న కామ్రేడ్ సుందరయ్య'. 1934లో కమ్యూనిస్టు పార్టీలో చేరినప్పటి నుంచి 1985 అస్తమయం వరకు పుచ్చలపల్లి సుందరయ్య సుదీర్ఘమైన రాజకీయ జీవితంలోని వివిధ చారిత్రక ఘట్టాల సమాహారం ఈ పుస్తకం. రెండు దశాబ్దాలపాటు సుందరయ్య వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ ఏపీ విఠల్ ఆయన జీవిత పరిణామక్రమాన్ని ఈ పుస్తకంలో వివరించారు.

కమ్యూనిజం పేరు వింటేనే గొంగళిపురుగులు పాకినట్లు మధ్యతరగతి మేధావులు, సోషల్ మీడియా వ్యాఖ్యాతలు భావిస్తున్న ప్రస్తుత కాలంలో, దశాబ్దాలుగా శ్రామిక జనావళి విముక్తి ప్రదాతగా వెలుగొందిన కమ్యూనిస్టు ఉద్యమం వెనుకపట్టు పట్టినట్లు కనిపిస్తున్న నేపథ్యంలో.. సుందరయ్య గురించి ఇప్పుడు జ్ఞాపకం చేసుకోవలసిన అవసరం ఏమిటి? చట్టసభలో సభ్యులుగా ప్రమాణం కూడా చేయకముందే ఈ పార్టీనుంచి ఆ పార్టీలోకి ఫిరాయింపుదారులు జంప్ చేస్తున్న రోజుల్లో సుందరయ్య గొప్పతనం ఎవరికి కావాలి? అనేది మనముందు పెను ప్రశ్నగా నిలుస్తోంది. కానీ రాజకీయరంగంలో కనిపిస్తున్న విలువల దిగజారుడుతనం ఇలాగే కొనసాగితే నామమాత్రపు ప్రజాస్వామ్యంపైన కూడా ప్రజల విశ్వాసం పూర్తిగా క్షీణిస్తుంది. కేంద్రం, రాష్ట్రం అంటూ తేడా లేకుండా అన్ని పార్టీలూ, నేతలూ విలువల పతనం విషయంలో ఒకే తాను ముక్కలుగా ఉన్న స్థితిలో రాజకీయ రంగం ప్రక్షాళన కావాలంటే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, మానవీయ లక్షణాలను పుణికి పుచ్చుకోవడం, ప్రజల కోసం పోరాటం ఎలా చేయాలో, విరమించాల్సి వస్తే ఎలా విరమించాలో తెలిసి ఉండటం... ఈ గుణాలకో సమే దేశంలోని, తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ నాయకులతో పాటు యువతీయువకులు కూడా సుందరయ్య జీవిత విశేషాలు చదవటం అవసరం.



1930లో మాలపర్రు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నప్పుడు 18 ఏళ్లలోపు వయస్సులో అరెస్టయి తంజావూరు బోర్స్టల్ స్కూలులో జైలు జీవితం సుందరయ్యను తీవ్ర అధ్యయన కర్తగా మార్చి కమ్యూనిస్టు భావజాలంతో పరిచయం కలిగించింది. విడుదలైన తర్వాత 1931లో అమీర్ హైదర్ ఖాన్‌తో కమ్యూనిస్టు పార్టీకి పూర్తికాలం కార్యకర్తగా ఉంటానని మాట ఇచ్చిన సుందరయ్య ఆ తర్వాత 1985లో కన్నుమూసేవరకు 55 సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉమ్మడి సీపీఐలోనూ, తర్వాత సీపీఎంలోనూ కొనసాగారు. పార్టీ తాననుకున్న మార్గంలో నడవలేదని గ్రహించినప్పుడు సీపీఎం ప్రధాన కార్యదర్శిగా కేంద్రంలో తన పదవులకు 1978లో రాజీనామా చేసి పార్టీ లక్ష్యాల సాధనకు నాటి ఆంధ్రప్రదేశ్‌ను కార్యక్షేత్రంగా చేసుకుని జీవించినంత కాలం ఆ కర్తవ్యంలోనే గడిపిన జననేత సుందరయ్య. కేంద్ర కమిటీ నుంచి మళ్లీ కింది స్థాయిలోకి వచ్చి పనిచేయడం అత్యంత అరుదు. దానికీ సుందరయ్యే ఆద్యులు కావడం విశేషం.

మద్రాసులో ఆంధ్రపత్రికలో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లను యాజమాన్యం తిరస్కరించినప్పుడు కార్మికులు సమ్మె చేస్తే పత్రిక వ్యవస్థాపకులు కాశీనాథుని నాగేశ్వరరావు సుందరయ్యతో సంప్రదింపులు జరిపి కొంత మేరకు కార్మికుల డిమాండ్లను ఆమోదించారు. ఈ సందర్భంగా కాశీనాథుని నాగేశ్వరరావు మాట్లాడుతూ కొంత అదనంగా సొమ్ము ఖర్చుపెట్టడం పెద్ద సమస్య కాదనీ, ఆంధ్రపత్రికలో కూడా సమ్మె అన్నది సంస్థ పరువుకు సంబంధించిన విషయమని, కొంచెం ముందుగానే నువ్వు నన్ను కలిసి వివరించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదని నొచ్చుకున్నారు. సమస్యను పట్టు విడుపుల వైఖరితో పరిష్కరించడంలో సుందరయ్య నేర్పును ఈ ఉదంతం తెలుపుతుంది.

ఆయన పదేపదే చెప్పే విషయం ఏమిటంటే ''ఈ సమాజగమనం ఒక్క మిల్లీమీటరయినా ముందుకు వెళ్లేందుకు ప్రతి కమ్యూనిస్టూ ప్రయత్నించాలి. ఇదీ సాధ్యం కానప్పుడు కనీసం ఉన్న దశనైనా నిలబెట్టేందుకు కృషి చేయాలి. మన లక్ష్యం సిద్ధించిందా లేదా అన్నది ప్రధానం కాదు. దానిని బట్టి మన గమనాన్ని మార్చుకోవచ్చు. కానీ మనం అసలా దిశలో మానవాళి పురోగమన ప్రస్థానంలో నడుస్తున్నామా లేదా అన్నది ముఖ్యం''. 55 సంవత్సరాల ఉద్యమ జీవితం సాక్షిగా మనిషి లక్ష్యం కోసం ఎందుకు నిలబడాలో చెబుతున్న సుందరయ్య జ్ఞాపకాలను అందుకే తెలుసుకోవాలి. ***ప్రతులకు: సాహితీ మిత్రులు– విజయవాడ | మొబైల్: 93929 71359***

కె. రాజశేఖరరాజు



కర్ణాటక గుప్పిట్లో కృష్ణమ్మ!

సాక్షి, అమరావతి: కృష్ణా వరద జలాలపై కర్ణాటక సర్కారు కట్టుకథలు చెబుతోంది. పది రోజుల క్రితమే ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లో నీరు గరిష్ట స్థాయికి చేరడంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నా.. జూరాల ప్రాజెక్టుకు కనీసం ఒక్క టీఎంసీ నీరు కూడా చేరలేదు. ఈ లెక్కన కర్ణాటక సర్కార్ కృష్ణా వరద జలాలను భారీ ఎత్తున మళ్లిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం.. కర్ణాటక సర్కార్ ఆల్మట్టి జలాశయం ఎత్తును 519.600 నుంచి 524.256 మీటర్లకు పెంచితే అదనంగా 130 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చు. అప్పుడు తెలుగు రాష్ట్రాలకు సెప్టెంబర్ ద్వితీయార్థంలోగానీ ఎగువ నుంచి వరద జలాలు చేరే అవకాశం ఉండదు. అప్పటికే నైరుతి రుతుపవనాలు తిరోగమనంలో ఉండటం వల్ల వర్షాలు తగ్గుముఖం పడతాయి. కృష్ణాకు వరద ఉండదు.. తెలుగు రాష్ట్రాలు ఎడారిగా మారతాయని సాగునీటి రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నదిపై 129.721 టీఎంసీల సామర్థ్యంతో ఆల్మట్టి.. దానికి దిగువన 37.64 టీఎంసీల సామర్థ్యంతో నారాయణపూర్ జలాశయాలను కర్ణాటక సర్కార్ నిర్మించింది. ఆ రెండు జలాశయాలు నిండిన తర్వాతే దిగువకు నీటిని విడుదల చేస్తారు. ఆ జలాలు తెలంగాణలో 9.65 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన జూరాల జలశయాన్ని చేరుతాయి. ఆ తర్వాతే వరద జలాలు రాష్ట్రంలో ప్రవేశించి శ్రీశైలం చేరుకుంటాయి. వర్షాలు సక్రమంగా కురిస్తే జూలై మూడో వారం నాటికే శ్రీశైలం జలాశయానికి వరద జలాలు చేరేవి. కాస్త వర్షాభావ పరిస్థితులు ఎదురైతే ఆగస్టు మొదటి వారం నాటికి శ్రీశైలానికి వరద జలాలు వచ్చేవి. కానీ.. ఈ ఏడాది ఇప్పటి వరకు చుక్క నీరు కూడా ఎగువ నుంచి శ్రీశైలానికి రాలేదు.

యథేచ్ఛగా తోడేస్తోన్న కర్ణాటక

నారాయణపూర్ జలాశయం పది రోజుల క్రితమే నిండింది. ఆల్మట్టి జలాశయంలోనూ నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరుకుంది. వచ్చిన వరదను దిగువకు విడుదల చేయాల్సిన కర్ణాటక సర్కార్.. ఆయకట్టుకు మళ్లించడంతోపాటూ అక్రమంగా చేపట్టిన ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని తోడేస్తోంది. గుల్బర్గా, బీజాపూర్, రాయచూర్, కొప్పల్, గదగ్ జిల్లాల్లో వందలాది చెరువులను నింపేస్తోంది. జల చౌర్యాన్ని కప్పిపుచ్చుకునే క్రమంలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నామంటూ కేంద్ర జల సంఘానికి తప్పుడు లెక్కలు చెబుతోంది. ఒకవేళ అదే నిజమనుకుంటే జూరాలకు ఒక టీఎంసీ నీరు కూడా ఎందుకు చేరనట్టు? దీనిని బట్టి చూస్తే అవన్నీ కట్టుకథ లేనన్నది స్పష్టమవుతోంది. అరకొరగా వచ్చిన నీటిని సైతం కృష్ణా బోర్డు అనుమతి తీసుకోకుండానే జూరాల నుంచి కాలువలు, నెట్టంపాడు, బీమా, కోయిల్ సాగర్ ఎత్తిపోతల ద్వారా తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు మళ్లిస్తోంది. కర్ణాటక సర్కార్ భారీ ఎత్తున జల చౌర్యానికి పాల్పడుతున్నా ఏపీ సర్కార్ కేంద్రానికి ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

ఇలాగైతే తెలుగు రాష్ట్రాల్లో గడ్డు పరిస్థితి

హెచ్‌డీ దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు 1996లో ఆల్మట్టి, అప్పర్ కృష్ణా ప్రాజెక్టును కర్ణాటక సర్కార్ చేపట్టింది. సత్వర సాగునీటి ప్రయోజన పథకం ద్వారా ఆ ప్రాజెక్టుకు కేంద్రం నిధులను సమకూర్చింది. ఆ ప్రాజెక్టు పూర్తయితే ఏపీ ఎడారిగా మారుతుందని సాగునీటి రంగ నిపుణులు హెచ్చరించినా నాటి సీఎం చంద్రబాబు నోరు మెదప లేకపోయారు. దేవేగౌడను తానే ప్రధానిని చేశానంటూ అప్పుడూ, ఇప్పుడూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు.. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించడంలో పూర్తిగా విఫలమైనట్లు సాగు నీటి రంగం నిపుణులు విమర్శిస్తున్నారు. నాటి వైఫల్యం నేడు తెలుగు రాష్ట్రాలకు మరింత శాపంగా మారింది. కృష్ణా ట్రిబ్యునల్ తీర్పును కేంద్రం అమలు చేయక ముందే.. కర్ణాటక సర్కార్ ఆల్మట్టి జలాశయం ఎత్తును 524.256 మీటర్లకు పెంచేందుకు సిద్ధమైంది. ఇందుకు రూ.32,650.20 కోట్ల డీపీఆర్‌ను రూపొందించి.. పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడానికి సమాయత్తమవుతోంది. దీనివల్ల అదనంగా 130 టీఎంసీలను ఆల్మట్టిలో నిల్వ చేసుకోవచ్చు. ఇప్పుడే అడ్డగోలుగా వరద నీటిని మళ్లిస్తోన్న కర్ణాటక.. ఆల్మట్టి ఎత్తు పెంచేస్తే మరింతంగా నీటిని వినియోగించుకుంటుంది. అప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని ఆయకట్టు ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు.

పది రోజులుగా కృష్ణా నదీ జలాలను మళ్లిస్తోన్న తీరు... (నీటి నిల్వ టీఎంసీల్లో, నీటి ప్రవాహం క్యూసెక్కుల్లో)

తేదీ	ఆల్మట్టిలోకి నీటి ప్రవాహం			నారాయణపూర్‌లోకి ప్రవాహం			జూరాలలోకి ప్రవాహం		
	నీటి నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో	నీటి నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో	నీటి నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
జూలై 26	104.65	86,530	20,321	34.61	25,868	7,147	6.66	0	428
జూలై 27	111.78	89,092	10,738	34.69	9,473	8,261	6.60	0	625
జూలై 28	118.44	89,742	16,266	35.51	15,466	8,111	6.55	0	602
జూలై 29	121.92	69,658	31,681	36.28	29,836	23,391	6.50	0	1,771
జూలై 30	123.32	37,332	21,683	36.54	19,278	16,970	6.19	0	2,477
జూలై 31	126.74	48,906	11,681	36.35	11,183	12,554	5.88	139	3,669
ఆగస్టు 1	128.19	35,521	18,448	36.98	25,301	18,199	5.56	447	4,151
ఆగస్టు 2	128.19	20,849	20,849	36.98	18,240	18,031	5.58	4,574	4,400
ఆగస్టు 3	128.19	21,003	21,003	37.04	19,364	18,072	5.52	3,846	4,552
ఆగస్టు 4	128.19	21,003	21,003	37.04	17,790	17,566	5.46	3,710	4,416

హెల్‌ఫోన్

ఫోన్ మాట్లాడుతూ రన్నింగ్‌లో బస్సు దిగి ఆర్మీ ఉద్యోగి మృతి

యలమంచిలి/యలమంచిలి రూరల్: సెల్‌ఫోను మాట్లాడుతూ బస్సు దిగబోయిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. విశాఖ జిల్లా కశింకోటకు చెందిన ఆర్మీ ఉద్యోగి కూంద్రం అప్పారావు (20) శుక్రవారం యలమంచిలిలో తన స్నేహితుడిని కలిసేందుకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో యలమంచిలి నుంచి అనకాపల్లి వెళ్లాల్సిన బస్సు ఎక్కబోయి పాయకరావుపేట వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్సు కొంతదూరం వెళ్లాక పొరపాటున బస్సు ఎక్కినట్లు గుర్తించిన అప్పారావు ఫోన్ మాట్లాడుతూనే కంగారుగా బస్సు దిగేశాడు. దీంతో బస్సు నుంచి జారిపడి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి తల్లి, అక్క ఉన్నారు.

అగ్రిగోల్డ్ దర్యాప్తునకు అదనపు నిధులు

సాక్షి, అమరావతి: అగ్రిగోల్డ్, అక్షయగోల్డ్ కేసుల దర్యాప్తునకు రూ. 40.67 లక్షల అదనపు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. అగ్రిగోల్డ్, అక్షయగోల్డ్ కేసుల దర్యాప్తు, సమావేశాలు, తదితర ఖర్చుల నిమిత్తం నిధులు అవసరమని డీజీపీ సాంబశివరావు చేసిన ప్రతిపాదనలపై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2017– 18 ఆర్థిక సంవత్సరంలో ఈ నిధులు కేటాయించనున్నట్లు రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఆర్ అనురాధ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వెండి వాకిలి వద్ద అత్యవసర ద్వారం

రద్దీ పెరిగినప్పుడే వినియోగంలోకి..: టీటీడీ ఈవో సింఘాల్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: భక్తుల భద్రత దృష్ట్యా వెండి వాకిలి వద్ద అత్యవసర ద్వారం ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించినట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. దీనిని రద్దీ పెరిగినప్పుడు మాత్రమే వినియోగంలోకి తెస్తామని చెప్పారు. శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వెండివాకిలి వద్ద ఇనుప నిచ్చెనలు' కథనంపై టీటీడీ అధికారులు స్పందించారు. ఈవోతో పాటు టీటీడీ జేఈవోలు మీడియాకు వివరణ ఇచ్చారు. శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగినప్పుడు వెండి వాకిలి ద్వారా ఒకేసారి 1,500 నుంచి 2 వేల మంది బయటకు వెళ్లే ప్రయత్నం చేస్తుంటారని, అలాంటి సమయాల్లో తొక్కిసలాట జరిగే ప్రమాదముందన్నారు. అత్యవసర ద్వారం ఏర్పాటు చేయడం ద్వారా ఇలాంటి పరిస్థితి ఎదురవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలనే యోచనలో ఉన్నట్లు చెప్పారు. పొరపాట్లకు ఆస్కారమివ్వకుండా, ఆగమశాస్త్రం ప్రకారమే నడుచుకుంటామని ఈవో వివరించారు.

ఆగస్టులో సెలవులే సెలవులు

సాక్షి, అమరావతి: ఆగస్టు నెలలో ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు వరుస సెలవులు రానున్నాయి. ఆగస్టు 12న రెండో శనివారం, 13న ఆదివారం, 14న కృష్ణాష్టమి, 15న గణతంత్ర దినోత్సవం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు వరుసగా నాలుగు రోజులు పనిచేయవు. అయితే ఆగస్టు 14న కృష్ణాష్టమికి బ్యాంకులకు సెలవు లేదు. అదే విధంగా ఆగస్టు 25న వినాయకచవితి, 26న నాల్గో శనివారం, 27న ఆదివారం కావడంతో బ్యాంకులు వరుసగా మూడు రోజులు పనిచేయవు. శ్రావణ మాసం శుభ కార్యక్రమాలకు తోడు వరుస సెలవులు తోడవ్వడంతో బస్సులు, రైళ్లల్లో రిజర్వేషన్లు దొరక్క ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జగన్ వ్యాఖ్యలపై ఫిర్యాదు

నూనెపల్లె: నంద్యాలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కర్నూలు జిల్లా నంద్యాలలో మీడియాతో మాట్లాడారు. ఆ వ్యాఖ్యల విషయంలో మంత్రి అఖిలప్రియ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న కుమార్‌ను ఆర్‌డీవో కార్యాలయంలో కలసి ఫిర్యాదు అందించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వద్ద గన్‌లు ఉన్నాయేమోనంటూ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వ్యాఖ్యానించారు.

కేరళ కబేళాలకు 'ఒంగోలు' పశువులు

▶ మొదటి పేజీ తరువాయి

సంతలకు వచ్చే ఒంగోలు జాతి పశువులపై అక్రమార్కులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సంతలు, రైతుల నుంచి కొనుగోలుచేసి చిత్తూరు మీదుగా కేరళకు తరలిస్తున్నట్లు బయటపడింది. వైఎస్సార్ జిల్లా మైదుకూరు సంత నుంచి 12 ఒంగోలు జాతి గిత్తలు, మరో 18 బర్రెలు కేరళకు తరలిస్తుండగా ఆదివారం రాత్రి చిత్తూరు పోలీసులు పట్టుకున్నారు. వాటిని సోమవారం తిరుచానూరులోని గోసంరక్షణశాలకు తరలించారు. పశువులను తరలించే ముఠాకోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. పట్టుబడ్డ పశువులను మైదుకూరు సంతలో రూ.25 లక్షలకు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు గోశాల నిర్వాహకులు ఏవీ కృష్ణారావు చెప్పారు. అయితే కేరళ కబేళాల నిర్వాహకులతో అక్రమార్కులు రూ.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఆ మాంసానికి అక్కడ భలే డిమాండ్: రాష్ట్రంలోని గుంటూరు జిల్లా మంగళగిరి, ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి వారంలో ఓ రోజు కేరళలోని కబేళాలకు పశువులు తరలివెళ్తున్నట్లు తెలిసింది. అందులో ముఖ్యంగా ఒంగోలు జాతి పశువులు అధికంగా ఉన్నట్లు సమాచారం. ఇక్కడ నుంచి మాంసాన్ని గల్ఫ్ దేశాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఒంగోలు జాతి పశుమాంసం 5 కిలోల టిన్ రూ.9,500 పైనే పలుకుతోంది. అదే పశువు చర్మం ఒకటి రూ.38 వేల దాకా ఉంది. ఇంకా పశువులో లభించే కొవ్వుకు కూడా మంచి డిమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఆ కొవ్వును కూడా కిలోల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.

కేరళకు ఇలా తరలిస్తున్నారు: ప్రకాశం, మంగళగిరి, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో రైతుల వద్ద ఉన్న ఒంగోలు జాతి పశువులను కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు వాటిని రాయచోటి, కలకడ, చిత్తూరు మీదుగా కేరళకు, అదే విధంగా మంగళగిరి, ప్రకాశం, నెల్లూరు జిల్లా తడ మీదుగా తమిళనాడు నుంచి కేరళకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరికొంతమంది రేణిగుంట మీదుగా కేరళకు రవాణా చేస్తున్నారు. కేరళలో గోవధ నిషేధ చట్టం అమల్లో లేకపోవటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- వర్షాభావంతో ఆశాజనకంగా లేని దిగుబడి
- అరకొర పండిన పంటకు గిట్టుబాటు ధర కరువు
- ఒక్క రూపాయి కూడా మాఫీ కాని బ్యాంకు రుణం
- ఒత్తిడి పెరిగి పురుగు మందు తాగిన వైనం


సంజీవశెట్టి (ఫైల్‌ఫొటో)



బ్యాంకు నుంచి అందిన నోటీసు

బైరెడ్డిపల్లె: అప్పుల బాధతో చిత్తూరు జిల్లా శెట్టిపల్లెలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన సంజీవశెట్టి (55) తనకున్న 2.22 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ భార్య, ముగ్గురు పిల్లలను పోషించుకునే వాడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశాడు. ఇదే సమయంలో పంటల సాగుకు నీటి సమస్య రావడంతో నాలుగేళ్లలో నాలుగు బోర్లు వేశాడు. ఒక్క దాంట్లో ఇంచి నీరు మినహా మిగిలిన మూడింటిలో నీరు పడలేదు. ఇందుకోసం ప్రయివేటు వ్యక్తుల నుంచి రూ.2 లక్షలకు పైగా అప్పు చేశాడు. బైరెడ్డిపల్లి ఇండియన్ బ్యాంకులో (రుణ ఖాతా నంబర్ : 989254315) 2011లో రూ.55 వేలు పంట రుణం తీసుకున్నాడు. ప్రభుత్వ రుణమాఫీ కింద ఈ మొత్తమైనా మాఫీ అవుతుందని భావించినా ఆ కోరిక తీరలేదు. ఈ విషయమై బ్యాంకు అధికారులను సంప్రదిస్తే.. సాంకేతిక కారణాలు అంటూ మళ్లీ విడతలో అవుతుందని కాలం వెళ్లదీశారు. అసలు, వడ్డీ కలిపి బ్యాంకు అప్పు ప్రస్తుతం రూ.లక్ష దాటిపోయింది. ఈ నేపథ్యంలో టమాట, బీన్సు తదితర పంటలను సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయానికి ధర లేక మరింతగా నష్టాల్లో కూరుకుపోయాడు. ఇటీవల రెండకరాల్లో ధనియాలు (కొత్తిమీర) వేశాడు. పంట చేతికొచ్చినా ధర లేక కొనేవారే కరువయ్యారు. ఇదే సమయంలో పంటకు తెగులు సోకడంతో బైరెడ్డిపల్లి వెళ్లి రెండ్రోజుల క్రితం పురుగు మందు తెచ్చాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడం, బ్యాంకు నుంచి మీద మీద నోటీసులు వస్తుండడంతో మనస్థాపం చెందాడు. ఇక అప్పులు తీర్చలేనని భావించి గురువారం సాయంత్రం పొలంలోకి వెళ్లి పురుగు మందు తాగాడు. పక్క పొలాల్లోని రైతులు గమనించి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వాత మృతి చెందాడు.

శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ దాఖలు


ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న శిల్పా మోహన్‌రెడ్డి. చిత్రంలో పీపీ నాగిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఇసాక్, శేఖర్‌రెడ్డి

నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శిల్పా మోహన్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్య నేతలతో కలిసి ఆయన తన నివాసం నుంచి ఆర్‌డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ తరపున శిల్పా మోహన్‌రెడ్డి మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి కూడా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీపీ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సిద్ధం శివరాం, కౌన్సిలర్ అనిల్ అమృతరాజ్, పార్టీ నాయకులు ఇసాక్, కానాల విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముందు జగన్ ప్రశ్నలకు జవాబులు చెప్పండి

- ఎమ్మెల్యే రోజా
- నంద్యాల సభకు జనం బ్రహ్మరథం పట్టడంతో టీడీపీ నేతల్లో వణుకు


మాట్లాడుతున్న రోజా. చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన

నంద్యాల: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉందని నగరి ఎమ్మెల్యే రోజా డిమాండ్‌చేశారు. కర్నూలు జిల్లా నంద్యాలలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆమె నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచనతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి తన పదవికి రాజీనామాచేసి వైఎస్సార్ సీపీలో చేరారని, ఈ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు ప్రతిపక్ష నేత అన్న ఒక మాటను పట్టుకుని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు అన్యాయం చేసిన వారిని నడిరోడ్డుపై కాల్చితే తప్పేముందన్న మాటను పట్టుకుని టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, అసెంబ్లీ సాక్షిగా 'జగన్ అంతు చూస్తాను' అని బెదిరించిన చంద్రబాబుపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం పాటు పడుతున్న వంగవీటి రంగాను నడిరోడ్డుపై చంపించింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. తహసీల్దార్ వనజాక్షి, ఐపీఎస్ బాలసుబ్రమణ్యంను ఎలా హింసించారో అందరికీ తెలుసన్నారు. కాల్‌మనీ సెక్స్ రాకెట్‌లో మహిళల జీవితాలు నాశనం కావడానికి టీడీపీ నేతలు కారణమని, వీటిపై ప్రశ్నిస్తే తనను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. చెరుకులపాడు నారాయణరెడ్డిని దారుణంగా హత్యచేసిన ఘటనను ఎవరూ మరచిపోరన్నారు. 2009 సెప్టెంబర్ ఒకటో తేదీన అసెంబ్లీ సాక్షిగా అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఉద్దేశించి 'ఎవరు ఫినిష్ అవుతారో చూద్దాం' అంటూ సవాల్ విసిరారని.. మరుసటి రోజే హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్సార్ మరణించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనికి చంద్రబాబు సమాధానం చెప్పగలరా.. అంటూ ప్రశ్నించారు. నంద్యాలలో జరిగిన జగన్ సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో టీడీపీ నాయకుల్లో వణుకు మొదలైందన్నారు. నంద్యాలలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని రోజా ధీమా వ్యక్తం చేశారు.

నైతిక విలువలకు సమాధి

- ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి ఫిరాయింపు
- రాజీనామా చేయకుండా రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు
- ప్రజాస్వామ్యాన్ని మంట గలుపుతున్న ఫిరాయింపుదార్లు
- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాకే వైఎస్సార్‌సీపీలో చేరిన శిల్పా చక్రపాణి
- ఆయన సవాల్‌పై నోరుమెదపని ఫిరాయింపు ఎమ్మెల్యేలు


SILPA CHAKRAPANI REDDY
M.L.C.
KURNOOL

Mobile: 9666002121
TDP (O) KNL Fax: 08518-270246
HYD Ph: 040-66627022/33
HYD Fax No. 040-23357022
email: mlcknl2015@gmail.com

To
The Chairman/Dy.Chairman,
Andhra Pradesh Legislative Council,
Velagapudi,
Amaravathi.

Sir,

I here by tender my resignation of my seat in the house with effect from 03rd August, 2017.

Yours faithfully,

S. Chakrapani Reddy

(SILPA CHAKRAPANI REDDY)
Member of the Council

Place : KURNOOL
Date : 03.08.2017

4/8/17
12.50 p.m.

04 AUG 2017

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ శిల్పా చక్రపాణిరెడ్డి సమర్పించిన లేఖ అందినట్లు శుక్రవారం స్టాంపు, సంతకంతో స్టేట్ లెజిస్లేచర్ ప్రత్యేక కార్యదర్శి ధ్రువీకరించారు

నంద్యాల నుంచి 'సాక్షి' ప్రతినిధి: రాజకీయ నేతలకు నైతిక విలువలుండాలి. విశ్వసనీయత కలిగి ఉండాలి. ప్రజలకు జవాబుదారీగా నిలవాలి. నాటితరం నాయకులు ఇలాంటి సుగుణాలను పుణికి పుచ్చుకునేవారు. విలువలతో కూడిన రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రజలకు ఆదర్శంగా నిలిచేవారు. ప్రస్తుతం కొందరు నేతలు అవకాశవాదం, అనైతిక రాజకీయాలే శ్వాసగా జీవిస్తున్నారు. ఈ కోవలో అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరితేరిపోయారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

రాజీనామాలంటే ఫిరాయింపుదార్లలో దడ

వైఎస్సార్‌సీపీలో చేరాలంటే తెలుగుదేశం పార్టీ ద్వారా లభించిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని శిల్పా చక్రపాణిరెడ్డికి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. నైతిక విలువలకు కట్టుబడి, విలువలతో కూడిన రాజకీయాలే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. జగన్ సూచన మేరకు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన తర్వాతే శిల్పా చక్రపాణిరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ ఫిరాయించి అధికార టీడీపీలో చేరిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేసి, ఎన్నికలకు సిద్ధపడాలని ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. దీనిపై ఫిరాయింపు ఎమ్మెల్యేలెవరూ నోరుమెదపకపోవడం గమనార్హం. ఆ ఎమ్మెల్యేలకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల నిజంగా విశ్వాసం ఉంటే ఈ సవాల్‌ను స్వీకరించేవారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఎవరిది అనైతికత?

నంద్యాల ఉప ఎన్నికల్లో అనైతికంగా పోటీ పెట్టారు, సంప్రదాయాలకు వైఎస్సార్‌సీపీ విలువ ఇవ్వడం లేదంటూ మంత్రుల నుంచి ముఖ్యమంత్రి వరకూ ఆరోపణలు చేస్తున్నారు. వాస్తవాలను పరిశీలిస్తే టీడీపీయే అనైతికంగా వ్యవహరిస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఒక పార్టీ ఎమ్మెల్యే అర్ధాంతరంగా మరణిస్తే సదరు పార్టీ ప్రకటించే అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంప్రదాయంగా వస్తోంది. నంద్యాలలో 2014 ఎన్నికల్లో భూమా నాగిరెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. రాజ్యాంగబద్ధంగా నాగిరెడ్డి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే. సంప్రదాయం ప్రకారం ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయాన్ని టీడీపీ దాటవేస్తోందని, అందుకు కారణం ఆ పార్టీ అనైతిక చర్యలేనని విమర్శిస్తున్నారు.

చక్రపాణి అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్సీ పదవిని తృణప్రాయంగా త్యజించారు
- చంద్రబాబు ఆ 21 మందితో రాజీనామా చేయించాలి
- వైఎస్సార్‌సీపీ నేత అంబటి



నంద్యాల విద్య: నైతిక విలువలకు కట్టుబడి శిల్పా చక్రపాణిరెడ్డి ఎమ్మెల్సీ పదవిని తృణప్రాయంగా వదిలేశారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు ప్రశంసించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన 90 రోజుల్లోనే ఆ పదవిని వదులుకుని అందరికీ ఆదర్శప్రాయుడు అయ్యారని చెప్పారు. అంబటి శుక్రవారం కర్నూలు జిల్లా నంద్యాలలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికైన చక్రపాణిరెడ్డి ఆ పార్టీ సభ్యత్వంతో పాటు, ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలోకి రావడం గర్వకారణమన్నారు. అనైతిక సిద్ధాంతంతో రాజ్యాన్ని ఏలుతున్న చంద్రబాబు... శిల్పా చక్రపాణి రెడ్డిని చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని, వైఎస్సార్‌సీపీ నుంచి చేర్చుకున్న 21మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఫ్యాన్ గుర్తుపై గెలిచి టీడీపీలో ఉన్న మంత్రి అఖిలప్రియ, ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి నంద్యాల ఉప ఎన్నికలో ఓట్లు ఎలా అడుగుతున్నారని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ద్వారా వచ్చిన శాసన సభ్యత్వాలకు రాజీనామా చేసిన తర్వాతే ఓట్లు అడగాలని వారిని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై నంద్యాల ప్రజలు కూడా వారిని నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. ఆదినారాయణరెడ్డి వియ్యంకుడు కేశవరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.వందల కోట్లు వసూలు చేసి మోసం చేశారని, వారికి డబ్బులు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. నంద్యాల సభలో వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు బాధించాయని అచ్చెన్నాయుడు అన్న మాటలకు స్పందిస్తూ.. అచ్చెన్నాయుడు శాసనసభలో మాట్లాడిన మాటలు అందరికీ గుర్తున్నాయని అంబటి ఎద్దేవా చేశారు. 'పాతేస్తా నా కొడకా...' అన్న బోండా ఉమా మాటలను కూడా ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైఎస్ జగన్‌ను చంద్రబాబు శాసనసభలో 'నీ అంతు చూస్తా' అనలేదా?.. వారు నిండు సభలో మాట్లాడొచ్చు కానీ జగన్ మాత్రం ఏమీ అనకూడదా? అని ప్రశ్నించారు. నంద్యాలలో శాంతి కావాలా? హింస కావాలా? తేల్చుకోవాల్సింది ప్రజలేనని చెప్పారు. ఒక మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టి శిల్పామోహన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

టీడీపీకి రాజీనామా చేస్తున్నా

- గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు
- పార్టీలు మారడంపై న్యాయస్థానంలో సవాలు చేస్తా
- స్పందించకపోతే ఆత్మార్పణ



గిద్దలూరు: తెలుగుదేశం పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మాజీ ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు విమర్శించారు. ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ఆది నుంచీ పార్టీని అంటిపెట్టుకొని ఉన్న కార్యకర్తలను చీడపురుగుల్లా చూస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గిద్దలూరులో శుక్రవారం కార్యకర్తలు, అనుచరులతో సమావేశం నిర్వహించిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు తాను టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ ఓట్లతో గెలిచి టీడీపీలో చేరిన ముత్తుముల అశోక్‌రెడ్డి వలన టీడీపీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని సీఎంకు చెప్పినా పట్టించుకోలేదని, పైగా పార్టీ ఫిరాయించిన వారితోనే కలిసి పనిచేయాలని చెబుతున్నారని విమర్శించారు. ఎప్పటి నుంచో టీడీపీ జెండాలు మోస్తున్న వారిని కాదని ఇప్పటికిప్పుడు పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యతనిచ్చి తమకు అన్యాయం చేస్తున్నారని, అందుకే పార్టీలో ఉండడం సమంజసం కాదని భావించి తాను రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో అప్పటి వరకు టీడీపీ కండువా వేసుకుని మాట్లాడుతున్న రాంబాబు ఒక్కసారిగా ఆ కండువా విసిరి కింద పడేశారు. తాను ఏ పార్టీలోనూ చేరడం లేదని, ఒక ప్రజాస్వామికవాదిగా ప్రజల సమస్యలపై పోరాడతానన్నారు.

ఫిరాయింపులపై కోర్టుకు వెళతా...

పార్టీ ఫిరాయింపులపై న్యాయస్థానంలో సవాలు చేస్తానని, రాజ్యాంగాధినేతలైన రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కలిసి పార్టీ ఫిరాయింపులను వివరిస్తానని రాంబాబు చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా పార్టీ ఫిరాయింపులపై తగిన నిర్ణయం వస్తే తిరిగి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, లేనిపక్షంలో ఆత్మార్పణ చేసుకుంటానని ప్రకటించారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

సాయంత్రానికి ఫలితం వెల్లడి ● ఎన్‌డీఏ అభ్యర్థి వెంకయ్యకే విజయావకాశాలు

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధమయ్యింది. శనివారం(నేడు) పార్లమెంట్ సభ్యులు ఉప రాష్ట్రపతిని ఎన్నుకునేందుకు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే విషయం శనివారం సాయంత్రానికి తేలిపోనుంది. లోక్‌సభలో మెజారిటీగల ఎన్‌డీఏ అభ్యర్థి వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికకవడం లాంఛనమే. ఆయనపై విపక్షాలు మహాత్మాగాంధీ మనవడు, పశ్చిమబెంగాల్ మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీని రంగంలోకి దించాయి. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు మద్దతు తెలిపిన బీజేడీ, జేడీయూ ఇప్పుడు గాంధీకి మద్దతిస్తున్నాయి.

సాయంత్రానికి ఫలితం: పార్లమెంట్ హౌస్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఓటింగ్ జరుగుతుంది. సాయంత్రం 7 గంటలకు ఫలితం వెల్లడిస్తారు. రహస్య ఓటింగ్ పద్ధతిలో ఈ ఎన్నిక జరుగుతున్నందున పార్టీలు విప్ జారీ చేయలేదు. రెండుసార్లు ఉపరాష్ట్రపతిగా కొనసాగిన హమీద్ అన్సారీ పదవీకాలం ఈ నెల 10తో ముగియనుంది రాజ్యసభ ఎక్స్–అఫీషియో చైర్మన్, లోక్‌సభ, రాజ్యసభలకు ఎన్నికైన, నామినేట్ అయిన సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజ్ ఉపరాష్ట్రపతిని ఎన్నుకోనుంది. ఉభయ సభల్లో మొత్తం సభ్యుల సంఖ్య 790. అయితే లోక్‌సభలో రెండు, రాజ్యసభలో ఒక స్థానం ఖాళీగా ఉన్నాయి. అలాగే కోర్టు తీర్పు కారణంగా లోక్‌సభలో బీజేపీ ఎంపీ చేదీ పాశ్వన్ ఓటు హక్కును వినియోగించుకోలేరు. 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థి ఎన్నికలో గెలుస్తారు. లోక్‌సభలో మొత్తం సభ్యులు 545. బీజేపీ సభ్యులు 281. బీజేపీతో కలిపి ఎన్‌డీఏ బలం 338. ఇక 243 మంది సభ్యులున్న రాజ్యసభలో బీజేపీకి 58 మంది సభ్యులు.. కాంగ్రెస్‌కు 57 మంది సభ్యులు ఉన్నారు. కాగా, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఒకే కుటుంబం(బీజేపీ) నుంచి వస్తుండటంతో 2017–2022 మధ్య ఉజ్వల భవిత దిశగా దేశం పయనిస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యకు మద్దతిస్తున్న వివిధ పార్టీల ఎంపీలతో నిర్వహించిన భేటీలో ఆయన మాట్లాడారు.



ఢిల్లీలో వెంకయ్య నాయుడి ప్రసంగాల పుస్తకావిష్కరణలో వేదికపై మోదీ, వెంకయ్య, అమిత్, జైట్లీ, 'ఎమెస్కో' విజయ్‌కుమార్, జర్నలిస్ట్ ఏ కృష్ణారావు



మీడియాకు విందు సందర్భంగా కూతురు దీప, మనవరాలు సుష్మాలతో ఫొటో దిగుతున్న వెంకయ్య దంపతులు

మరింతగా క్షీణించిన మేధా పాట్కర్ ఆరోగ్యం




ధార్: సర్దార్ సరోవర్ డ్యాం ముంపు బాధితులకు సరైన పునరావాసం కల్పించాలని కోరుతూ గత 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక ఉద్యమ కారిణి మేధా పాట్కర్(62) ఆరోగ్యం మరింతగా క్షీణించింది. వైద్య పరీక్షల్లో పాట్కర్ రక్త పోటు, షుగర్ స్థాయి పడిపోయినట్లు తేలిందని అదనపు కలెక్టర్ డి.కె.నాగేంద్ర తెలిపారు. మేధా పాట్కర్‌తో పాటు 11 మంది ఉద్యమకారులు జూలై 27 నుంచి మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా ఛిఖల్దా గ్రామంలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు.

స్పైస్‌జెట్ విమానానికి తప్పిన ముప్పు

కోజికోడ్: చెన్నై నుంచి 68 మంది ప్రయాణికులతో కేరళలోని కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన స్పైస్‌జెట్ విమానానికి పెనుప్రమాదం తప్పింది. కాలికట్ ఎయిర్‌పోర్టులో శుక్రవారం ఉదయం 8.30కు విమానం ల్యాండ్ అయిన వెంటనే రన్‌వే నుంచి జారి పక్కకు వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. విమానాల దిశానిర్దేశం కోసం రన్‌వే పక్కన ఏర్పాటుచేసిన లైట్లు దెబ్బతిన్నాయి.

మద్యం మత్తులో విన్యాసాలు.. ఇద్దరి మృతి

ముంబై: మద్యం మత్తులో విన్యాసాలు చేస్తూ ఇద్దరు యువకులు 2,000 అడుగుల లోతున్న లోయలోకి జారిపడి దుర్మరణం చెందారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన ఏడుగురు స్నేహితులు ఇటీవల పర్యాటక కేంద్రమయిన అంబోలీ ఘాట్‌కు చేరుకున్నారు. వీరిలో ఇమ్రాన్ (26), ప్రతాప్(21)లు మద్యం సేవించి కవాలే సాద్ బ్రిడ్జిపై విన్యాసాలు ప్రారంభించారు. స్నేహితులు ప్రోత్సహించడంతో రెయిలింగ్‌ను దాటి అవతలకు వెళ్లి నిల్చున్నారు. ఇంతలో పట్టుతప్పిన ఒక యువకుడు పక్కనే ఉన్న మరొకరిని పట్టుకోవడంతో ఇద్దరూ లోయలోకి జారి పోయారు. వీరిద్దరూ అక్కడికక్కడే మరణించారు. మిగతా స్నేహితులు ఇమ్రాన్, ప్రతాప్‌లు తప్పిపోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఈ ప్రమాదం జరిగిన తర్వాతి రోజు ఇద్దరు యువకులు లోయలో పడిపోతున్న వీడియో వెలుగులోకి చూడ్డంతో అసలు విషయం తెలిసింది. వర్షాలు వల్ల మృతదేహాల వెలికితీతకు ఆటంకం కలుగుతోంది.



డైనోసార్ల 'మోనాలీసా'గా పేరొందిన డైనోసార్ శిలాజం ఫొటోలివి. ఏమాత్రం చెక్కుచెదరని 18 అడుగుల పొడువున్న ఈ శిలాజం కెనడాలో లభించింది. 11 కోట్ల ఏళ్ల క్రితం జీవించిన దీని బరువు 1300 కేజీలపైనే.

పనితీరు మార్చుకోండి: ఎంపీలతో మోదీ

న్యూఢిల్లీ: మారుతున్న దేశ రాజకీయాలను అర్థం చేసుకునేందుకు ప్రస్తుత పనితీరును మార్చుకోవాలని పలువురు బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన బీజేపీ ఎంపీలతో శుక్రవారం తన నివాసంలో మోదీ భేటీ అయ్యారు. ముద్ర, పంటబీమా, భూసార కార్డుల వంటి వివిధ పథకాల లాభాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

కార్తీపై లుక్ ఔట్ నోటీసులు

సాక్షి, చెన్నై: సీబీఐ గాలిస్తున్న అజ్ఞాత నేరస్తుల జాబితాలో కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ చేర్చింది. ఆయన విదేశీయానంపై నిషేధం విధించింది. ఐటీ, సీబీఐ, ఈడీ కేసుల్లో విచారణకు హాజరుకాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. లుక్ ఔట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో..వీటిని వ్యతిరేకిస్తూ శుక్రవారం కార్తీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై ఈనెల 7వ తేదీన విచారణ జరగనుంది. షెల్ కంపెనీల నుంచి భారీ ఎత్తున విదేశీ మారకద్రవ్యం పొందినట్లుగా కార్తీపై సీబీఐ అభియోగం.

మా ఓపికకు హద్దుంది: చైనా

బీజింగ్: డోక్లాం వివాదంలో తమ ఓపికకు హద్దుందని, ఇరు దేశాల మధ్య సరిహద్దుల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభనపై అత్యంత స్నేహపూర్వకంగా వ్యవహరిస్తున్నామని చైనా పేర్కొంది. చైనా రక్షణ శాఖ ప్రతినిధి రెన్ గ్యుకియాంగ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సరిహద్దుల్లో శాంతి, సామరస్యం తిరిగి నెలకొనేలా వీలైనంత త్వరగా ఈ వివాదానికి భారత్ ముగింపు పలకాలని సూచించారు.

సాయుధ దళాలకు ఖాదీ

న్యూఢిల్లీ: సాయుధ దళాల సిబ్బందికి త్వరలోనే ఖాదీ యూనిఫారాలు అందించనున్నామని, ఇందుకు సంబంధించిన చర్యలను వేగవంతం చేశామని లోక్‌సభలో శుక్రవారం కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాష్ భామ్రే వెల్లడించారు. ఖాదీ విలేజస్ ఇండస్ట్రీస్ కమిషన్(కేవీఐసీ) విన్నపం మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. దుస్తులకు సంబంధించిన నమూనాలను కేవీఐసీకి పంపామని తెలిపారు. సైన్యంలో సోషల్ మీడియా వినియోగంపై భారత ఆర్మీ కొత్త విధివిధానాలను రూపొందించిందని తెలిపారు.



ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడికి ఢిల్లీలో పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలుపుతున్న సెల్‌కాన్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై గురు. ఆ పదవికి అభ్యర్థిగా ఎన్నికవడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని గురు అన్నారు.

రాహుల్ కారుపై రాళ్ల దాడి

- పగిలిన కారు అద్దాలు.. రాహుల్ క్షేమం
- గుజరాత్ వరద ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా ఘటన
- ప్రధాని నరేంద్ర మోదీకి అనుకూలంగా నినాదాలు
- దాడి బీజేపీ కార్యకర్తల పనేనని కాంగ్రెస్ విమర్శ



రాళ్లదాడిలో పగిలిన కారు అద్దాలు



రూనీ గ్రామంలో మాట్లాడుతున్న రాహుల్

ధనేరా/న్యూఢిల్లీ: గుజరాత్‌లో వరద ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాల పరిశీలనకు వచ్చిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ వాహనంపై రాళ్లదాడి జరిగింది. ఈ ఘటనలో రాహుల్ కారు అద్దాలు పగిలిపోయాయి. ప్రత్యేక భద్రత దళం(ఎస్‌పీజీ) వెంటనే అప్రమత్తమవటంతో ఆయన ఎలాంటి గాయాల్లేకుండానే క్షేమంగా బయటపడ్డారు. పిరికిపందల చర్యలకు తాను భయపడనని రాహుల్ అన్నారు. అటు కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఘటనలపై మండిపడింది. బీజేపీ గుండాలే ఈ దాడికి పాల్పడ్డారని విమర్శించింది. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. రాహుల్ అవకాశవాద రాజకీయాలకు విసిగి ప్రజలే దాడిచేశారని పేర్కొంది.

అసలేం జరిగింది?.. తాజా వరదలకు అతలాకుతలమైన రాజస్తాన్, ఉత్తర గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో సహాయక చర్యలను రాహుల్ గాంధీ పరిశీలించారు. రాజస్తాన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లాలో రాహుల్ పర్యటించారు. ఈ జిల్లాలోని పలు గ్రామాల్లో బాధితులతో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత రైతులతో మాట్లాడేందుకు ధనేరాలోని మార్కెటింగ్ యార్డుకు రాహుల్ చేరుకున్నారు. లాల్‌చౌక్ ప్రాంతంలో స్థానికులను, రైతులనుద్దేశించి ఆయన మాట్లాడేందుకు సిద్ధమవగానే స్థానికులు నల్లజెండాలతో నిరసన తెలపటంతోపాటు మోదీకి అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి ప్రజలను చెదరగొట్టారు. ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసిన రాహుల్ అక్కడినుంచి వెళ్లిపోతున్న సమయంలో ప్రజలు వాటర్ ప్యాకెట్లను కాన్వాయ్‌పైకి విసిరారు. కాన్వాయ్ ధనేరా హెలిప్యాడ్ సమీపంలోకి రాగానే.. కొందరు నిరసనకారులు రాహుల్ వాహనంపైకి రాళ్లురువ్వారు. దీంతో రాహుల్ ప్రయాణిస్తున్న కారు ఒకవైపు అద్దాలు పగిలిపోయాయి. వెంటనే అప్రమత్తమైన ఎస్పీజీ దళం రాహుల్‌ను వాహనం నుంచి బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎస్పీజీ దళ సభ్యుడికి స్వల్ప గాయాలయ్యాయి. రాయి విసిరిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధనేరా ఎమ్మెల్యే జోయ్‌తాభాయ్ పటేల్ (కాంగ్రెస్) ప్రస్తుతం బెంగళూరు ఈగల్‌టన్ రిసార్టులోని క్యాంపులో ఉన్నారు. కాగా, తనపై దాడి చేస్తే భయపడేది లేదని రాహుల్ స్పష్టం చేశారు. 'ఇలాంటి పిరికిపంద చర్యలకు, మోదీ మోదీ అంటూ చేసే నినాదాలకు నేను భయపడను. మీ బాధలను విని, అర్థం చేసుకునేందుకు వచ్చాను. వీలైనంత సాయం చేద్దామనుకున్నాను. సత్యాన్ని చూడాలనుకోని, అర్థం చేసుకోలేని వారే భయపడతారు. నేను కాదు' అని దాడి అనంతరం రాహుల్ ట్వీట్ చేశారు. ఘటన జరిగిన సమయంలో కాంగ్రెస్ నేత, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ తదితరులున్నారు.

బీజేపీ గూండాలపనే: కాంగ్రెస్
రాహుల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వెళ్తే బీజేపీ గూండాలు సిమెంటు ఇటుకలతో దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించాలని బీజేపీ యత్నిస్తోందని కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసకు తావు లేదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు.

రాహుల్‌వి 'ఫొటో' రాజకీయాలు: బీజేపీ

గుజరాత్, రాజస్తాన్‌లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రాహుల్ పర్యటన ఫొటో రాజకీయం చేసేందుకేనని బీజేపీ విమర్శించింది. 'ప్రజలను గూండాలు, రౌడీలని అనొద్దు. వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరు రిసార్టులో ఎంజాయ్ చేస్తున్నారు. రాహుల్ గాంధీ, ఆయన పార్టీ చేస్తున్న రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారు. అందుకే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలను గౌరవించాలి' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా తెలిపారు.

మరణ ధ్రువీకరణకూ ఆధార్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వ్యక్తుల గుర్తింపులో మోసాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోంశాఖ పేర్కొంది. ఈ మేరకు హోంశాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జమ్మూకశ్మీర్, అస్సాం, మేఘాలయ రాష్ట్రాలు మినహా దేశమంతటా ఇది వర్తిస్తుందని వెల్లడించింది. ఈ మూడు రాష్ట్రాల కోసం త్వరలో మరో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఆధార్‌ను తప్పనిసరి చేయడం ద్వారా మరణ ధ్రువీకరణ పత్రం కోసం రకరకాల డాక్యుమెంట్లను సమర్పించాల్సిన అవసరం ఉండదని హోంశాఖ నేతృత్వంలో పనిచేసే రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం(ఓఆర్‌జీ) తెలిపింది. ఈ విషయమై తమ అభిప్రాయాలను అక్టోబర్ 1కల్లా తెలియజేయాల్సిందిగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరినట్లు వెల్లడించింది. మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసే సమయంలో చనిపోయిన వ్యక్తి ఆధార్ లేదా ఎన్‌రోల్‌మెంట్ ఐడీతో పాటు అతని/ఆమె జీవిత భాగస్వామి ఆధార్‌ను కూడా ఇవ్వాల్సి ఉంటుందని వెల్లడించింది. దీంతో పాటు దరఖాస్తుదారు కూడా తన ఆధార్‌ను సమర్పించాల్సి ఉంటుందని ఓఆర్‌జీ పేర్కొంది. చనిపోయినవారి ఆధార్ వివరాలపై స్పష్టత లేకుంటే..తనకు తెలిసినంతవరకు మృతుడు/మృతురాలికి ఆధార్ లేదని దరఖాస్తుదారు సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. ఒకవేళ దరఖాస్తుదారు తప్పుడు వివరాలు ఇస్తే ఆధార్ చట్టం–2016, జనన, మరణాల రిజిస్ట్రేషన్ చట్టం–1969 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

హిజ్బుల్ ఉగ్రవాది హతం

అనంత్‌నాగ్: దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇటీవలే హిజ్బుల్ ముజాహిదీన్‌లో చేరిన స్థానిక ఉగ్రవాది హతమయ్యాడు. కాల్పుల్లో చిక్కుకుని గుర్తుతెలియని మరో వ్యక్తి కూడా మరణించాడు. మిలిటెంట్లు ఉన్నారన్న సమాచారం అందడంతో గురువారం రాత్రి బిజ్‌బెహారా ప్రాంతంలోని కానిబల్ సమీపంలోని ఓ గ్రామంలో భద్రతా దళాలు గాలింపు ప్రారంభించాయి. రెండు గంటల పాటు కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఉగ్రవాదిని యావర్‌గా గుర్తించారు. మరో ఇద్దరు మిలిటెంట్లు పారిపోయారు. ఈ ఘటనలో ఓ జవాన్‌కు గాయాలైనా అతని ప్రాణానికి ముప్పేమీ లేదని ఆర్మీ అధికారులు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరుగుతున్న సమయంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి బుల్లెట్‌లు తగిలి చనిపోయాడు. బైక్ నంబర్‌ప్లేట్ ధ్వంసం కావడం, అతని ఐడీ కార్డు లభ్యం కాకపోవడంతో అతనెవరో గుర్తించలేకపోయారు.

విదేశాల్లోనూ భారీగా ఆస్తులు

కర్ణాటక మంత్రి సన్నిహితుడి ఇంట్లో 16 రహస్య లాకర్లు గుర్తింపు



శివకుమార్

సాక్షి, బెంగళూరు: కర్ణాటక మంత్రి డీకే శివకుమార్ అక్రమాల పుట్ట తవ్వేకొద్దీ కొత్త అంశాలు వెలుగుచూస్తున్నాయి. దుబాయ్, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో బినామీ పేర్లతో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన ఆధారాల్ని సేకరించారు. మూడు రోజులుగా శివకుమార్‌పై ఐటీ దాడులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దుబాయ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో పాటు, బెంగళూరులో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి డీకే సొమ్ము సమకూర్చుకున్నట్లు తేలింది.

వందల కోట్ల స్థిరాస్తి పత్రాలు స్వాధీనం
శివకుమార్ సన్నిహితుడు శర్మా ట్రావెల్స్ యజమాని సునీల్‌కుమార్ శర్మ ఇంట్లో 16 రహస్య లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 11 లాకర్లలో వందల కోట్ల స్థిరాస్తి ధ్రువీకరణ పత్రాల్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ట్రావెల్స్‌కు చెందిన ఐదు బ్యాంకు లావాదేవీల్ని స్తంభింపజేశారు. ఈ ట్రావెల్స్‌లో శివకుమార్‌కు 35%వాటా ఉన్నట్లు సమాచారం. ఆ ఇంటి భూగర్భంలో గదిని గుర్తించిన అధికారులు కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మైసూరులోని డీకే మామ తిమ్మయ్యకు చెందిన షీకాయిపొడి పరిశ్రమను ఐటీ శాఖ అధికారులు సీజ్ చేశారు.

శివకుమార్‌కు అస్వస్థత
శివకుమార్ శుక్రవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. బీపీ పెరిగినట్లు గుర్తించిన వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు.

చలామణిలో 86 శాతం నగదు

- లోక్‌సభలో కేంద్రం వెల్లడి
- రాజ్యసభలో సుష్మపై రెండు హక్కుల తీర్మానం నోటీసులు



రాజ్యసభలో విపక్షాల నిరసన

న్యూఢిల్లీ: నోట్ల రద్దుకు ముందు చలామణిలో ఉన్న నగదులో 86 శాతం ఈ ఏడాది జూలై 21 నాటికి మార్కెట్లో అందుబాటులో ఉందని లోక్‌సభకు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. డిమాండ్‌కు సరిపడా కరెన్సీ నోట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ అన్ని ఏర్పాట్లు చేసిందని ఆర్థిక శాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. మరోవైపు ఎల్పీజీ సిలిండర్లపై నెలవారీ రూ. 4 పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరీ మాట్లాడుతూ.. ఎల్పీజీ సబ్సిడీ ఎత్తివేస్తున్నారని, ఒక్కసారిగా 18 కోట్ల మంది ఎలా ధనవంతులుగా మారిపోతారు? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లోకి పాకిస్తాన్ ఉగ్రవాదుల చొరబాట్లు పెరిగినా.. వాటిని దీటుగా తిప్పికొడుతున్నామని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభకు తెలిపారు. కాగా, రైల్వే టికెట్ల బుకింగ్ కోసం ఆధార్ తప్పనిసరి కాదని రాజ్యసభకు కేంద్రం తెలిపింది.

సుష్మ సభను తప్పుదారి పట్టించారు: కాంగ్రెస్
విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ సభను తప్పుదారి పట్టించారంటూ రాజ్యసభలో కాంగ్రెస్ రెండు సభా హక్కుల తీర్మానం నోటీసులు అందచేసింది. ఆగస్టు 3న విదేశాంగ విధానంపై చర్చ సందర్భంగా సుష్మ సభను తప్పుదారి పట్టించారని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. బాండుంగ్‌లో ఆఫ్రో–ఆసియన్ సదస్సులో నెహ్రూ పేరును ప్రస్తావించకపోవడంపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. సదస్సులో భారత్ తరపున ఎవరూ మాట్లాడలేదని సుష్మ అబద్ధమాడారంది. మోదీ లాహోర్ పర్యటన అనంతరం దేశంలో ఎలాంటి ఉగ్రవాద దాడి జరగలేదంటూ సుష్మ సభను తప్పుదారి పట్టించారని మరో హక్కుల తీర్మానం నోటీసును కాంగ్రెస్ అందచేసింది.



సూచీతో ఆంధ్రసంఘం అధ్యక్షుని భేటీ

నేపిడా: మయన్మార్ అమరవీరుల స్మారకదినోత్సవం సందర్భంగా ఇటీవల పలు మతాల, సంస్థల ప్రతినిధి బృందాలతో ఆ దేశ ప్రధాన సలహాదారు ఆంగ్‌సాంగ్‌సూచీ తన నివాసంలో భేటీ అయ్యారు. ఈ బృందంలో ఆంధ్రప్రదేశ్ నుంచి మయన్మార్‌కు వలసవచ్చిన సుబ్రమణి ఉన్నారు. మయన్మార్‌లోని లక్ష మంది తెలుగువారు మన తెలుగు సాంస్కృతీ సంప్రదాయలను కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. సుబ్రమణి మయన్మార్ 'ఆంధ్ర సంఘం' అధ్యక్షుడు.

కాలగర్భంలో 400 భాషలు!

తెలుగుకు ముప్పు లేదు

భాషకు ముప్పొచ్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండొంతుల భాషలు ప్రమాదంలో పడ్డాయి. ప్రపంచంలో మొత్తంగా 6000 భాషలున్నట్లు అంచనా. వాటిలో 2050 ఏడాదికల్లా 4000 భాషలు క్రమేపీ మూగబోయే ప్రమాదం ఉందని భాషాశాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. వీటిలో పదిశాతం భారతీయ భాషలున్నాయి. ప్రస్తుతం దేశంలో 780 భాషలను మాట్లాడుతుండగా రాబోయే 35 ఏళ్లలో వాటిలో 400 వరకు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని ఒక పరిశీలన. భాషను కోల్పోవడమంటే పెద్ద ఎత్తున మానవ, సాంస్కృతిక పెట్టుబడిని కోల్పోయినట్టే. ఒక భాష పుట్టడానికి వేలాది ఏళ్లు పడుతుండగా, ఎంతో మానవ సంఘర్షణ తర్వాతే ఒక రూపాన్ని సంతరించుకుంటుంది. ఈ విషయంలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు మాట్లాడుతున్న హిందీ, బెంగాలీ, తెలుగు, మరాఠీ, కన్నడ, మలయాళం, గుజరాతీ, పంజాబీ భాషలకు అటువంటి బెంగ ఏమీ లేదని, ఈ భాషలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉండడంతో ఈ జాబితాలోకి రావంటున్నారు. వీటిపై ఇంగ్లిష్ భాష ప్రభావమున్నా ఇవి క్షీణిస్తాయన్న భయం అవసరం లేదని పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎల్‌ఎస్‌ఐ) భరోసా ఇస్తోంది. ఈ సంస్థ 27 రాష్ట్రాల్లోని 780 భాషలపై 3000 మందితో అధ్యయనం నిర్వహించింది. ఈ ఏడాది చివరినాటికి సిక్కిం, గోవా, అండమాన్, నికోబార్‌లలోనూ పరిశీలన పూర్తి చేసే ఆలోచనతో ఉంది. ఈ పరిశోధనకు సంబంధించిన 11 సంపుటాలను ఇటీవల ఢిల్లీలో విడుదల చేసింది.

తీరప్రాంత భాషలకే ఎక్కువ ముప్పు
తీరప్రాంతాల్లో మాట్లాడుతున్న భాషలే ప్రమాదంలో ఉన్నాయని పీఎల్‌ఎస్‌ఐ చైర్మన్ గణేష్ ఎన్.దేవి చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో స్థిరమైన జీవనోపాధి దొరకక సంప్రదాయ మత్స్యకార వర్గాలు తీరానికి దూరమవుతున్నాయి. అధునాతన జీవనశైలి అలవడి క్రమేణా తమ మాతృభాషను వదులుకోవాల్సి వస్తోంది' అని ఆయన అంటున్నారు. అయితే ఇటీవలి కాలంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో మాట్లాడే సంతాలి, గోండి, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌లలోని భేలి, మిజోరాంలోని మిజో, మేఘాలయాలోని ఖాసి, త్రిపురలోని కోట్‌బారక్ భాషలు పుంజుకోవడం శుభపరిణామం. ఈ తెగల్లోని విద్యావంతులు భావ వ్యక్తీకరణకు, రచనలకు విరివిగా ఈ భాషను ఉపయోగిస్తున్నారు. తమ భాషల్లోనే కవితలు, నాటకాలను రాసి ప్రదర్శిస్తుండడం, గోండి వంటి భాషల్లో సినిమాలను కూడా తీస్తుండడం కలిసివస్తోంది. చిత్రపరిశ్రమ పురోభివృద్ధితో భోజ్‌పురి దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న భాషగా నిలుస్తోంది.

–సాక్షి నాలెడ్జ్ సెంటర్



'రష్యా జోక్యం'పై జ్యూరీ

వాషింగ్టన్: 'రష్యా జోక్యం' కేసులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ప్రచార బృందానికి, రష్యాకు మధ్య కొనసాగినట్లు భావిస్తున్న సంబంధాలపై దర్యాప్తు కోసం ప్రత్యేక ప్రాసిక్యూటర్, ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ రాబర్ట్ ముల్లర్.. గ్రాండ్ జ్యూరీని నియమించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం పూర్తిగా తన శత్రువులు సృష్టించిన కట్టుకథ అని ట్రంప్ మండిపడ్డారు. కాగా, మెక్సికో అధ్యక్షుడు ఎన్రిక్ పెనా నీటో, ఆస్ట్రేలియా ప్రధాని టర్న్‌బుల్‌లతో ట్రంప్ ఈ ఏడాది జనవరిలో జరిపిన ఫోన్ సంభాషణల వివరాలు లీక్ అయ్యాయి. మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణం తనకు ప్రాధన్య అంశం కాదని, శరణార్థులకు ఆశ్రయం కల్పించొద్దని ఆయన సంభాషణల్లో అన్నారు.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
శనివారం, 5-8-2017





షిం'హాలు

రఫ్ అండ్ టఫ్ జాబ్.. పోలీసుద్యోగం!
క్రిమినల్స్‌ని డీల్ చెయ్యాలి. పాలిటిక్స్‌ని డీల్ చెయ్యాలి.
పబ్లిక్‌లో ప్రతివాడికీ ఓ 'పెద్దమనిషి' ఉంటాడు.
ఆ పెద్దమనిషినీ డీల్ చెయ్యాలి. ఇన్ని చెయ్యాలంటే..
ఎంత డేరింగ్‌గా ఉండాలి? ఎంత డోన్ట్ కేరింగ్‌గా ఉండాలి.
సినిమాల్లో అయితే మహేష్ బాబు 'పోలీస్' అనగానే
అంతా గప్‌చుప్ అయిపోతారు.
'నేనేరా పోలీస్.. ఆ..' అని సాయికుమార్ అనగానే..
అంతా సెట్‌రైట్ అయిపోతారు.
రియల్ లైఫ్‌లో అలా నడవదు.
నిజంగా అలా ఉండదా?
ఉంటుంది.. ఇదిగో ఇలాంటి 'షి'ంహాలు ఉంటే.. పవరున్నవాడైనా, పొగరున్నవాడైనా దారికి రావాల్సిందే. ఇటీవలి కాలంలో అలా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కే పేరు తెచ్చిన కొందరు మహిళా పోలీస్‌ల సాహసాలు.. స్వాభిమానాల సంఘటనలు, ప్రతిఘటనలు ఇవి.

1 శ్రేష్ఠ ఠాకూర్

డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్యానా సర్కిల్ ఆఫీసర్ (బులంద్‌షహర్)
2017 జూన్

హెల్మెట్ లేకుండా బండి నడుపుతున్న వాళ్ల మీద యాక్షన్ తీసుకుంటున్నారు శ్రేష్ఠ. 'పోనివ్వమ్మా.. పోలీసమ్మా' అన్నారు బీజేపీ వాళ్లు సీన్‌లోకి వచ్చి. 'మీరెవరు?' అన్నారు శ్రేష్ఠ. 'స్టేట్‌లో పవర్ మాదే' అన్నారు వాళ్లు. 'పవర్‌లో ఉన్నవాళ్లయితే పర్‌ఫెక్ట్‌గా ఉండాలి కదా' అన్నారు శ్రేష్ఠ. బీజేపీ లీడర్స్‌కి, శ్రేష్ఠకీ గొడవైంది. అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. జూలైలో శ్రేష్ఠకు ట్రాన్స్‌ఫర్ అయింది! బులంద్‌షహర్ నుంచి ఆమెను బారైచ్ పంపించారు. శ్రేష్ఠపై బీజేపీ నాయకులు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్‌కు కంప్లైంట్ చెయ్యగానే ఆయన వెంటనే ఏమీ యాక్షన్ తీసుకోలేదు. స్టేట్‌లో 244 మంది పోలీసు అధికారులకు బదలీలు అయ్యాయి. సింపుల్‌గా ఆ లిస్టులో శ్రేష్ఠ పేరును చేర్చారు. శ్రేష్ఠ వర్కింగ్ ఏరియా అయితే మారింది కానీ, ఆమె వర్కింగ్ స్పిరిట్ మారలేదు. బారైచ్‌కు బదలీ చేశాక ఫేస్‌బుక్‌లో ఇలా రాసుకున్నారు శ్రేష్ఠ.

'బారైచ్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. ఈ ప్రాంతం నేపాల్ బార్డర్‌లో ఉంటుంది. డోన్ట్ వర్రీ మై ఫ్రెండ్స్. నేను సంతోషంగా ఉన్నాను. నా పనికి ఇది గుర్తింపుగా భావిస్తున్నాను. మీ అందరికీ బారైచ్‌కు నా ఆహ్వానం'.

2 మోనికా సేన్

ప్రొబేషనరీ ఐ.పి.ఎస్. ఆఫీసర్
జూలై 12, 2017

రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో అల్లరి మూకలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. గ్యాంగ్‌స్టర్ ఆనంద్ పాల్ సింగ్‌ను ఎవరో చంపేశారు. ఆ ఘటన హింసకు దారి తీసింది. షాపుల్ని, బస్సుల్నీ, ప్రత్యర్థి గ్యాంగ్ అనుచరుల ఇళ్లను ధ్వంస చేస్తున్నారు ఆనంద్‌పాల్ మనుషులు. శాంతిభద్రతల్ని అదుపు చెయ్యడం కోసం ఆనంద్‌పాల్ అనుచరుల్ని అదుపులోకి తీసుకున్నారు మోనికా! 'ఏం ఆఫీసర్... బతకడానికేనా?' అని హయ్యర్ సర్కిల్స్ నుంచి ఫోన్. 'డ్యూటీనే నా బతుకు' అన్నారు మోనికా. 'నా డ్యూటీని నన్ను చెయ్యనివ్వండి' అనీ అన్నారు. అంతకు ముందు మార్చిలో ఇంకో ఘటన జరిగింది. మోనికా అక్రమ సారా వ్యాపారులను అడ్డుకున్నారు. వాళ్ల తరఫున బీజేపీ నాయకుడొకరు ఆమెను బెదిరించాడు. చూసీ చూడనట్టు పొమ్మన్నాడు. 'చూశాక, ఇక పోయేది లేదు' అని అతడిపై కేసు పెట్టి, అరెస్ట్ చేశారు మోనికా.

3 రూపా మౌద్గిల్

కర్నాటక డి.ఐ.జి. (ప్రిజన్స్)
17 జూలై 2017

శశికళ పవర్‌ఫుల్. ఆమె చుట్టూ ఉన్న వాళ్లు పవర్ ఫుల్. జైలు నిబంధనలకు విరుద్ధంగా శశికళ సకల సౌకర్యాలూ అనుభవిస్తున్నారనీ, తన పై అధికారులే భారీ మొత్తంలో లంచాలు తీసుకుని ఆమెకు సహకరిస్తున్నారని రూప ధైర్యంగా బయటపెట్టారు. రూప ఆరోపణలపై విచారణ మొదలైంది. అది పూర్తయ్యేలోపే రూప, ఆమె సీనియర్ డి.జి. సత్యనారాయణరావు అక్కడి నుంచి ఇంకో చోటికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. 'నేనెక్కడైనా ఇంతే' అని రూప ధైర్యంగా ఓ స్టేట్‌మెంట్ కూడా ఇచ్చి వెళ్లారు.

4 ఉషా సోమ్‌వంశీ

సబ్ ఇన్‌స్పెక్టర్
జూలై 2017

జబల్‌పూర్ (మధ్యప్రదేశ్)లోని దుమ్నా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉషా సోమ్‌వంశీ. అద్దాలకు టింటెడ్ ఫిల్మ్ అంటించుకుని వెళుతున్న ఓ కారును అడ్డుకున్నారు. కారులో ఉన్నవారికి పెనాల్టీ రాశారు. కారులో ఉన్నవారు పలుకుబడి ఉన్నవారి పిల్లలు. 'మాతో పెట్టుకోకు ఆఫీసర్' అని చెప్పారు. 'పెట్టుకోడానికే నేనుంది' అని ఆమె కారు కీస్ తీసుకున్నారు. ఇదంతా వైరల్ అయింది. ఆ వెంటనే ఆమె ట్రాన్స్‌ఫర్ అయింది.

5 చారూ నిగమ్

ఐ.పి.ఎస్., గోరఖ్‌పూర్ సర్కిల్ ఆఫీసర్
మే 2017

చారూ నిగమ్ ఝాన్సీలో పని చేసేటప్పుడు ఇల్లీగల్ లిక్కర్ మాఫియాను పరుగులు తీయిస్తుంటే పనిష్మెంట్‌గా గోరఖ్‌పూర్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు. మే నెలలో ఇక్కడా ఆమె తన తఢాకా చూపించారు. రోడ్డు మీద నిరసన చేస్తూ ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్న వారిని ఆమె పక్కకు తోసేశారు. 'మా నాయకుడు వస్తున్నాడు' అని చెప్పినా ఆమె వినలేదు. ఆ నాయకుడు బీజేపీ ఎమ్మెల్యే రాధా మోహన్ అగర్వాల్. వచ్చీ రాగానే చారూపై విరుచుకు పడ్డాడు. 'లిమిట్స్ దాటకు' అని హెచ్చరించాడు. అతడి మోటు భాషకు చారూ ఖిన్నురాలయ్యారు. వెంటనే సర్దుకున్నారు. రాబోయిన కన్నీటిని ఆపుకున్నారు. 'ఆ నీటి తెర డ్యూటీలో నేను బలహీనమైనందుకు కమ్మినది కాదు, స్త్రీగా నా ఉద్యోగానికి ఒక సంకేతం' అని ఆమె ధైర్యంగా చెప్పుకున్నారు.

చారూ రూర్కీ ఐఐటిలో బీటెక్ చేశాక మనసు మార్చుకుని మరీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చారు.

దేశంలో మహిళా పోలీసులు
(2016 జనవరి 1 నాటికి)

పోలీసు శాఖలో మహిళా పోలీసుల శాతం	7.1
మహిళా ఐ.పి.ఎస్. ఆఫీసర్ల సంఖ్య	296
మహిళా పోలీసుల సంఖ్య	1,22,912

ఇన్‌పుట్స్: బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఈ బ్యూరో అధినేత కూడా మహిళా ఐ.పి.ఎస్. ఆఫీసరే! పేరు **మీరా బోర్వాంకర్**)

6 సంగీతా కాలియా

ఐ.పి.ఎస్., ఫతెహాబాద్ ఎస్.పి.
నవంబర్ 2015

హర్యానా హెల్త్ మినిస్టర్ అనిల్ విజ్‌తో పడింది సంగీతకు. జిల్లా ఫిర్యాదులు, పౌర సంబంధాల కమిటీ సమావేశం జరుగుతోంది. ఆ సమావేశంలో అనిల్ విజ్ ఉన్నాడు. అక్కడే ఎస్.పి. సంగీత ఉన్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యను సంగీత ఆ హెల్త్ మినిస్టర్ దృష్టికి తెచ్చింది. ఆయనకు కోపం వచ్చింది. 'ఇక్కడి నుంచి వెళ్లిపో' అన్నాడు. 'మీరు పొమ్మంటే పోడానికి నేనిక్కడి రాలేదు. నా జాబ్ నేను చేయడానికి వచ్చాను' అని అక్కడే హఠం వేసుకుని కూర్చున్నారు సంగీత. మినిస్టర్ మనసులో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి ఆమెను ట్రాన్స్‌ఫర్ చేయించాడు.

7 దమయంతీ సేన్, ఐ.జి.,

అడ్మినిస్ట్రేషన్, పశ్చిమబెంగాల్
ఏప్రిల్ 2012

2012 తర్వాత దమయంతీ సేన్ కామ్ అయిపోయారని కాదు. ఆ ఏడాది ఆమె చూపిన తెగువ ఆమె కెరీర్‌లోనే ముఖ్యమైంది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన 'పార్క్ స్ట్రీట్ రేప్' కేసులో దమయంతి ఇచ్చిన నివేదిక, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటనకు విరుద్ధంగా ఉంది. తన ప్రతిష్ఠను దెబ్బతియ్యడానికి ఈ రేప్ కేసును వాడుకున్నారని మమత అనడం, 'కేసును పరిశీలిస్తే అలాంటిదేమీ లేదు' అని దమయంతి నివేదిక ఇవ్వడం అప్పట్లో పెద్ద చర్చ అయింది. 'ఇంత రచ్చ చేశావ్ ఏంటి తల్లీ' అని డిపార్ట్‌మెంట్ తలకొట్టుకుంటే.. దమయంతి మాత్రం 'ఉన్న విషయమే చెప్పాను' అని సింపుల్‌గా అన్నారు. అప్పుడు దమయంతీ సేన్ జాయింట్ కమిషనర్. ఆ పోస్టు నుండి ఆమెను అంతకన్నా తక్కువ ప్రాముఖ్యం ఉన్న డి.ఐ.సి. ట్రెనింగ్ విభాగానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. తిరిగి 2014లో ప్రభుత్వం ఆమెకు ఇలాంటి కీలకమైన కేసునే అప్పగించింది.

8 ఈషా పంత్, ఐ.పి.ఎస్. ఆఫీసర్

ప్రియాంక చోప్రా పోలీస్ ఆఫీసర్‌గా నటించిన 'జై గంగాజల్' చిత్రం ఈషా డైనమిజం ఆధారంగా తయారైందే. అప్పట్లో ఆమె భూపాల్ ఆఫీసర్. ప్రస్తుతం కర్నాటకలో విధులు నిర్వహిస్తున్నారు.

9 మెరిన్ జోసెఫ్

కేరళ ఐ.పి.ఎస్. ఆఫీసర్

'అందాల రాశులైన మన ఐ.పి.ఎస్. ఆఫీసర్‌లు' అంటూ ఒక వార్తా పత్రిక ఓ పెద్ద జాబితా ఇవ్వడాన్ని మెరిన్ తీవ్రంగా నిరసించారు. ట్విట్టర్‌లో ఆ పత్రికపై విరుచుకు పడ్డారు.

10 కిమ్ శర్మ, బిహార్ ఐ.పి.ఎస్. ఆఫీసర్

ఒరిజినల్ లేడీ సింగం అని పేరు. ఆమె అభిమానులు ఆమె పేరుతో 'హెరాస్‌మెంట్' అనే ఒక ఫేస్‌బుక్ అకౌంట్‌నే సృష్టించారు.



ఫస్ట్ ఉమన్: కిరణ్ బేడీ

ఇండియాలో తొలి మహిళా ఐ.పి.ఎస్. అధికారి. బేడీని 'క్రేన్ బేడీ' అనేవారు. ఢిల్లీలో రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాలను ఆమె భారీ క్రేన్‌లతో ఎప్పటికప్పుడు ఎత్తేయించేవారు. అందుకు ఆ పేరు వచ్చింది. తీహార్ జైల్‌లో తొలిసారి సంస్కరణలను ప్రవేశపెట్టింది కూడా బేడీనే. 2015 ఢిల్లీ ఎన్నికలకు ముందు బేడీ బీజేపీలో చేరారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆమె పుదుచ్చేరి గవర్నర్‌గా ఉన్నారు.



కంచన్ చౌదరి భట్టాచార్య

దేశంలో డైరెక్టర్ జనరల్ ర్యాంక్‌కి చేరుకున్న తొలి మహిళా పోలీస్ ఆఫీసర్ కంచన్. 2014లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. 1980ల నాటి టెలీ సీరియన్ 'ఉడాన్'కు ఆమె జీవితమే ఇన్‌స్పిరేషన్. కిరణ్ బేడీ తర్వాత రెండో మహిళా ఐ.పి.ఎస్. కంచన్.

ఆత్మీయం

మన ఆయుష్షు మన చేతుల్లోనే!

అన్నీ ఉన్నా ఆయుష్షు లేకపోతే ప్రయోజనం ఏమీ ఉండదు. అందుకే ఈ లోకంలో ప్రతి ఒక్కరూ తాము ఆయురారోగ్యైశ్వర్యాలతో సుఖంగా జీవించాలని కోరుకుంటారు. అది సహజం. అందుకే సంకల్పంలో కూడా అదే చెప్పుకుంటారు. మనం పెద్దలకూ, పూజారులకూ నమస్కరించినప్పుడు వారు 'ఆయుష్మాన్ భవ' అని ఆశీర్వదిస్తారు. అయితే లోకంలో కొందరు పూర్ణాయుష్కులుగానూ, మరికొందరు అర్ధాయుష్కులుగానూ, ఇంకొందరు అల్పాయుష్కులుగానూ ఉంటున్నారు. అందుకు కారణం వారి అలవాట్లు, నడవడిక అన్నింటికీ మించి విధిరాత.

'మానవుడు జీవించి ఉంటే వంద సంవత్సరాలకైనా ఆనందాన్ని పొందగలడు అన్న లోకోక్తి సత్య దూరం కాదని నాకు తోస్తోంది..!' అని లంకలోని అశోకవనంలో రావణ బందీగా ఉన్న సీతాదేవి రామదూతగా తన వద్దకు వచ్చిన హనుమంతునితో అన్న మాటలు ఇవి. వ్యాసభారతంలో ధృతరాష్ట్రుడు విదురుని ఓ ప్రశ్న అడుగుతాడు.. 'వేదాలు మానవునికి నూరు సంవత్సరాల ఆయువు అని చెబుతున్నాయి. కానీ, మానవుడు ఏ కారణం చేత పూర్ణాయుర్దాయం పొందలేకపోతున్నాడు?' అని. దీనికి విదురుని సమాధానం... 'గర్వము, హద్దుమీరి పలుకుట, మహాపరాధాలు చెయ్యటం, క్రోధం, తన సుఖమే చూసుకోవడం, నమ్మిన వారిని చెరచటం అనే ఆరు లక్షణాలు పదునైన కత్తుల వంటివి. దేహం ఆయువును ఇవి నశింపజేస్తాయి. నిజానికి మానవుని చంపేది ఈ లక్షణాలే, మృత్యువు కాదు. కాబట్టి ముందు మనలోని ఈ ఆరు అవలక్షణాలనూ వెళ్లగొట్టగలిగితే మన ఆయుష్షు ఆ మేరకు పొడిగించుకోగలిగినట్లే!




గుడ్ ఫుడ్

ఇమ్యూనిటీని పెంచే చిలగడదుంప

ఉడకబెట్టుకొని తింటే అద్భుతంగానూ, నిప్పుల మీద కాల్చుకుని తింటే పరమాద్భుతంగానూ ఉండే చిలగడదుంప అంటే చాలామందికి ఇష్టమే. వేర్వేరు ప్రాంతాల్లో దీనికి గణుసుగడ్డ, మోరంగడ్డ అంటూ రకరకాల పేర్లు కూడా ఉన్నాయి. కేవలం రుచి విషయంలోనే కాదు... ఆరోగ్యపరంగానూ దీని విశిష్టతలు ఎక్కువే.

- చిలగడదుంపలో విటమిన్–బి6 పాళ్లు పుష్కలం. విటమిన్–బి6 అనేది హోమోసిస్టిన్ అనే రసాయనం దుష్ప్రభావాన్ని తగ్గిస్తుంది. గుండెజబ్బులు వచ్చేందుకు ఈ హోమోసిస్టిన్ కారణమవుతుంది. అంటే చిలగడదుంప వల్ల అనేక గుండెజబ్బులు నివారితమవుతాయని నిర్ద్వంద్వంగా తేలింది.
- చిలగడదుంపలో బీటా–కెరొటిన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. అవి శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తాయి.
- చర్మంలోని కణాలను గట్టిగా దగ్గరగా పట్టి ఉంచే కొలాజెన్ ఉత్పత్తికి విటమిన్–సి బాగా దోహదపడుతుంది. అందుకే విటమిన్–సి పోషకాలను పుష్కలంగా తీసుకునేవారి చర్మం చాలా కాలం యౌవనంగా ఉంటుందన్నమాట. చిలగడదుంపలోనూ విటమిన్–సి పాళ్లు చాలా ఎక్కువ. అందుకే దీన్ని తినేవారి చర్మం అంత త్వరగా ఏజింగ్ దుష్ప్రభావాలకు గురికాదు.
- చిలగడదుంపలో శరీరంలోని విషాలను బయటకు పంపే గుణం ఉంది. ఒత్తిడి వల్ల ఒంట్లో పేరుకునే విషాలను కూడా చిలగడదుంప తొలగిస్తుంది.
- చిలగడదుంపలో ఐరన్ పాళ్లు ఎక్కువ. అందుకే రక్తహీనత ఉన్నవారు దీన్ని తీసుకోవడం వల్ల ఒంట్లో రక్తహీనత తగ్గడంతో పాటు, తగినన్ని ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాల ఉత్పాదన జరుగుతుంది.
- ఇందులోని మెగ్నీషియమ్ మన ఒంట్లోని ధమనులు, ఎముకలు, గుండె, నరాల పనితీరును మెరుగుపరుస్తుంది.



బ్యూటిప్స్


ఇంట్లోనే వాక్సింగ్

చేతుల మీద అవాంఛిత రోమాలను తొలగించడం పెద్ద పనే. కానీ ఇంట్లోనే వ్యాక్సింగ్ చేసుకోవచ్చు.

ఒక టీ స్పూను నిమ్మరసంలో ఒక టీ స్పూను చక్కెర కలిపి వేడి చేయాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే వ్యాక్సింగ్ నైఫ్‌తో కాని స్పూను వెనుక భాగంతో కాని చేతులకు పట్టించి వెంటనే కాటన్ క్లాత్ కప్పేసి గట్టిగా అదమాలి. వ్యాక్సింగ్ మిశ్రమం చల్లారి ఆరే కొద్దీ చర్మానికి క్లాత్ అతుక్కుపోతుంది. పూర్తిగా ఎండిన తరువాత క్లాత్ ఒక వైపును పట్టుకుని గట్టిగా లాగేయాలి. ఇలా చేయడం వల్ల రోమాలన్నీ క్లాత్‌కు అతుక్కుని వచ్చేస్తాయి. ఇది కొంచెం నొప్పిగా అనిపిస్తుంది కాని క్రమంగా రోమాల కుదుళ్లు బలహీన పడి పెరుగుదల ఆగిపోతుంది. వ్యాక్సింగ్ పట్టించేటప్పుడు రోమాలు ఏ దిశగా ఉన్నాయన్న సంగతిని గుర్తించి అదే దిశగా అప్లై చేసి, క్లాత్ లాగేటప్పుడు వ్యతిరేక దిశగా లాగాలి. వ్యాక్సింగ్ చేసినప్పుడు ర్యాష్ వచ్చినట్లయితే వెంటనే రెండు చుక్కల గ్లిజరిన్ రాయాలి. వ్యాక్సింగ్ చేయడానికి క్లాత్‌కు బదులు వ్యాక్సింగ్ టిష్యూలను వాడవచ్చు.



లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! తను, నేను 4 ఇయర్స్ నుంచి చాలా మంచి ఫ్రెండ్స్. ఒకసారి ఇద్దరికీ గొడవ జరిగి మాట్లాడ్డం మానేశాడు. అప్పుడు తనకి నాపై లవ్ ఫీలింగ్ కలిగిందట. తను నాకు చెప్పాడు. అప్పుడు నేను రిజెక్ట్ చేశా. అయినా తను నన్ను వదలకుండా కేరింగ్ తీసుకునేవాడు. నేను అడగకుండానే హెల్ప్ చేసేవాడు. తను చూపించే ప్రేమకి నాకూ ఆ ఫీలింగ్ కలిగింది. ఎక్స్‌ప్రెస్ చేశా. అయితే.. 'ఇప్పుడు నీ మీద ఎలాంటి ఫీలింగ్ లేదు. ఒకప్పుడు ఉండేది సారీ' అంటున్నాడు. కానీ తన పర్స్‌లో ఇంకా నా ఫోటో ఉంది. నేను ఇచ్చిన గిఫ్టులు అన్నిటినీ మెమరీగా దాచుకున్నాడు. ఒకప్పుడు నేనే తన ప్రపంచం. కానీ ఈ మధ్య నేను కాల్ చేస్తే వర్క్ ఉందని అబద్ధం చెబుతున్నాడు. అసలు నాపై తనకు ఉన్న అభిప్రాయం ఏంటి? ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటారు సార్ ప్లీజ్ చెప్పండి?

- నీరజ



గేమ్స్ ఆడుతున్నాడు!

నువ్వు తన విషయంలో వీక్ అని తెలుసుకుని గేమ్స్ ఆడుతున్నాడు!

పట్టించుకోనట్లు ఉంటే నువ్వు నిండా మునిగిపోయి 'శరణం శరణం..' అని వెంటపడతావని తేలిపోయింది!!

''మరి ఇప్పుడు నీరజ ఏం చెయ్యాలి సార్?''

రివర్స్ గేమ్ ఆడాలి!

''అంటే.. వాట్ చెయ్యాలి?''

ఫుల్‌గా అంజాన్ కొట్టాలి!!

''అంజాన్?''

'నువ్వు ఎవరు రా' అన్నట్లు పట్టించుకోకుండా ఉండాలి!!

''అప్పుడు ఏమౌతుంది సార్?''

గిలగిలా కొట్టుకుంటాడు.. జ్వరం వస్తుంది!!

''లవ్ డాక్టర్‌కి లెటర్ రాస్తాడు...''

ఎస్!!

''అప్పుడు మీ చెల్లెలి రివెంజ్ మీరు గడ్డి పెట్టి తీర్చుకుంటారు!!''

ఎస్!!

''ఇదిగోండి సార్ అబ్బాయిలను అంతగా టార్చర్ పెట్టే మీకు... అరటి ఆకు! తినండి!!''



లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		9	6			2		
8				1	2	7		5
	2	5	7	9		4	3	
			4		9	8	5	
		2				9		
	5	3	1		7			
	1	4		7	6	3	8	
2		7	8	4				9
		8			1	5		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	3	4	8	1	5	7	9	6
9	5	1	2	7	6	3	8	4
7	6	8	9	3	4	1	5	2
4	2	3	5	8	1	9	6	7
5	1	7	3	6	9	4	2	8
6	8	9	7	4	2	5	1	3
8	4	5	1	2	3	6	7	9
3	9	2	6	5	7	8	4	1
1	7	6	4	9	8	2	3	5

కిచెన్ కుచేల

అటుకులు అతుకేసే స్నేహాన్ని మించిన స్నేహం లేదు. అంటే, పేదరికం స్నేహానికి అడ్డం రాదు. అంత పవిత్రమైంది అటుకుల స్నేహం. శ్రీకృష్ణుడిని కలవడానికి వెళ్లిన కుచేలుడు తీసుకెళ్లిన కానుక అటుకుల మూట. పంచభక్ష్య పరమాన్నాలు తినే శ్రీకృష్ణుడు అటుకులు తిని తన్మయత్వం చెందాడు. రేపు స్నేహితుల దినోత్సవం. అటుకులు పంచండి. స్నేహం పెంచండి.





హాట్ పోహా!

కావల్సినవి: అటుకులు-4 కప్పులు; పచ్చిమిర్చి - 2; ఎండుమిర్చి - 3; జీడిపప్పు - 3 టేబుల్ స్పూన్లు; శనగపప్పు - 5 టేబుల్‌స్పూన్లు; పుట్నాల పప్పు - 5 టేబుల్ స్పూన్లు; కరివేపాకు - 2 రెమ్మలు; పసుపు - అర టీ స్పూన్; ఉప్పు - టీ స్పూన్; ఆలివ్ నూనె-4 టేబుల్ స్పూన్లు

TIME TECHNO	171.55	174.7
TIMKEN INDI	698.65	712.65
TIPS INDUST	62.25	63.4
TITAGARH WA	116.3	118.1
TOKYO PLAST	144	144.7
TORRENT POW	187.25	183.7
TOURISM FIN	100.5	101.1
TPL PLASTEC	475.75	484.9
TRANS & REC	342.2	340.3
TRENT LTD	279.25	277.95
TRF LIMITED	216.35	214
TRIB BHIMJI	112.3	106.45
TRIDENT LIM	85.9	84.15
TRIVENI ENG	97.8	89.45
TRIVENI TUR	136.95	139.4
TTK HEALTHC	712.95	777.6
TTK PRESTIG	6389.1	6138.3
TUBE INVEST	751.3	758.45
TV TODAY NE	239.55	240.85
TV VISION L	225.65	227.5
TVS ELECTRO	183.6	186.2
TVS MOTOR C	599.3	586.7
TVS SRICHAK	3602.2	3644.9
UCAL FUEL S	208.4	208.05
UFLEX LIMIT	430.5	428.15
UFO MOVIEZ	367.8	364.85
UJJIVAN FIN	320.65	308.75
UMANG DAIRI	80.6	79.05
UNICHEM LAB	262.9	268.55
UNION BANK	145.1	143.6
UNIPHOS ENT	87.45	89.85
UNIPLY INDU	269.2	269.3
UNITED NILG	305.95	318.1
UNIVERSAL C	111	112
UTTAM SUGAR	176.55	176
V W X Z		
V-GUARD IND	181.65	180.9
V2 RETAIL L	266.95	273.5
VA TECH WAB	623.15	622.65
VADILAL IND	921.95	912.1
VADIVARHE S	115.6	114.55
VAIBHAV GLO	526.2	519.7
VAKRANGEE L	448.7	451
VARDHMAN HO	3338.9	3370.75
VARDHMAN SP	127.45	129.8
VARDHMAN TE	1202.1	1209.8
VARUN BEVER	502.5	498
VENKY'S (IN	2150.95	2052.4
VENUS REMED	107.8	111.5
VESUVIUS IN	1382.8	1389.4
VETO SWITCH	223.1	215.75
VIDHI SPCLT	62.5	62.2
VIJAYA BANK	67.7	68.45
VINATI ORGA	1051.8	1027.05
VINDHYA TEL	1052.4	1051
VINYL CHEMI	76.1	75.35
VIP CLOTHIN	60.95	61.35
VIP INDUSTR	194.3	185.95
VIPUL LIMIT	84.9	84.05
VISHNU CHEM	278.95	276.65
VLS FINANCE	66.35	65
VMART RETAI	1161.55	1166.5
VOLTAMP TRA	1161.4	1157.6
VOLTAS LTD	541.7	538.3
VRL LOGISTI	343.45	327.4
VST TILLERS	2196.15	2219.9
WABCO INDIA	5690	5537.05
WALCHANDNAG	146.45	147.95
WEBSOL ENER	112.7	112.05
WEIZMANN FO	760.1	750
WELSPUN COR	129.9	126.6
WELSPUN ENT	130.25	128.2
WELSPUN IND	82.05	83.9
WENDT (INDI	2488.25	2482.2
WEST COAST	199.55	199.15
WHEELS INDI	1447.05	1454.25
WHIRLPOOL O	1158.7	1166.05
WINDSOR MAC	57.7	57
WOCKHARDT L	599.75	594.15
WONDERLA HO	345.55	347.9
XCHANGING S	60.15	60.05
ZANDU REALT	1287.4	1303.65
ZEN TECHNOL	56	55.9
ZENSAR TECH	784.95	787.9
ZODIAC CLOT	196.8	197.75
ZOTA HEALTH	132.7	133
ZUARI AGRO	375.45	364.1
ZUARI GLOBA	134.1	133.35
ZYDUS WELLN	885.2	886.1

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.96	8.95
Alphageo	871.45	869.9
Alu Flouride	57	58.6
AditSpin	9	8.96
Alphageo	880	871.45
Alu Flouride	58.05	57
Amar Raja Bat	805.65	820.1
And Bank	56.05	55
And Cemen	9.85	9.58
And Paper	310.45	310.7
And Petro	27	25.25
Anjani Portl	227.9	225.2
Aries Agro Ltd	144.9	145.05
Aurobindo Ph	725.2	741.35
Avantel Soft	224.95	220.05
Avanti Feeds	1782	1786.15
AvonOrg	5.87	6
BN Rathi Sec	36	35
Balaji Amin	322	318.8
Bambino Agro	180	182.9
Bartronics	15.05	15.25
Bhagira Chem	171	173.6
Bhagya Nag	24	23.7
Bhagya Wood	27.6	26.35
Brilliant Sec	7.4	7.73
CIL Securi	41.2	43.15
Color Chip	53.85	50
Combat Drugs	11.71	11.71
Cont Coffee	279.05	284.75
CoroFert	445	457.15
Cosboard Ind	36.95	35.3
Country Club	14.96	14.53
Cubex Tub	18.45	18.05
Cybermate	3.27	3.15
DR Reddy	2244.1	2331.85
Danlaw Tec	49	50.8
DecCement	1105.15	1125
Divi's Lab	681.6	670.45
Divya Granit	99	101.8
Dolphin Medi	1.33	1.33
Dredgin Corp	625.4	605.05
Empee Sugars	5.8	5.9
Everest Org	98	99.55
Fortune Info	101.1	102.9
Four Soft	103.7	107.95
GMR Ferro	3.04	2.9
GMR Infra	17.65	17.95
GR Cables	0.33	0.34
GVK Power	12.35	12.05
Gati Corpn	120.2	116.1
Gayatri Bio	11.74	11.74
Gayatri Proj	169	165.35
Gayatri Sugrs	9.63	9.84
Gennex Lab	4.63	4.62
GodavDru	39.1	38.3
Goldstn Tele	79.45	75.7
Goldstone Tech	9.92	9.45
Granules (I)	131.95	132.45
HBL Nife Pow	47	47.25
HYDIndus	1104.75	1125.6
Heritage Food	1260	1260.4
ICSA Ltd	2.99	2.9
IDL Industrs	517.8	498.25
IKF Soft	0.64	0.61
IQMS Soft	15.55	15.85
IVRCL Infras	6.32	5.77
Incap	48.5	46.2
IndoNationl	890	898
Infotech En	524	525.8
Innaredy Com	2.99	2.9
Invinex Lab	131.05	131.05
JSTL	42.6	42.65
KCP LTD	101.95	102.25
KNR Constructio	208.65	209
Kabsons Indu	4.2	4
KakatiCem	371.95	376.6
Kallam Spg	27.25	26.85
Karan Woo-sn	0.99	1.04
Kernex Micro	35.7	36.65
Krebs Bio	101	99.15
LGS Global	6.8	6.96
LancoIndus	369.9	368.65
Lokesh Mach	83.2	84.05
MIC Elec	7.99	7.98
Madhucon Proje	31.6	32.25
Maytas Infra	44.5	44.9
Medinova Dia	23.2	23.5
Mold-tek	50.25	50.1
Moldtek Plastic	280	267.45
Moschip Semi	50.6	43.85
NCLInd	206	204.8
NETTLINX	110	111.95
NMDC Ltd	124.95	121.25
NagarAgrich	37.05	37.05
NagarConst	87.1	87.95
Natco Pharma	950	965.2
Nava Bh Ventur	131.75	132.55
Neha Inter	6.04	6.11
Neocure Ther	3.6	3.26
Neuland Lab	1425	1443.55
Nile	622	614.85
Oil Country	46.8	45.1
Ortin labs	16.4	16.3
Pankaj Poly	8.66	8.25
Panyam Cemen	63.05	62.9
PennAlum	0.21	0.21
PennInd	54.8	55
Phytochem I	62.9	59.75
Pitti Lamin	53.85	54.35
Pokarna	1286	1282.4
Prajay Engs	10	9.63
PremiExpl	485.1	460.3
Prism Cement	118.45	116.95
Raasi Refrac	5.13	5.39
Ragsan Petro	66.15	63
Rain Industries	129	129.9
Raj Packagin	57.8	55.25
Ram Informat	46.4	44.25
Restile Cer	5.41	5.51
Roopa Indus	11.6	12.1
Saamya Biotech	1.88	1.88
Sagar Cem	822	836.45
Samkrg Pist	289	293.85
Sampre Nutri	44.55	46.85
SangInd	93.9	91.35
Satvah. Ispat	44	44
Saven Techno	22.8	23
Secund	0.92	0.93
Sibar Auto	11.94	11.38
Softpro Sys	4	3.81
South Bio Tech	3.7	3.73
SrRayAlk	29.9	30.35
Srinivasa Ship	62.65	64.9
Sujana Metal	1.83	2.02
Sujana Towers	4.6	4.52
Sujana Univers	1.15	1.18
Surana Tele	5.14	5.02
Suryachakra Pow	1.63	1.65
Suryalata Sp	143	136
Suryava Spin	9.88	9.45
SuvarCem	164.15	165.35
Suven Pharma	168.5	170.05
TCI Finance	22.7	23.3
Taj Gvk Hotel	164.95	165
Tanla Solutions	35	35.7
Trans Biotek	2.47	2.6
Transport Co	297	301.6
Trendy Knit	0.2	0.21
Usher Agro	7.73	8.13
VBC Ferro	42.7	42.7
VST Indus	2905	2950
Vamshi Rubb	65.8	68.5
Viceroy Hotels	18.7	18.6
VijayTextil	63.3	63.1
Vimta Labs	136.3	137.75
Virat Crane	37.95	36.85
Virinchi Con	90.55	88.35
VisakaInd	487	489.5
Vision Tech	1.47	1.54
Vista Pharma	31.15	30.6
Vivimed Labs	123.15	120.35
ZenoTech Lab	51	51.7



మనగుడి సామగ్రిని పద్మావతి అమ్మవారి ఆలయానికి తీసుకొస్తున్న జేఈవో పోలా భాస్కర్ తదితరులు

15న తెలుగు రాష్ట్రాల్లో మనగుడి కార్యక్రమం

- టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహణ
- తిరుచానూరులో మనగుడి సామగ్రికి ప్రత్యేక పూజలు

తిరుచానూరు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఆలయాల్లో ఈ నెల 15వ తేదీన గోకులాష్టమిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మప్రచార పరి షత్ ఆధ్వర్యంలో మనగుడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తిరుపతి జేఈవో పోలా భాస్కర్ తెలిపారు. శుక్రవారం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మన గుడిపూజా సామగ్రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థానమండపం నుంచి మంగళవాయిద్యాల నడుమ పూజా సామగ్రిని ఆలయంలోకి తీసుకొచ్చి అమ్మవారి చెంత ఉంచి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా జేఈవో పోలా భాస్కర్ మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 1,250 ఆలయాల్లో మనగుడి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 13వ తేదీ ఆలయ శుద్ధి, 14న గోపూజ, 15న భక్తులకు మనగుడి పూజా సామగ్రిలోని పసుపు, కుంకుమ, కలకండ, అక్షింతలు, కంకణాలను అందజేయనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈవో పి.మునిరత్నంరెడ్డి, డీపీపీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏవీఎస్వో పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతితో ఏయూ వీసీ భేటీ



రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు తదితరులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను గురువారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం విశిష్టతను రాష్ట్రపతికి వివరించారు. వర్సిటీ తొమ్మిదో దశకంలో ఉందని, త్వరలో శతాబ్దిలోకి అడుగిడనుందని వివరించారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించాల్సిందిగా రాష్ట్రపతిని ఆహ్వానించారు. రాష్ట్రపతి కోవింద్ మాట్లాడుతూ గతంలో ఒక పర్యాయం తాను ఏయూను సందర్శించిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. వర్సిటీ తరపున రాష్ట్రపతికి వీసీ నాగేశ్వరరావు జ్ఞాపికను బహూకరించారు. వీసీతోపాటు రాష్ట్రపతిని కలిసినవారిలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ బి.మోహన వెంకటరామ్, సెనేట్ సభ్యులు కుమార్‌రాజ, ఏయూ డిఫెన్స్ జాయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉజ్వల్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.30 లక్షలకు టోకరా



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

నిందితుల అరెస్ట్

జగ్గయ్యపేట అర్బన్: ఇరిగేషన్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేసిన ఘరానా మోసగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసులు శుక్రవారం మీడియాకు వెల్లడించిన వివరాల మేరకు అవులమంద రామకృష్ణ అనే వ్యక్తి తెలంగాణలోని సూర్యాపేట ఇరిగేషన్ శాఖలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తనకు ఉన్నతాధికారులతో పరిచయాలున్నాయని.. వారి ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు నిరుద్యోగుల నుంచి రూ.30 లక్షలు వరకూ వసూలు చేశాడు. వారు నిలదీసినప్పుడల్లా త్వరలోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుందని మభ్యపెట్టేవాడు. అయితే అతడి తీరుపై అనుమానం వచ్చిన ఓ వ్యక్తి ఇచ్చిన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడితో పాటు అతని కుమారుడు నవీన్‌ను కూడా అరెస్టు చేశారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీల పెంపునకు కృషి

మంత్రి పితాని సత్యనారాయణ

సాక్షి, అమరావతి: జిల్లాల వారీగా ఈఎస్ఐ డిస్పెన్సరీల పెంపునకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి పితాని సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 78 ఈఎస్ఐ డిస్పెన్సరీలున్నాయని, ఇందులో 66 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, 12 డిస్పెన్సరీలకు మాత్రమే ప్రభుత్వ భవనాలున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. శాశ్వత భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని, ఇందుకు స్థలాలను వెతికే బాధ్యతలు కలెక్టర్లకు అప్పగిస్తామని మంత్రి చెప్పారు. విశాఖలోని ఈఎస్ఐ ఆస్పత్రి శిథిలావస్థకు చేరడంతో వేరే భవనంలోకి మార్చాలని అధికారులకు సూచించారు.

సౌకర్యాలు లేనందునే ఫాతిమా కాలేజీ గుర్తింపు రద్దు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని

సాక్షి, న్యూఢిల్లీ: సరైన సౌకర్యాలు లేనందువల్లే కడపలోని ఫాతిమా మెడికల్ కాలేజీ గుర్తింపును మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రద్దు చేసిందని మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను ఎంసీఐ, కేంద్ర మంత్రి జేపీ నడ్డా దృష్టికి తీసుకెళ్లామని, ప్రస్తుతం సుప్రీం కోర్టు నిర్ణయంపైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. కళాశాలపై చర్యలు తీసుకుంటే విద్యార్థులు నష్టపోతారని అన్నారు. న్యాయస్థానాలు అంగీకరిస్తే మెరిట్ విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు కేటాయిస్తామని చెప్పారు.

రాజకీయాల్లో ఉన్నవాళ్లు చంద్రబాబులా ఉండాలి

మంత్రులు అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబు

సాక్షి, అమరావతి: రాజకీయాల్లో ఉండే వ్యక్తులు చంద్రబాబులా రోల్ మోడల్‌గా ఉండాలని మంత్రులు నక్కా ఆనందబాబు, కె. అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం తాత్కాలిక సచివాలయంలో మంత్రులు మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలోనే కాకుండా ప్రపంచ ప్రముఖుల్లోనే ఒకరిగా ఎదిగిన చంద్రబాబును నడిరోడ్డులో కాల్చి చంపాలని ప్రతిపక్ష నేత జగన్ అనడం తమను ఆవేదనకు గురిచేసిందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబుకు ఎంతో విశ్వసనీయత ఉందని, ఈ విషయాన్ని నంద్యాల ప్రజలు గుర్తించాలన్నారు. మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ప్రతిపక్ష నేత జగన్ చేసిన వ్యాఖ్యలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే వీలుందని, కానీ తాము అలా చేయమన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ రామానుజయ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచండి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: వ్యవసాయ కార్మికుల కోసం కనీస వేతనాల చట్టాన్ని సవరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే కార్మికులు దాదాపు కోటి మంది ఉన్నారని, వీరికి రోజుకు సగటున రూ. 150 మించి రావట్లేదని పేర్కొంది. వ్యవసాయ కార్మికుల జీవన స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాల చట్టాన్ని సవరించి వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.క్రాంతి కిరణ్, వి.వెంకటేశ్వర్లు నాయకత్వంలో పలువురు ప్రతినిధులు శుక్రవారం విజయవాడలో నీరబ్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు.

పావుగంటలో పట్టాదార్ పాస్‌బుక్

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించిన అధికారులు
- మీ సేవా కేంద్రాల్లో ముద్రించి ఇచ్చే సదుపాయం
- విజయవాడలో ఎన్ఐసీ రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు

సాక్షి, అమరావతి: మీసేవ కేంద్రాలు, మీభూమి పోర్టల్ ద్వారా భూమి హక్కు పత్రం, పట్టాదార్ పాసుపుస్తకాన్ని 15 నిమిషాల్లోనే పొందే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. రెవెన్యూ శాఖ ప్రవేశపెడుతున్న ఐటీ ఆధారిత సేవలను శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ అనిల్ చంద్ర పునేఠా మాట్లాడుతూ.. పాత పద్ధతిలో పట్టాదార్ పాస్ పుస్తకం పొందాలంటే నెల రోజులు సమయం పట్టేదని, ఇప్పుడు రూ. 25 ఖర్చుతో పావుగంటలోనే దాన్ని పొందే వీలు కల్పించామన్నారు. దరఖాస్తుదారుడు మీసేవా కేంద్రాన్ని సంప్రదిస్తే బయోమెట్రిక్ ద్వారా వెబ్‌ల్యాండ్‌లో పట్టాదారు పరిశీలన పూర్తిచేసి ఈ–పట్టాదార్ పుస్తకాన్ని ముద్రించి ఇస్తారని తెలిపారు. పలు భద్రతా అంశాలతో ఈ ప్రక్రియను అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా నలుగురు రైతులకు ఈ సరికొత్త విధానం ద్వారా పట్టాదారు పుస్తకాలను ఇచ్చారు. భూశోధక్ అనే మొబైల్ ఆండ్రాయిడ్ అప్లికేషన్ ద్వారా ఎవరైనా పత్రాలు సరైనవో కావో పరిశీలించుకోవచ్చని పునేఠా తెలిపారు. ఫీల్డ్ మ్యాప్ బుక్ (ఎఫ్ఎంబీ) డిజిటలైజేషన్ ప్రక్రియ సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తిచేస్తామని అధికారులు సీఎంకు చెప్పారు. మొత్తం 17,424 గ్రామాలకు సంబంధించిన డిజిటల్ విలేజ్ ప్లాన్ల పనులు కూడా అక్టోబర్ చివరికి పూర్తవుతాయని తెలిపారు. విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 34 ఎస్టేట్, ఇనామ్ గ్రామాలలో ల్యాండ్ సర్వే చురుకుగా సాగుతోందని అధికారులు వివరించారు. కాగా, ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్)రాష్ట్ర స్థాయి కార్యాలయానికి విజయవాడలో కొత్తగా నిర్మిస్తున్న



తాత్కాలిక సచివాలయంలో ల్యాండ్ రెవిన్యూపై అధికారులతోసమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబునాయుడు, చిత్రంలో అధికారులు

ఆర్అండ్‌బీ భవన సముదాయంలో స్థలం కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ నీతావర్మ, యుఐడీఏఐ చైర్మన్ జె.సత్యనారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సతీశ్ చంద్ర, మన్మోహన్‌సింగ్, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ఏవీ రాజమౌళి పాల్గొన్నారు.

పార్కుల్లో ఔట్‌డోర్ ఫిట్‌నెస్ కేంద్రాలు..

రాష్ట్రంలోని 20 పార్కుల్లో ప్రయోగాత్మకంగా ఔట్‌డోర్ ఫిట్‌నెస్ కేంద్రాలు, ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంత హరిత, సుందరీకరణ సంస్థ పనితీరుపై ఆయన సమీక్షించారు. గోగ్రీన్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుంటే సమగ్ర సమాచారం అందించేలా యాప్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. విశాఖ, విజయవాడ, శ్రీకాళహస్తిలో కేంద్రీయ మొక్కల పెంపక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

శశికళ 'సేవకులకు' ఐదేళ్ల జైలు

- విలాసవంతమైన వసతుల కేసులో ఇద్దరికి శిక్ష
- కర్ణాటక హైకోర్టు తీర్పు

సాక్షి ప్రతినిధి, చెన్నై: అన్నాడీఎంకే (అమ్మ) తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళకు జైల్లో విలాసవంతమైన వసతులు కల్పించిన కేసులో ఇద్దరు అధికారులకు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. బెంగళూరు పరప్పన అగ్రహార జైలు మాజీ సూపరింటెండెంట్ జయసింహ, మాజీ ఏఎస్పీ నంజప్పలకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధిస్తూ కర్ణాటక హైకోర్టు గురువారం తీర్పు చెప్పింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో బెంగళూరు పరప్పన అగ్రహార జైల్లో శశికళ నాలుగేళ్ల శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. అయితే శశికళ విలాసవంతమైన వసతులు పొందేందుకు కర్ణాటక జైళ్ల శాఖ డీజీపీ సత్యనారాయణరావు సహా ఉన్నతాధికారులకు రూ. 2 కోట్లు పంచిపెట్టారంటూ జైళ్లశాఖ మాజీ డీఐజీ రూప ఇటీవల సంచలన ప్రకటన చేశారు. దీనిపై కర్ణాటక ప్రభుత్వం రిటైర్డు ఐఏఎస్ అధికారి వినయ్‌కుమార్‌తో విచారణ జరుపుతోంది. తాజాగా, ఇద్దరు అధికారులకు జైలు శిక్ష పడటంతో ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న మరికొందరు అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణకు సిట్

- విజయవాడ సీపీ పర్యవేక్షణలో డీఐజీ స్థాయి అధికారి విచారణ
- సత్యంబాబును హైకోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణ బాధ్యతలను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం హాస్టల్‌లో 2007 డిసెంబర్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ విషయమై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ 302, 372 సెక్షన్‌ల కింద కేసు నమోదైంది. అప్పటి విజయవాడ పోలీస్ కమిషనర్ (సీపీ) సీవీ ఆనంద్ ఈ కేసు దర్యాప్తులో ఉండగానే బదిలీ అయ్యారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నందిగామ ప్రాంతానికి చెందిన సత్యంబాబును 2008 ఆగస్టు 17న నిందితుడిగా అరెస్టు చేశారు. సెల్‌ఫోన్ దొంగతనం కేసులో సత్యంబాబు పట్టుబడటంతో ఆయన్ను ఆయేషా హత్య కేసులో నిందితుడిగా చూపించారనే ఆరోపణలు వచ్చాయి. ఆయేషా హత్య కేసును విచారించిన విజయవాడ మహిళా కోర్టు 2010 సెప్టెంబర్ 29న సత్యంబాబును దోషిగా నిర్ధారిస్తూ జీవిత ఖైదు విధించింది. దీంతో సత్యంబాబు హైకోర్టును ఆశ్రయించగా, ఆయన్ను నిర్దోషిగా ప్రకటిస్తూ ఈ ఏడాది మార్చి 31న తీర్పు వెలువరించింది. ఈ కేసులో అసలు దోషుల్ని పట్టుకోవడంలో పోలీసుల అలక్ష్యాన్ని తప్పుబట్టిన హైకోర్టు.. పునర్విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయేషా హత్య కేసు పునర్విచారణకు డీజీపీ నండూరి సాంబశివరావు ప్రతిపాదించడంతో ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీఐజీ) స్థాయి అధికారి సిట్‌కు నేతృత్వం వహిస్తారని రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఆర్ అనురాధ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న పెళ్లి బస్సు

- 30 మందికి గాయాలు
- ప్రకాశం జిల్లా కనిగిరి వద్ద ప్రమాదం

కనిగిరి: పెళ్లి బృందంతో వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో దాదాపు 30 మంది గాయపడ్డారు. ప్రకాశం జిల్లా కనిగిరి సమీపంలో శుక్రవారం వేకువజామున ఈ ప్రమాదం జరిగింది. వెలిగండ్ల మండలం కంకణంపాడుకి చెందిన పెళ్లి బృందం ఒంగోలులో వివాహ వేడుకను ముగించుకుని గురువారం రాత్రి 2.30 గంటలకు తిరుగు ప్రయాణమైంది. వేకువజామున 4 గంటల సమయంలో బస్సు, ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 30 మందికి గాయాలు కాగా, వారిలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం కొందరిని ఒంగోలుకు తరలించారు.



ప్రమాదస్థలంలో దెబ్బతిన్న వాహనాలు

ఎస్ఐ యు.శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. చప్టా వద్ద లారీ స్లో కాగా పెళ్లి బస్సు వేగంగా దూసుకొచ్చి వెనుక నుంచి ఢీకొన్నట్టు పోలీసులు తెలిపారు.

కృష్ణపట్నంలో కపిల్ సందడి

నవనీత పబ్లిక్ స్కూల్ సందర్శించిన దిగ్గజ క్రికెటర్



కృష్ణపట్నం పోర్టులో పర్యటిస్తున్న క్రికెటర్ కపిల్‌దేవ్

ముత్తుకూరు: భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు శుక్రవారం వచ్చారు. పోర్టు ఆధ్వర్యంలో తూర్పు కనుపూరులో నిర్వహిస్తున్న నవనీత పబ్లిక్ స్కూల్‌ను సందర్శించారు. అనంతరం గోల్ఫ్‌కోర్టును పరిశీలించి.. కాసేపు గోల్ఫ్ ఆడి మొక్కను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణపట్నంలో పోర్టు ప్రాంతం పారి శ్రామికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు పోర్టులో కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆయన వెంట పోర్టు ఎండీ చింతా శశిధర్, సీఈవో అనిల్ ఎండ్లూరి ఉన్నారు.

కోవైలో ఐసిస్ కలకలం

ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ

టీనగర్(చెన్నై): తమిళనాడులోని కోవై(కోయంబత్తూరు)కు చెందిన పలువురు.. ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నట్లు సమాచారం అందడంతో రంగంలోకి దిగిన ఎన్ఐఏ అధికారులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కోవై కరుంబుకడైలోని ఆజాద్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్లా, జీఎం నగర్‌కు చెందిన అబ్దుల్ రెహ్మాన్ సోషల్ మీడియాలో ఐసిస్‌కు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు ఎన్ఐఏ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎన్ఐఏకు చెందిన 15 మంది అధికారులు గురువారం కోయంబత్తూరు చేరుకొని.. మహ్మద్ అబ్దుల్లా, అబ్దుల్ రెహ్మాన్ ఇళ్లల్లో సోదాలు జరిపారు. వీరి నుంచి మత ప్రసంగాలకు సంబంధించిన 76 డీవీడీలు, ఓ ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దర్నీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పేలుడు

- ఉద్యోగికి గాయాలు
- ఉత్పత్తికి అంతరాయం



గాయపడిన సత్తిబాబు

విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ స్టీల్‌మెల్ట్‌షాప్–2లోని స్లాగ్ యార్డ్‌లో శుక్రవారం పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఉద్యోగికి గాయాలయ్యాయి. ఉత్పత్తి ప్రక్రియ లో భాగంగా ఉదయం 4.30 గంటల సమయంలో స్లాగ్ యార్డ్‌లో స్లాగ్‌ను క్రేన్‌తో ఒంపుతున్నారు. అయితే కింద నీరు ఎక్కువగా ఉండటంతో అధిక ఉష్ణోగ్రత గల స్లాగ్ తగిలి భారీ పేలుడు సంభవించింది. దీంతో సుమారు 40 మీటర్ల ఎత్తులో ఉన్న పై కప్పు, పక్కన ఉండే రేకులు ఎగిరిపడ్డాయి. ఈ పేలుడు ధాటికి సుమారు 150 మీటర్ల దూరంలో ఉన్న భవనం అద్దాలు పగిలిపోయాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో సమీపంలో ఎక్కువ మంది లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో క్రేన్ ఆపరేటర్ గొందేశి సత్తిబాబుకు గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి నగరంలోని వేరే ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా కార్మికులు తమకు భద్రత కల్పిస్తే తప్ప విధుల్లోకి వెళ్లబోమని భీష్మించుకు కూర్చున్నారు. జీఎం(స్టీల్) విద్యాసాగర్ చొరవ తీసుకుని కార్మిక నాయకుల సమక్షంలో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు విధుల్లోకి వెళ్లారు. ఈ ఘటన కారణంగా ఉత్పత్తికి అంతరాయం కలిగింది.

హామీల అమలుకు ఐదురోజులే గడువు

- మాట తప్పితే చలో విజయవాడ
- వామపక్ష నేతల హెచ్చరిక



పి. మధు

భీమవరం టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం గరగపర్రు గ్రామంలో సాంఘిక బహిష్కరణకు గురైన దళితులకు ఇచ్చిన హామీలను మరో ఐదు రోజుల్లో అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దళిత సంఘాలను సమీకరించి చలో విజయవాడ చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు. గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీల అమలు కోరుతూ మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన భీమవరం లూథరన్ హైస్కూల్ గ్రౌండ్స్‌లోని పాత చర్చిలో శుక్రవారం సంఘీభావ సదస్సు నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన పి.మధు మాట్లాడుతూ మంత్రుల బృందం గరగపర్రు వచ్చి దళితులకు హామి ఇచ్చి 10 రోజులు పూర్తయిందన్నారు. ఈనెల 3 న అమరావతిలో మంత్రి నక్కా ఆనంద్‌బాబును కలిసిన ప్రతినిధి వర్గానికి మరో ఐదు రోజుల్లో హామీలు అమలు చేస్తామని ప్రకటించారన్నారు. మాట తప్పితే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని దళితులు సూచించిన ప్రదేశంలో పెడతామని మంత్రుల బృందం హామి ఇచ్చిందని, ఇప్పుడు జీఓ తీసుకురావాలని, ప్రతి దళిత కుటుంబానికి రూ.లక్ష నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వారిలో బీసీలు కూడా ఉన్నారంటూ కాలయాపన చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని అమరావతిలోనే నిలదీస్తామన్నారు.

చంద్రగ్రహణం రోజూ శ్రీకాళహస్తిలో దర్శనం

యథావిధిగానే పూజలు, అభిషేకాలు నిర్వహణ

శ్రీకాళహస్తి: చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 7వ తేదీన శ్రీ కాళహస్తీశ్వరాలయంలో యథావిధిగానే పూజలు నిర్వహిస్తామని, భక్తులు స్వామివార్ల దర్శనం కూడా చేసుకోవచ్చని ఆలయ ఈవో భ్రమరాంబ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఆలయాలు మూసివేసినా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మాత్రం పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. రాహుకేతు క్షేత్రం కావడంతో చంద్ర, సూర్యగ్రహణాల సమయంలోనూ ఆలయం తెరచి ఉంటుందని తెలిపారు.

ఎస్సీ పథకాలపై సామాజిక తనిఖీలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్

సాక్షి, అమరావతి: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలపై సామాజిక తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలోని తన చాంబర్‌లో సాంఘిక సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో అమలు చేస్తున్న సామాజిక తనిఖీ విధానంలాగే ఎస్సీ, ఎస్టీ పథకాలపై కూడా సోషల్ ఆడిట్ చేపట్టాలన్నారు. దీని వల్ల అవినీతికి చెక్ పడుతుందని చెప్పారు. రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతి గృహాల్లో డ్రాప్ అవుట్స్‌ను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఢిల్లీలోని ఏపీ ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి

ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో నివసిస్తున్న సుమారు 4 లక్షల మంది తెలుగు ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ పేర్కొన్నారు. ఇటీవల ఏపీ భవన్ ఆర్‌సీగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలోని ఏపీ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం సాయంత్రం 5 నుంచి 6 గంటలకు వరకు ప్రత్యేకంగా సమావేశం కానున్నట్టు చెప్పారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా ఆ సమయంలో తనను కలవొచ్చని తెలిపారు. సమావేశంలో ఆర్‌సీ ఓఎస్డీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అపర్ణ, భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.5 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం

మదురై విమానాశ్రయంలో ఒకరి అరెస్ట్

అన్నానగర్ (చెన్నై): తమిళనాడులోని మదురై విమానాశ్రయంలో ఓ వ్యక్తి నుంచి రూ.3.5 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అగర్‌వత్తుల్లా తయారు చేసి తరలించేందుకు ప్రయత్నిస్తున్న సుబ్రమణ్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. మదురై నుంచి కొలంబోకి వెళ్లే స్పైస్ జెట్ విమానంలో కస్టమ్స్ అధికారులు హఠాత్తుగా తనిఖీలు చేపట్టారు. సుబ్రమణ్యం అనే ప్రయాణికుడి లగేజీలో అగర్‌వత్తుల రూపంలో తయారు చేసిన మత్తు పదార్థాలు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు.

చంపేస్తాం.. తగలబెడ్తాం...

- 'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా' రాజేంద్రసింగ్‌పై తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యం
- టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యాత్రలు చేపట్టొద్దని హెచ్చరిక
- కాన్వాయ్‌ను అడ్డుకుని గంటపాటు నిర్బంధించిన టీడీపీ నేతలు
- ఎన్‌జీటీలో కేసు వేసిన సత్యనారాయణపై దాడికి యత్నం

సాక్షి, అమరావతి బ్యూరో: రాజధాని ప్రాంతంలో తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా సహించబోమని, కాదని ప్రయత్నిస్తే చంపేస్తామని, యాత్రలంటూ వాహనాల్లో తిరిగితే తగలబెడ్తామంటూ వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్‌ను హెచ్చరించారు. రాజేంద్రసింగ్ కాన్వాయ్‌ను సినీఫక్కీలో వెంబడించి, కార్లతో అటకాయించి దాదాపు గంటపాటు నిర్బంధిం చారు. జరీబు భూముల్లో రాజధాని నిర్మాణానికి వ్యతిరే కంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు దాఖ లు చేసిన సత్యనారాయణ పై దాడికి యత్నించారు. సర్ది చెప్ప బోయిన స్థానిక రైతుపై చేయి చేసుకున్నారు. పోలీసుల సమక్షంలోనే చెలరేగిపోయారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాజధాని ప్రాంతంలో టీడీపీ నేతలు బీభత్సం సృష్టించారు.



రాజధాని ప్రాంతం నీరుకొండ, పెద్దపరిమి మార్గంలో వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్ కృష్ణానది పరిరక్షణ యాత్రను అడ్డుకున్న టీడీపీ నాయకులు



పోలీసుల బందోబస్తు మధ్య వస్తున్న రాజేంద్రసింగ్

వెనక్కి వెళ్లిపోవాలంటూ బెదిరింపులు

కృష్ణా నది పరిరక్షణ యాత్ర పేరిట రాజేంద్రసింగ్ మూడు రోజులుగా నదీ పరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్నారు. శుక్రవారం ఉండవల్లి, మంగళగిరి, అమరావతి పరిధిలో యాత్రను ప్రారంభించారు. ఉదయం కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో ప్రభుత్వం చేపట్టిన అక్రమ కట్టడాలను పరిశీలించడానికి ఆయన తన బృందంతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా కొండవీటి వాగు హెడ్ స్లూయిస్ వద్ద ఇళ్లను కోల్పోతున్న మహిళలతో మాట్లాడుతుండగా.. ఉండవల్లికి చెందిన టీడీపీ నేతలు, తాడికొండ మార్కెట్ యార్డు చైర్మన్ బెల్లంకొండ నరసింహారావుతోపాటు మరికొందరు అక్కడికి చేరుకున్నారు. రాజేంద్రసింగ్ బృందాన్ని అడ్డుకున్నారు. తక్షణమే వెనక్కి వెళ్లిపోవాలంటూ దౌర్జన్యానికి దిగారు. రాజేంద్రసింగ్ బృందం సీఎం చంద్రబాబును కలిసేందుకు ఆయన నివాసం వైపు వెళ్లేందుకు యత్నించగా.. అనుమతి లేదంటూ భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో అక్కడి నుంచి పెనుమాక, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, నిడమర్రు మీదుగా బేతపూడి చేరుకున్నారు. మార్గంమధ్యలో పంట పొలాలు, కొండవీటి వాగు ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

కృష్ణా నదిని కాపాడాలన్నదే మా లక్ష్యం

రాజేంద్రసింగ్ బృందం పర్యటన మొదలెట్టినప్పటి నుంచి టీడీపీ నేతలు ఆయన కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించారు. ఉండవల్లిలో దౌర్జన్యానికి దిగిన తెలుగు తమ్ముళ్లకు స్థానికులు ఎదురు తిరిగారు. దీంతో మంగళగిరి మండలం కురుగల్లు వద్ద రాజేంద్రసింగ్‌ను అడ్డుకోవడానికి తాడికొండ మార్కెట్ యార్డు చైర్మన్ బెల్లంకొండ నర్సింహారావు, మండలాధ్యక్షుడు సుబ్బారావు తోపాటు పలువురు టీడీపీ నేతలు మాటువేశారు. మంగళగిరి పోలీసులు తీవ్రంగా హెచ్చరించడంతో అక్కడి నుంచి వెనుతిరిగారు. అయితే రాజేంద్రసింగ్ బృందాన్ని వెంబడిస్తూ వచ్చిన టీడీపీ నేతలు నీరుకొండ సమీపంలోకి రాగానే పదుల సంఖ్యలో కార్లను రహదారిపై అడ్డంగా పెట్టి అడ్డుకున్నారు. రాజధాని నిర్మాణం వల్ల పర్యవరణానికి హాని కలుగుతుందంటూ ఎన్‌జీటీకి ఫిర్యాదు చేసిన సత్యనారాయణను కారులో నుంచి బయటకు లాగే ప్రయత్నం చేశారు. కాన్వాయ్‌కి అతికించిన ఫ్లెక్సీలను చించేశారు. సత్యనారాయణపై దాడికి ప్రయత్నించడంతో పోలీసులు నిలువరించారు. రాజేంద్రసింగ్ టీడీపీ నేతలతో మాట్లాడుతూ.. మేము రాజ ధాని నిర్మాణానికి వ్యతిరేకం కాదు. నదీపరివాహక ప్రాంతంలో అక్రమ కట్టడాలు నిర్మించ వద్దంటూ యాత్ర చేపట్టాం. కృష్ణానదిని కాపాడాలన్నదే మా లక్ష్యం అని వివరించారు. అనంతరం పోలీసుల బందోబస్తు మధ్య అమరావతి బయలుదేరారు.


సాక్షి స్పోర్ట్స్
శనివారం 5-8-2017



ఆనంద్ ఖాతాలో రెండో 'డ్రా'

సెయింట్ లూయిస్: సింక్విఫీల్డ్ కప్ అంతర్జాతీయ గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ వరుసగా రెండో 'డ్రా' నమోదు చేశాడు. పీటర్ స్విడ్లెర్ (రష్యా)తో జరిగిన రెండో గేమ్‌లో నల్లపావులతో ఆడిన ఆనంద్ 31 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీలో... రెండో రౌండ్ తర్వాత ఆనంద్ ఒక పాయింట్‌తో మరో ఆరుగురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు.

రెండోదీ మనవైపే!


జడేజా

లంక గడ్డపై టీమిండియా మళ్లీ 600 పరుగులు చేసింది. రెండో టెస్టులోనూ బ్యాట్స్‌మెన్ గర్జించారు. టెయిలెండర్ల అసాధారణ పోరాట పటిమతో వరుసగా ఈ మ్యాచ్‌లోనూ ఆలౌట్ కాకుండా భారీ స్కోరు బాదేసింది. తద్వారా టెస్టును, సిరీస్‌ను సొంతం చేసుకోవడానికి రంగం సిద్ధం చేసుకుంది.

సాహా, జడేజా అర్ధ సెంచరీలు • అశ్విన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

భారత్ తొలి ఇన్నింగ్స్ 622/9 డిక్లేర్డ్ • శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 50/2

కొలంబో: లంకతో జరుగుతున్న రెండో టెస్టులోనూ భారత బ్యాట్స్‌మెన్ సమష్టిగా కదం తొక్కారు. దీంతో మరోసారి 600 పరుగులు అవలీలగా సాధ్యమయ్యాయి. అశ్విన్ (92 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్), వృద్ధిమాన్ సాహా (134 బంతుల్లో 67; 4 ఫోర్లు, 1 సిక్స్), జడేజా (85 బంతుల్లో 70 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీలు సాధించారు. ఓవర్‌నైట్ స్కోరు 344/3తో రెండో రోజు శుక్రవారం ఆట కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 158 ఓవర్లలో 622/9 భారీస్కోరు వద్ద డిక్లేర్ చేసింది. లంక బౌలర్లలో హెరాత్‌కు 4, పుష్పకుమారకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 2 వికెట్ల నష్టానికి 50 పరుగులు చేసింది. అశ్విన్ (2/38) ఓపెనర్లను అవుట్ చేశాడు. మరో మూడు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో ప్రస్తుతం శ్రీలంక, భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకంటే 572 పరుగులు వెనుకబడి ఉంది. మరోవైపు ఆతిథ్య జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఈ జట్టు ప్రధాన పేసర్ నువాన్ ప్రదీప్ తొడ కండరాల గాయంతో మిగతా సిరీస్‌కు దూరమయ్యాడు.

సెషన్-1 పుజారా, రహానే తొందరగానే...

ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్, సెంచరీ హీరోలు పుజారా (232 బంతుల్లో 133; 11 ఫోర్లు, 1 సిక్స్), రహానే (222 బంతుల్లో 132; 14 ఫోర్లు) తమ క్రితం రోజు స్కోరుకు పెద్దగా పరుగులేమీ జత చేయలేదు. ఆట మొదలైన రెండో ఓవర్లోనే కరుణరత్నే బౌలింగ్‌లో పుజారా వికెట్ల ముందు దొరికిపోయాడు. 'డీఆర్ఎస్'తో బౌలర్ ఈ ఫలితాన్ని రాబట్టాడు. దీంతో నాలుగో వికెట్‌కు 217 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత అశ్విన్‌తో కలిసిన రహానే జట్టు స్కోరును 400 పరుగులు దాటించాడు. ఐదో వికెట్‌కు 63 పరుగులు జోడించాక పుష్పకుమార బౌలింగ్‌లో రహానే స్టంపౌట్ కావడంతో భారత్ 442/5 స్కోరు వద్ద లంచ్‌కు కెళ్లింది.

ఓవర్లు: 30, పరుగులు: 98, వికెట్లు: 2

సెషన్-2 టెయిలెండర్ల జోరు


సాహా

అప్పటికే కీపర్ సాహాతో కలిసి కుదురుగా ఆడుతున్న అశ్విన్ 91 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం కాసేపటికే హెరాత్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డయ్యాడు. టెస్టుల్లో అతనికిది 11వ అర్ధశతకం. తర్వాత సాహాకు హార్దిక్ పాండ్యా జత య్యాడు. అయితే వేగంగా ఆడే క్రమంలో పాండ్యా (20 బంతుల్లో 20; 3 ఫోర్లు) వికెట్‌ను సమర్పించుకున్నాడు. దీంతో 496 స్కోరు వద్ద భారత్ ఏడో వికెట్‌ను కోల్పోయింది. తర్వాత సాహా... జడేజా అండతో 113 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. పుష్పకుమార, పెరీరా బౌలింగ్‌లో జడేజా 2 సిక్సర్లు బాదాడు. ఈ క్రమంలో జట్టు స్కోరు 550 పరుగులకు చేరింది. మరో వికెట్ పడకుండా రెండో సెషన్‌ను ముగించారు.

ఓవర్లు: 30, పరుగులు: 111, వికెట్లు: 2

సెషన్-3 వడివడిగా 600 వైపు...


అశ్విన్

విరామంలో కెప్టెన్ కోహ్లి నుంచి డిక్లేర్ సంకేతం అందుకున్న సాహా, రవీంద్ర జడేజా వేగం పెంచారు. ఈ ప్రయత్నంలో హెరాత్ బౌలింగ్‌లో సాహా స్టంపౌట్‌గా నిష్క్రమించాడు. 70 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న జడేజాకు, షమీ (19; 2 సిక్సర్లు) జత య్యాడు. ఇద్దరు ధాటిగా ఆడారు. హెరాత్ ఓవర్లో షమీ వరుసగా రెండు భారీ సిక్సులు బాదాడు. అతని మరుసటి ఓవర్లో జడేజా మరో సిక్సర్ కొట్టాడు. దీంతో కేవలం 8 ఓవర్లలోనే భారత్ 69 పరుగులు చేసింది. చివరకు 622/9 స్కోరు వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి లంకకు బ్యాటింగ్ అవకాశమిచ్చింది. ఇక్కడే కోహ్లి వ్యూహం ఫలించింది. కెప్టెన్ తనమీద ఉంచిన నమ్మకాన్ని అశ్విన్ వమ్ము చేయలేదు. లంక ఓపెనర్లు తరంగ (0), కరుణరత్నే (45 బంతుల్లో 25; 2 ఫోర్లు)లను పెవిలియన్ చేర్చి... జట్టును కష్టాల్లో పడేశాడు. ఆట నిలిచే సమయానికి కుశాల్ మెండిస్ (16 బ్యాటింగ్), చండిమాల్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఓవర్లు: 8, పరుగులు: 69, వికెట్లు: 2 (భారత్), ఓవర్లు: 20, పరుగులు: 50, వికెట్లు: 2 (శ్రీలంక)

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: ధావన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పెరీరా 35; రాహుల్ (రనౌట్) 57; పుజారా (ఎల్బీడబ్ల్యూ) (బి) కరుణరత్నే 133; కోహ్లి (సి) మాథ్యూస్ (బి) హెరాత్ 13; రహానే (స్టంప్డ్) డిక్‌వెలా (బి) పుష్పకుమార 132; అశ్విన్ (బి) హెరాత్ 54, సాహా (స్టంప్డ్) డిక్‌వెలా (బి) హెరాత్ 67; పాండ్యా (సి) మాథ్యూస్ (బి) పుష్పకుమార 20; జడేజా (నాటౌట్) 70; షమీ (సి) తరంగ (బి) హెరాత్ 19; ఉమేశ్ యాదవ్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు: 14; **మొత్తం (158 ఓవర్లలో) 622/9 డిక్లేర్డ్.**

వికెట్ల పతనం: 1-56, 2-109, 3-133, 4-350, 5-413, 6-451, 7-496, 8-568, 9-598.

బౌలింగ్: ప్రదీప్ 17.4-2-63-0, హెరాత్ 42-7-154-4, కరుణరత్నే 8-0-31-1, పెరీరా 40-3-147-1, పుష్పకుమార 38.2-2-156-2, డిసిల్వా 12-0-59-0.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: కరుణరత్నే (సి) రహానే (బి) అశ్విన్ 25, తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0; మెండిస్ బ్యాటింగ్ 16, చండిమాల్ బ్యాటింగ్ 8; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 50.**

వికెట్ల పతనం: 1-0, 2-33. **బౌలింగ్:** షమీ 3-1-7-0, అశ్విన్ 10-2-38-2, జడేజా 7-4-4-0.

1 శ్రీలంకలో వరుస టెస్టుల్లో ఒకే ఇన్నింగ్స్‌లో 600 పైచిలుకు పరుగులు చేసిన తొలి జట్టు టీమిండియా.

4 టెస్టుల్లో 200 వికెట్లు, 2000 పరుగులు చేసిన నాలుగో భారత ఆటగాడు అశ్విన్.

4 అంతర్జాతీయ క్రికెట్లో వేగవంతంగా ఈ ఘనత (200 + 2000) సాధించిన నాలుగో ఆటగాడిగా అశ్విన్ (51 టెస్టులు) రికార్డులకెక్కాడు. బోథమ్ (ఇంగ్లండ్, 42 టెస్టులు), కపిల్ (50 టెస్టులు), ఇమ్రాన్ (పాక్, 50 టెస్టులు) ముందు వరుసలో ఉన్నారు.



దీపిక-జోష్నా జంటకు కాంస్య పతకం

న్యూఢిల్లీ: ప్రపంచ డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో దీపిక పల్లికల్-జోష్నా చినప్ప (భారత్) జంట పోరాటం ముగిసింది. ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన సెమీఫైనల్లో దీపిక-జోష్నా ద్వయం 11-6, 6-11, 8-11తో జెన్నీ డన్‌కాఫ్-అలీసన్ వాటర్స్ (ఇంగ్లండ్) జోడీ చేతిలో ఓడిపోయింది. దాంతో ఈ భారత జంటకు కాంస్య పతకం లభించింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో దీపిక-జోష్నా 10-11, 11-6, 11-8తో సమంత కార్నెట్-నికోల్ టాడ్ (కెనడా)లపై గెలిచారు.

ఇంగ్లండ్ 260/6

మాంచెస్టర్: దక్షిణాఫ్రికాతో శుక్రవారం మొదలైన నాలుగో టెస్టు మ్యాచ్‌లో తొలి రోజు ఇంగ్లండ్ జట్టు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 6 వికెట్లకు 260 పరుగులు చేసింది. జో రూట్ (52; 6 ఫోర్లు), బెన్ స్టోక్స్ (58; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేయగా... ఓపెనర్ అలిస్టర్ కుక్ (46; 6 ఫోర్లు) రాణించాడు. బెయిర్‌స్టో (33 బ్యాటింగ్), రొలాండ్ జోన్స్ (0) క్రీజులో ఉన్నారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబడ, ఒలివీర్ రెండేసి వికెట్లు తీశారు. నాలుగు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది.

భారత హాకీ క్రీడాకారిణి జ్యోతి గుప్తా ఆత్మహత్య



చండీగఢ్: భారత హాకీ క్రీడాకారిణి 20 ఏళ్ల జ్యోతి గుప్తా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం సాయంత్రం ఆమె మృతదేహం హరియాణాలోని రెవారి స్టేషన్ ట్రాక్స్‌పై కనిపించింది. చండీగఢ్-జైపూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక్కసారిగా ఎదురుగా వెళ్లడంతో ఈ ఘటన జరిగినట్టు పోలీసులు పేర్కొన్నారు. జ్యోతి గతేడాది భారత్‌లోనే జరిగిన దక్షిణాసియా క్రీడల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.

నెమార్ కోసం రూ.1,661 కోట్లు



ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో ఖరీదైన బదిలీగా రికార్డు

- బార్సిలోనా క్లబ్ నుంచి పారిస్ సెయింట్-జెర్మయిన్ జట్టుకు మారిన బ్రెజిల్ స్టార్

మాడ్రిడ్: ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ చరిత్రలో శుక్రవారం అద్భుతం చోటు చేసుకుంది. బ్రెజిల్ జట్టు కెప్టెన్, స్టార్ ప్లేయర్ నెమార్ జూనియర్ కోసం ఫ్రాన్స్‌కు చెందిన పారిస్ సెయింట్-జెర్మయిన్ (పీఎస్‌జీ) క్లబ్ జట్టు కళ్లు చెదిరే మొత్తం చెల్లించింది. ప్రొఫెషనల్ లీగ్స్‌లో ప్రస్తుతం స్పెయిన్‌కు చెందిన బార్సిలోనా క్లబ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న నెమార్ ఇక నుంచి పీఎస్‌జీ జట్టుకు ఆడనున్నాడు. 2013లో బార్సిలోనా జట్టుతో చేరిన నెమార్ 2018 జూన్ వరకు బార్సిలోనాకు ఆడాల్సి ఉంది. అయితే నెమార్‌ను ఒప్పందం గడువు పూర్తికాక ముందే బదిలీ చేయాలంటే తమకు 22 కోట్ల 20 లక్షల యూరోలు (రూ. 1,661 కోట్లు) చెల్లించాలని పీఎస్‌జీ జట్టుకు బార్సిలోనా షరతు విధించింది. దీనికి అంగీకరించిన పీఎస్‌జీ జట్టు ఈ మొత్తాన్ని బార్సిలోనాకు చెల్లించి నెమార్‌ను కొనుగోలు చేసింది. 2022 వరకు పీఎస్‌జీ జట్టుకు ఆడనున్న నెమార్‌కు ఆ క్లబ్ ఏడాదికి 4 కోట్ల 50 లక్షల యూరోలు (రూ. 336 కోట్లు) వేతనంగా చెల్లించనుంది. దీంతో నెమార్ ప్రపంచంలో అత్యధిక మొత్తం తీసుకోనున్న ఫుట్‌బాలర్‌గా రికార్డు సృష్టించాడు. శుక్రవారం పారిస్ చేరుకున్న నెమార్ జట్టుతో చేరాడు. అతనికి 10వ నంబర్ జెర్సీని కేటాయించారు.

ఇప్పటివరకు ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ చరిత్రలో ఖరీదైన బదిలీ రికార్డు పాల్ పోగ్బా (ఫ్రాన్స్) పేరిట ఉంది. గతేడాది మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్ 10 కోట్ల 50 లక్షల యూరోలు (రూ. 785 కోట్లు) జువెంటాస్ క్లబ్ (ఇటలీ)కి చెల్లించి పోగ్బాను కొనుగోలు చేసింది. తాజాగా నెమార్ ఈ రికార్డును సవరించాడు.

ఆ ఇద్దరిని లంక బ్యాట్స్‌మెన్ స్ఫూర్తిగా తీసుకోవాలి

సునీల్ గావస్కర్

శ్రీలంకపై రెండో టెస్టులోనూ భారత జట్టు మరో భారీ విజయం దిశగా పయనిస్తోంది. రెండో రోజు ఆటలో కోహ్లి సేన 600లకు పైగా పరుగులు చేయడంతో లంక కష్టాల్లో పడింది. బంతి ఇప్పటికే స్పిన్‌తో పాటు బౌన్స్ కూడా అవుతోంది. ఇక ఈ ఇబ్బందిని ఎదుర్కోవాలంటే ఆతిథ్య జట్టు అద్భుతం చేయాల్సిందే. ఆరంభం నుంచి పిచ్ స్లోగా ఉండటంతో పాటు తొలి రోజు ఆట ముగియగానే స్పిన్నర్లకు అనుకూలంగా మారింది. మొదటి రోజే పుజారా, రహానే శతకాలు బాది జట్టు స్కోరును దాదాపు 350కి చేర్చారు. అయితే రెండో రోజు ఆరంభంలోనే వీరిద్దరు పెవిలియన్‌కు వెళ్లాల్సి వచ్చింది. అయినా లంక బౌలర్లు తమ తప్పులను తెలుసుకోకుండా బంతులను వేయడంతో మిగిలిన బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బంది ఎదురుకాలేదు. అశ్విన్ తన వేగవంతమైన బ్యాటింగ్‌తో జట్టుకు సౌకర్యవంతమైన స్కోరును అందించాడు. అతడిని కట్టడి చేయడానికి లంక కెప్టెన్ చండిమాల్ విశ్వప్రయత్నమే చేశాడు. అశ్విన్ స్లాగ్ స్వీప్ షాట్లను అడ్డుకునేందుకు ఫీల్డర్లను అతడికి దగ్గరలో మోహరించి ఒత్తిడి పెంచాలని భావించాడు. ఇక లంక బ్యాట్స్‌మెన్ ఇప్పుడు చేయాల్సిందల్లా పుజారా, రహానేలను స్ఫూర్తిగా తీసుకొని... సాధ్యమైనంత ఎక్కువసేపు క్రీజులో నిలిచి భారీ భాగస్వామ్యాలు నిర్మించాలి. అప్పుడే భారత స్పిన్నర్లకు సవాల్ విసిరినట్టవుతుంది. స్ట్రయిక్‌ను రొటేట్ చేసుకుంటూ డాట్ బంతులపై ఆందోళన వదిలితే మంచిది. షార్ట్ పిచ్ బంతులను కట్ లేక పుల్ షాట్స్ ఆడుకుంటూ వెళితే లంకకు లాభం. అయితే వారికి ఇదంతా సులువు కాకపోవచ్చు.. కానీ ఆ జట్టు ఆశావహ దృక్పథంతో ముందు కెళ్లాల్సి ఉంది.

కెరీర్‌లో తొలిసారి...

ఏటీపీ-500 టోర్నీ క్వార్టర్స్‌లో యూకీ బాంబ్రీ



వాషింగ్టన్: మరో అద్భుత విజయంతో భారత టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ సిటీ ఓపెన్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 200వ ర్యాంకర్ యూకీ 6-7 (5/7), 6-3, 6-1తో ప్రపంచ 100వ ర్యాంకర్ గిడో పెల్లా (అర్జెంటీనా)పై గెలిచాడు. ఈ గెలుపుతో ఢిల్లీకి చెందిన 25 ఏళ్ల యూకీ తన కెరీర్‌లో తొలిసారి ఏటీపీ-500 పాయింట్ల టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఏటీపీ సర్క్యూట్‌లో ప్రైజ్‌మనీ, పాయింట్ల పరంగా టోర్నీలను ఐదు స్థాయిలుగా (గ్రాండ్‌స్లామ్స్ (2000 పాయింట్లు), వరల్డ్ టూర్ ఫైనల్స్ (1500 పాయింట్లు), వరల్డ్ టూర్ మాస్టర్స్ సిరీస్ (1000 పాయింట్లు), ఏటీపీ-500, ఏటీపీ-250 పాయింట్లు) విభజిస్తారు. ఇందులో సిటీ ఓపెన్ నాలుగోస్థాయి టోర్నీ. అంతేకాకుండా ఏటీపీ వరల్డ్ టూర్ ఈవెంట్ టోర్నీలో యూకీ వరుసగా మూడు విజయాలు నమోదు చేయడం... చెన్నై ఓపెన్ (2014లో) తర్వాత ఓ ఏటీపీ వరల్డ్ టూర్ టోర్నీలో యూకీ క్వార్టర్ ఫైనల్‌కు చేరడం కూడా ఇదే తొలిసారి కావడం విశేషం. పెల్లాతో రెండు గంటల తొమ్మిది నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ తొలి సెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయాక ఒక్కసారిగా విజృంభించి వరుసగా రెండు సెట్లు గెల్చుకున్నాడు. రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్, 22వ ర్యాంకర్ గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై యూకీ సంచలన విజయం సాధించిన సంగతి విదితమే. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 45వ ర్యాంకర్ కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)తో యూకీ ఆడతాడు.

మరోవైపు ఇదే టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో సానియా మీర్జా (భారత్)-మోనికా నికెలెస్క్యూ (రొమేనియా) జంట సెమీఫైనల్‌కు చేరింది. క్వార్టర్ ఫైనల్లో సానియా-మోనికా ద్వయం 6-3, 6-2తో జేమీ లోబ్-యాష్లే వీన్‌హోల్డ్ (అమెరికా) జోడీపై గెలిచింది.

మళ్లీ ఓడిన తమిళ్ తలైవాస్

నాగ్‌పూర్: క్రికెట్ దిగ్గజం సచిన్ జట్టు తమిళ్ తలైవాస్ మళ్లీ ఓడింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో శుక్రవారం నాగ్‌పూర్ అంచె పోటీలు ప్రారంభం కాగా... జోన్-బిలో జరిగిన తొలి మ్యాచ్‌లో తలైవాస్ 31-32 స్కోరుతో బెంగళూరు బుల్స్ చేతిలో ఒక పాయింట్ తేడాతో పరాజయం చవిచూసింది. హైదరాబాద్‌లోనూ ఓడిన తమిళ జట్టుకు వరుసగా ఇది రెండో ఓటమి. అనంతరం జరిగిన జోన్ 'ఎ' మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 26-21 స్కోరుతో దబంగ్ ఢిల్లీపై విజయం సాధించింది. ***నేడు జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబాతో దబంగ్ ఢిల్లీ... బెంగళూరు బుల్స్‌తో యూపీ యోధ తలపడతాయి. ఈ పోటీలను 'స్టార్ స్పోర్ట్స్-2' ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.***

'మా వేతనాలు కూడా పెంచండి'

న్యూఢిల్లీ: జాతీయ క్రికెట్ సెలక్షన్ కమిటీకి చెందిన సీనియర్, జూనియర్ సెలక్టర్లు తమ వేతనాలను పెంచాల్సిందిగా బీసీసీఐని కోరారు. దేశవాళీ క్రికెటర్లతో పాటు మ్యాచ్ అధికారుల వేతనాలను పెంచే ప్రయత్నంలో ఉన్నామని ఇటీవల బోర్డు పేర్కొంది. దీంతో సెలక్టర్లు తమ గురించి కూడా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సీనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు సీజన్‌కు రూ.60 లక్షలు పొందుతున్నారు. అదే జూనియర్ ప్యానెల్ సభ్యులు ఏడాదికి రూ.40 లక్షల వేతనం తీసుకుంటున్నారు.

ప్రణయ్, సౌరభ్ వర్మ ఓటమి

ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులు హెచ్ఎస్ ప్రణయ్, సౌరభ్ వర్మ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో ప్రణయ్ 10-21, 22-20, 21-23తో లిన్ యు సియెన్ (చైనీస్ తైపీ) చేతిలో... సౌరభ్ వర్మ 19-21, 16-21తో అన్‌సీడెడ్ లీ చెయుక్ యుయి (హాంకాంగ్) చేతిలో ఓడారు.

విజేందర్ x జుల్పికర్

'డబుల్' టైటిల్ కోసం నేడు అమీతుమీ



ముంబై: డబ్ల్యూబీవో 'డబుల్' టైటిల్ కోసం భారత స్టార్ ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్ నేడు చైనాకు చెందిన జుల్పికర్ మైమైటియాలితో తలపడనున్నాడు. ఇప్పటిదాకా ఓటమి లేకుండా ఎనిమిది నాకౌట్ విజయాలతో దూసుకెళుతున్న విజేందర్ ఈ బౌట్‌పై కూడా ధీమాగా ఉన్నాడు. 'ఇది భారత్, చైనా మధ్య పోరు. దేశం మొత్తం నా వెనకాలే ఉందని తెలుసు. ఈ బౌట్‌పై నేను పూర్తి విశ్వాసంతో ఉన్నాను. కచ్చితంగా నాదే గెలుపు. పూర్తి ఫిట్‌నెస్ కోసం ఒక్క రోజులోనే రెండు కిలోలు తగ్గాను. బౌట్‌లో అతడు ఆడే విధానాన్ని బట్టి నా ప్రణాళికలు ఉంటాయి. నా టెక్నిక్ కూడా మార్చుకున్నాను' అని డబ్ల్యూబీవో ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్‌వెయిట్ చాంపియన్ విజేందర్ తెలిపాడు. జుల్పికర్ ప్రస్తుతం డబ్ల్యూబీవో ఓరియంటల్ సూపర్ మిడిల్‌వెయిట్ టైటిల్ విజేతగా ఉండగా నేటి బౌట్‌లో గెలిచిన విజేతకు ప్రత్యర్థి టైటిల్ కూడా దక్కుతుంది.

రాత్రి గం. 7.00 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం



అనుచరులతో కలసి గేటు వద్దకు వచ్చి కంచాలపై దరువు వేస్తున్న ముద్రగడ

ముద్రగడ పాదయాత్రకు మళ్లీ బ్రేక్

ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డ ఉద్యమనేత

ప్రత్తిపాడు: చట్టం చంద్రబాబుకు చుట్టంలా మారిందని, తమకు మాత్రం సెక్షన్ 30, 144 కేసులా? అంటూ ముద్రగడ పద్మనాభం తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. తాను రోజూ పాదయాత్రకు బయలుదేరతానని చెప్పిన మేరకు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం శుక్రవారం ఉదయం పాదయాత్ర ప్రారంభిస్తే గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఓఎస్డీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముద్రగడ పాదయాత్రను అడ్డుకోవడంతో ఆయన నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి సభలు, సమావేశాలు పెట్టినపుడు బెంజి సర్కిల్‌లో రోజుల తరబడి ట్రాఫిక్ మళ్లించేస్తారని, తన పాదయాత్రకు మాత్రం అనుమతినివ్వడంలేదని విమర్శించారు. 2009 సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం పాదయాత్రకు అనుమతి లేదంటున్న అధికారులు 2014లో చంద్రబాబు ఏ గైడ్‌లైన్స్ ప్రకారం పాదయాత్ర చేశారో చెబితే తాను కూడా ఆ మేరకు నడుచుకుంటానని తెలిపారు. పోలీసు బెటాలియన్‌లో ఓ ఐజీ ఇష్టానుసారం డ్యూటీలు వేసిన సందర్భంలో పోలీసు కుటుంబాలే బీభత్సం సృష్టించిన సంగతిని ముద్రగడ గుర్తు చేశారు. సమస్యలు వచ్చినపుడు పోలీసు కుటుంబాలే రోడ్డెక్కినపుడు ఎవరి అనుమతి తీసుకున్నారని ప్రశ్నించారు. 'నేను అనాథను, నా వెనక ఎవరూ లేరని ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రులతో చెప్పిస్తున్నారు కదా... నా వెనక ఎవరూ లేనప్పుడు నా పాదయాత్రకు మీరే రికమెండ్ చెయ్యొచ్చు కదా' అని ఓఎస్డీకి సూచించారు. పోలీసులు అడ్డుకోవడంతో వెనుదిరిగిన ముద్రగడ కాసేపటికి అనుచరులతో కలిసి గేటు వద్దకు వచ్చి కంచాలపై దరువు వేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాపు జేఏసీ నేతలు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, తుమ్మలపలి రమేష్, చెక్కపల్లి సత్తిబాబు, గౌతు స్వామి తదితరులున్నారు. మళ్లీ శనివారం పాదయాత్రకు బయలుదేరతానని ముద్రగడ చెప్పారు.

నేడు ఐటీ కార్యాలయాలు పనిచేస్తాయి..

సాక్షి, హైదరాబాద్: ఆదాయ పన్ను దాఖలుకు చివరి తేదీ కావడంతో శనివారం సైతం ఐటీ కార్యాలయాలు పని చేయనున్నాయి. 2016–17 ఆదాయపన్ను వివరాలు, 2017–18 అడ్వాన్సు సమర్పణకు ఆగస్టు 5 చివరి తేదీగా కేంద్రం నిర్ణయించింది. ఐటీ దాఖలు వివరాల సమర్పణలో పన్నుదారులకు కలిగే ఇబ్బందులను పరిష్కరించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ఆదేశాల మేరకు శనివారం రాత్రి వరకు ఐటీ కార్యాలయాలు పని చేస్తాయని ఆదాయ పన్ను శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

నంద్యాల ప్రజలే బాబుకు బుద్ధి చెబుతారు

పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి

సాక్షి, అమరావతి: నంద్యాల ఉప ఎన్నికలో సీఎం చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడున్నరేళ్లుగా చంద్రబాబు చేసిన మోసపూరిత వాగ్దానాలు, అవినీతి, అసమర్థ పాలనపై ప్రజలు విసిగిపోయారని తెలిపారు. విచ్చల విడిగా అవినీతికి పాల్పడుతూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. నంద్యాల అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోని బాబు ఉపఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం శోచనీయమన్నారు. నంద్యాల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం అబ్దుల్ ఖాదర్ శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నట్టు వెల్లడించారు. గుజరాత్‌లోని వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కాన్వాయ్‌పై జరిగిన రాళ్ల దాడిని రఘువీరా, ప్రధాన కార్యదర్శులు గిడుగు రుద్రరాజు, జంగా గౌతంలు ఖండించారు.

ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువు
16 వరకు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియెట్ ప్రవేశానికి సంబంధించి తుది గడువును ఈనెల 16 వరకు పొడిగిస్తున్నట్టు బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీలోగా అన్ని కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

సెజ్ భూములపై కౌంటర్ దాఖలు చేయాలి

చివరి అవకాశం ఇచ్చిన సుప్రీం కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: నిరుపయోగంగా ఉన్న స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్) భూముల వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయని ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు సుప్రీం కోర్టు చివరి అవకాశాన్ని ఇచ్చింది. కౌంటర్ దాఖలకు 4 వారాలు గడువుఇస్తూ తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. నిరుపయోగంగా ఉన్న సెజ్‌ల భూములను వెనక్కి ఇవ్వాలని, వీటిలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలంటూ కాకినాడ సెజ్ బాధిత రైతులు దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. శుక్రవారం ఈ కేసు విచారణకురాగా కేంద్ర ప్రభుత్వం ఈ పిటిషన్‌లో మొదటి ప్రతివాదిగా కేబినెట్ సెక్రటరీని పెట్టారని, జాబితా నుంచి దీనిని తొలగించాలని కోరింది. దీనిని ధర్మాసనం తిరస్కరించింది. గత విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించగా ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు కౌంటర్ దాఖలు చేయలేదు. న్యాయస్థానం ఇచ్చిన అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకోనందున ఇక విచారణ ముందుకు సాగాలని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కొలిన్ గోన్‌సాల్వేస్, కె.శ్రవణ్‌కుమార్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. సెజ్‌లలో 50 వేల ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. పిటిషనర్ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి దశలో తుది విచారణ జరుపుతామని పేర్కొంది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.